

తదనంతరం

తదితర కథలూ, వ్యాసాలూ, ఇంకా అవీ ఇవీ

నిడదవోలు మాలతి

సర్వస్వామ్యసంకలితము
(పట్టించుకోనివారికి ఓ నమస్కారం)

నిడదవోలు మాలతి

నవంబరు 2025

విషయసూచిక

ముందుమాట

ఈనాటి సాహితీక్షేత్రంలో ప్రతివిషయం గోరుముద్దలు తినిపించినట్టు కొందరివిషయంలో. అలా చెప్పినప్పుడు కూడా అపార్థం చేసుకుంటారు కొందరు. వీరందరినీ కాదనుకుని, నాకు అలవాటయిన పద్ధతిలోనే ముగించడానికి ప్రయత్నిస్తాను.

నేను అనేకకోణాలు ఆవిష్కరించేను ఈరచనలలో. వీటిల్లో తెలుగుసాహిత్యంగురించీ సమాజంగురించీ నేను దృఢంగా నమ్మిన అంశాలు ఉన్నాయి. ఈసాహిత్యం పోతున్నదిక్కు అసంగతమా అభ్యుదయమా అన్న సందిగ్ధం ఉంది. చిత్తశుద్ధి లోపించిందన్న తపన ఉంది. హాస్యం ఉంది. హేళన ఉంది. చమత్కారం ఉంది. చూడగోరినవారికి చక్కని భాష కూడా ఉందనే అనుకుంటున్నాను.

చిత్తశుద్ధి ఆత్మగౌరవం మౌలిక విలువలు. అవి నారచనల్లో కనిపిస్తాయి. అంతేకాక, అందరికీ అలవాటైన ఆషామాషీ కబుర్లు కూడా ఉన్నాయి. మొత్తం ఈసంకలనంలో ఇన్ని అంశాలు సమిష్టిగా చూస్తే వెరసి "నేను," అంటే నాతత్వం మీరు గ్రహించగలరు. ఇలా ఒక సంపూర్ణ ఆకారాన్ని ప్రతిష్ఠించడంకోసం ఇంతకుముందు ఇతరసంకలనాలలో ఉన్నవి కూడా కొన్ని మార్పులు చేసి ఇక్కడ చేర్చేను.

ప్రధానంగా తెలుగుసాహిత్యం ఎంతగా మారిపోయిందో పరీక్షించి చూసుకోడం, ఆమార్పులవల్ల సాహిత్యం నాకు ఎంత దూరమైపోయిందో ప్రతిపాదించడమే నాలక్ష్యం. నేను అమెరికా రాకముందు నాకు ఆదృష్టి లేదు. మిగతా విషయాలు ఇంతవరకూ ప్రచురించిన సంకలనాలు చూస్తే మీకు కూడా తెలుస్తుంది.

మనసంప్రదాయంలో లేని కొత్త రీతులను చేపట్టి అనుసరిస్తున్నారు చాలామంది. ముఖ్యంగా వీరు సమకాలీనసాహిత్యాన్ని నడుపుతున్న మహారథులు అనుకోవచ్చు. కానీ వారు అనుసరించి ప్రచారం చేస్తున్న రీతులు గర్హనీయం అనే నాఅభిప్రాయం. ఈవిషయాలు సవిస్తరంగా, సోదాహరణముగా కొన్ని వ్యాసాల్లో చర్చించేను. ఆ కొత్త రీతులలో కొన్ని నన్ను నేరుగా నిరసించడమే కాక సార్వజనీనముగా హితవు కాని సాహిత్యం కూడా సృష్టించడం శోచనీయం. ఇటువంటి విషయాలు గమనించి ఆధునిక సాహిత్యంలో పోకడలగురించి కొందరైనా నిజాయితీతో ఆలోచించుకోగలరని ఈసంకలనం కూర్చేను.

నారచనలని మనస్ఫూర్తిగా ఇష్టపడి చదవేవారు కూడా ఉన్నారని నాకు తెలుసు. ఇంతకాలం నేను బ్లాగు నడపడానికి కారణం వారిచ్చిన స్ఫూర్తి. వారందరికీ మనఃపూర్వక ధన్యవాదాలు. వారికోసం నా రచనలన్నీ ఆర్కైవ్.ఆర్గ్ లో పదిలపరిచేను. ఆర్కైవ్.ఆర్గ్ నేతలకు ధన్యవాదాలు.

ఇవి స్వీయరచనలు, కాపీ పేస్ట్ వ్యవహారం కాదని హామీపత్రం రాసి ఇద్దాం అనుకున్నాను కానీ అందులో హాస్యం అర్థం కాక విపరీత అర్థాలు లాగగల వీరవిదులు ఉన్నారు కనక ఆ సరదా హతం. మన్నించగలరు. హాహ

(11.30.2025)

2025 ప్రవేశిస్తున్న సందర్భంలో

నా సాహిత్యకృషి సంగ్రహంగా ఇది.

1953లో కథాప్రపంచంలో ప్రవేశించేను.

1973లో అమెరికానేలమీద అడుగు పెట్టేను.

2001లో thulika.net website తెరుచుకుంది, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు విజాతీయులకి పరిచయం చేసే ఉద్దేశంతో.

2007లో మొదలైన **తెలుగుతూలిక** బ్లాగుతో అంతర్జాలం నాకు మరొక వ్యక్తిత్వాన్ని ప్రసాదించింది. ఇది మరొక లోకం. తదనుగుణంగా నారచనల్లో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. క్రమంగామీకు తెలుస్తుంది.

అమెరికాజీవనవిధానంలో వచ్చినమార్పులు అంతకన్నా విపరీతం. వాటిమూలంగా సామాన్యుల జీవనసరళిలో వచ్చినమార్పులు మరీ ఘోరం. ఆధునిక పండితులకి సమ్మతం కాకపోవచ్చు కానీ ఇదే సత్యం అని నేను నమ్ముతున్నాను. అంచేత తెలుగు సాహిత్యసేవ అయిందనిపించుకుని, రాజకీయ పరిజ్ఞానం పెంచుకునే ధోరణిలో పడ్డాను. నావ్యాపకాలు ముఖపుస్తకానికి పరిమితం చేసుకున్నాను. ఈనాటి రాజకీయాలలో సామాన్యుల జీవన సరళి ఎంత ఘోరమయిందో పరిశీలించి చూడడమూ, దానిపై వ్యాఖ్యానాలు రాయడం వరకే ప్రస్తుతం నాకృషి.

(డిసెంబరు 30, 2024)

ఈ నాధోరణిని మరింత విస్తృతం చేసిన వ్యాసాలు మరో రెండు కింద ఇస్తున్నాను. మొదట తెలుగురాతలు వదిలేసి, ఇంగ్లీషురాతల్లోకి దిగడం ఎలా జరిగిందో చెప్తాను. 2013లో ముఖపుస్తకంలో నాముఖం పొడసూపింది. ఈ మధ్యకాలంలోనే ఇతరవేదికలు – twitter, instagram – కూడా నాకలం కన్నాయి. నాసాహిత్యసేవ ముగిసినట్టే. కారణం తెలుగుసాహితీక్షేత్రంలో వచ్చినమార్పులు. అవి నాకు అయోమయం. మరోమాట కూడా చెప్పకతప్పదు. అంతర్జాలంలో తెలుగు బ్లాగులు చూడకపోతే, తెలుగుబ్లాగు తెరుచుకునేది కాదు. ట్రంప్ అధ్యక్షుడు కాకపోతే సామాన్యజనాలకి ఇన్ని అవస్థలు కలిగేవి కాదు. నన్ను మరే పనీ తోచకుండా చేసిన పరిస్థితికి కారణం అమెరికా

రాజకీయవాతావరణమే. దానికి మూలం ట్రంప్ విపరీత పాలనావిధానాలే. అవి నచ్చినవారికి నామాటలు నచ్చవు. కానీ వాస్తవాన్ని అంగీకరించకతప్పదు. సూక్ష్మంగా జరిగింది, జరుగుతున్నది ఏమిటంటే నాయిల్లు తగలబడితే నాకు కష్టం. ఆ ఇల్లు మళ్ళీ కట్టడానికి పూనుకున్న కంట్రాక్టరుకి పరమానందం. ట్రంప్ పాలసీలు మెచ్చేది అలాటి కాంట్రాక్టరులే. వ్యాపారస్తులూ, ధనవంతులూను. వారికి ట్రంప్ పాలసీలు లాభిస్తాయి. అంచేత వారికి ఆనందం. మన తోలురంగు వ్యవహారం కూడా అలాగే ఉంది. ఆయనని మెచ్చే ధనవంతులయిన తెలుగువారి తోలురంగు లెక్కలోకి రాదు. కానీ నాలాటి సామాన్యుల బతుకులు మాత్రం సర్వనాశనం. జడ్జీలు ట్రంప్ పాలసీలని బ్లాక్ చేస్తున్నారు అన్యాయమని. కానీ ట్రంప్ వాటిని పట్టించుకోడంలేదు. ఈ పరిస్థితుల్లో వీటిగురించిన ఆలోచనలతో నాకు మరే ఆలోచనా తోచడం లేదు.

మరేమీ తోచక, టీవీ పెడితే తెరమీద కూడా ఈ రాజకీయాలే. ఈమధ్య యూట్యూబు అంతర్జాలంలో మరో లోకం అయిపోయింది. అక్కడ కనిపించని అంశం లేదు. విసుగ్గా చానెల్సు మార్చుకుంటూ పోతుంటే ఒక రోజు శంకరస్తోత్రాలు తగిలేయి. **దశశ్లోకీ.** అద్భుతంగా అనిపించింది. అద్వైతవేదాంతం అంతా సంగ్రహంగా పది శ్లోకాలలో ఉంది. ఆతరవాత **బ్రహ్మజ్ఞానావళిమాల** కనిపించింది. మరో రెండురోజులతరవాత జిడ్డు కృష్ణమూర్తిగారి విడియోలు తగిలేయి. ఆయనపేరు నేను చాలాకాలం క్రితమే విన్నాను కానీ వారి పుస్తకాలేమీ చదవలేదు. ప్రస్తుతం టీవీలో చిన్నచిన్న విడియోలలో వారికథనాలు పెట్టేరు. సుమారుగా ఆరూ పది నిముషాలవ్యవధిలో అయిపోతాయి. బాగున్నాయనే అనిపించింది. ఈవిషయాలన్నీ క్రమంగా వేరే రాస్తాను.

ఇప్పుడు అసలు విషయానికి వస్తాను. నా తెలుగు వ్యాసంగానికి మంగళం పాడేసి, ఇక మీదట రాసేవన్నీ ఇంగ్లీషులో రాయదలుచుకున్నాను!

అదెలా జరిగిందంటే…

తెలుగులో రాయడం మానేసేక,

తెలుగువారందరికీ దూరం అయిపోయేక,

నిత్యావసరాలకి ఇంగ్లీషులో మాట్లాడడం, రాయడం తప్పనిసరి అయిపోవడంచేత,

రాజకీయాలమీద పట్టుదల పెరిగి వ్యాఖ్యానించడం మొదలు పెట్టేక

వ్యాఖానాలు ఇంగ్లీషులోనే రాయాలి కనక …

ఇంగ్లీషు నన్ను ఆవరించేసింది, నాకే తెలియకుండా. పైన చెప్పిన సందర్భాలలో, ఏం రాయాలో, ఏం చెప్పాలో ఆలోచిస్తుంటే. నాకు తెలీకుండానే నాలో నేను ఆలోచించుకుంటున్నప్పుడు ఆఆలోచనలకి తగిన భాషే తలలో తిరుగుతోంది.

మరోమాట కూడా చేర్చాలి. ఈనాటి యువతకి తెలుగు మాటాడడం వచ్చినా, రాయడం, చదవడం రాదు. అంచేత ఇంగ్లీషులో రాస్తే, కొన్ని విషయాలు వారు కూడా తెలుసుకుంటారని, తమ అభిప్రాయాలు కూడా వెలిబుచ్చుతారనీ అనుకున్నాను. అలా ఇంగ్లీషు నాభాష అయిపోయింది. అది తెలుసుకోడానికి కొంత కాలం పట్టింది.

మొదట మరో బ్లాగు మొదలు పెట్టడానికి ప్రయత్నించేను కానీ సరిగా కుదరలేదు. ఇక్కడ ఎలాగా ఏమీ రాయడంలేదు కనక అదే ఇక్కడే కొనసాగించాలని నిర్ణయించుకుని మరో పేజీ తెరిచేను ఈబ్లాగులోనే. అక్కడ కొనసాగిస్తాను.

పైన చెప్పిన నాతలలో చెలరేగుతున్న ఆలోచనలను అక్షరగతం చేయడానికి మూలం మాఅమ్మాయి. నేను రాద్దాం అనుకుంటున్నాను అంటే రాయి అని తను అనకపోతే, ఈ కొత్తతలపు వచ్చేది కాదు. ఆవివరాలు నాఇంగ్లీషు తూలిక పేజీలో చూడండి.

నేను రాయబోయే వ్యాసమాలిక పేరు My Notes to my Daughter.

ఇంతవరకూ తెలుగు తూలికని ఆదరించిన పాఠకులందరికీ నమోవాకములు.

ప్రస్తుతానికి ఇంతే. ఎప్పుడైనా బుద్ధి పుట్టి ఒక తెలుగుటపా రాస్తే రాయొచ్చు. ఇప్పట్లో మాత్రం జరగదనే అనుకుంటున్నాను.

పరిస్థితులు మనిషిని మారుస్తాయి. మనిషి మారినపరిస్థితులను తనకి అనుకూలంగా మార్చుకుంటాడు. నాకో మలుపు ఎదురైనప్పుడల్లా తదనుకూలంగా వ్యాపకాలు మార్చుకున్నాను. ఉదాహరణకి అమెరికా రాకపోతే అనువాదాలతలపు వచ్చేదు కాదు. తెలుగుపాఠాలు కంప్యూటరులో పెట్టకపోతే, తెలుగుబ్లాగుమాట తోచేదు కాదు.

June 11, 2025.

(ఇక్కడ ఈటపాలో కొంత గందరగోళం ఉంది. 2025 జనవరిలో కొత్తసంవత్సరం ప్రారంభసమయంలో రాసినటపా కొంచెం పెంచి ఇప్పటివరకూ వచ్చిన మరికొన్ని మార్పులు కూడా చేర్చేను. గమనించగలరు. - నవంబర్ 2025)

కథలు

మతిమరుపు, ధారణ

పెద్దవాళ్లకి మతిమరుపు అంటారు కానీ ఈరోజుల్లో మతిమరుపు లేనిదెవరికి? చిన్నా పెద్దా, ఆడా మగా, పండితులూ అపండితులూ అందరికీ మతిమరుపు అలవాటయిపోయింది.

పూర్వకాలంలో అసలు మతిమరుపు ఉండేది కాదేమో. ఎందుకంటే విద్యాభ్యాసంలో కంఠస్థం చేయడం ఒక భాగం. లెక్కలు వల్లించడం, పద్యాలు కంఠతా పట్టడం సర్వసాధారణం. అసలు ఒకవిషయంమీద ధ్యాస పెట్టగలగడమే ఒక మెచ్చదగ్గ కళ. అప్పట్లో ఎవరు గానీ తాము చేపట్టిన పనిలో మునిగిపోయి, ఇతర విషయాలు పట్టించుకునేవారు కాదు. ఇప్పుడలా కాదు. ప్రతివారికీ ఇంటిపనులూ, ఆఫీసుపనులూ, వచ్చేపోయే చుట్టాలు, స్నేహితులూ, వీటన్నిటికంటె తలకు మించి పేసుబుక్కూ, ఎక్సూ, ఇంస్టగ్రామూ, ఇంకా కొత్తగా వస్తున్నవీ అన్నీ కలిసి జనాలబుర్రలు తినేస్తున్నాయి. అంచేత ఎవరైనా "అయ్యో మరిచిపోయేను" అంటే "అంతేలే" అనాలి కానీ "ఎలా మరిచిపోయేవు" అంటూ చిరాకు పడే రోజులు కావు. ఇది ఒక పాఠం.

మరోపాఠం మనం ఉంటున్న ఇళ్లూ వాకిళ్లూ. పూర్వం చాలామటుకు ఎవరిళ్లు వాళ్లవి, ఇంటివెనక పెరళ్లూ, చేదబావి, ఇంటిచుట్టూ ప్రహరీగోడలూ, ఇంటిముందు వేపచెట్టూ, అలా ఎన్నో సౌలభ్యాలు. మొక్కలు నాటుకోడం దగ్గర్నుంచి, వేపచెట్టుకింద జంబుఖానా పరుచుకుని దానిమీద కాళ్లు చాపుకు కూచుని కబుర్లు చెప్పుకోడంవరకూ ఎన్నో వ్యాపకాలు. ఇప్పుడు కాంప్లెక్సులు అనబడు వాటాభవనాలు వచ్చేసేయి, వచ్చేస్తున్నాయి. చిన్నవాటా మొదలు నాలుగు గదులూ, మూడు బాత్రూములూ ఇంకా జకూజీలాటి అనేక విశేషసౌకర్యాలతో వస్తున్నాయవి. మరోరకం సౌఖ్యాలూ అసౌఖ్యాలూ కూడా వచ్చేయి వాటాబతుకుల్లో. ఇల్లు అన్న పదానికి అర్థం మారిపోయింది.

ఆ విలాసాలవాటాలమాట వదిలేస్తే, నాలాటి సామాన్యులు నివసించే వాటాల్లో సర్వసాధారణం ఇరుగూ పొరుగులతో నామమాత్రంగానైనా పలకరింపులు. అంటే మళ్లీ పూర్వంలా మనసు విప్పి

మాటాడుకునే స్నేహాలూ, ఆత్మీయతలూ కావు. పైపైమెరుగుల పలకరింపులు. అది కూడా నువ్వున్నఊరు ఎంత పెద్ద పట్నం అయితే ఆత్మీయత అంతే ఉంటుంది విలోమదిశలో.

పాతిక వాటాలున్న మేడలో "హలో, బాగున్నావా," అంటూ మనని దాటుకుపోయేవారు ఇద్దరో ముగ్గురో ఉంటారు. చాలామంది అసలు కనిపించరు. ఉద్యోగాలూ, వేళలూ, ఇంకా ఏవో వ్యాపకాలతో.

మాభవనంలో ఒకరిద్దరు ఆగి నన్ను ఎలా ఉన్నావని అడిగి, ఏమైనా కావలిస్తే అడుగని కూడా అనేసి దాటుకుపోయేవారు ఉన్నారు. అలా అనేవారిలో ఒకావిడకథ అన్నమాట ఇది.

000

ఇంక భవనంమాటకొస్తే, మాది రెండంతస్థులమేడ. చాలా పాతకాలంనాటిది. అంటే మీదవాటాలవాళ్లు కిందవాటాలవారికి తంటాలు తెచ్చి పెడుతున్నామోమోనన్న యావ ఉండాలి. నా పైవారికి అలాటి యావ ఉందా లేదా అని నేను అట్టే ఆలోచించలేదు చాలాకాలం. నామటుకు నేను ఎప్పుడూ రెండో అంతస్థులోనే ఉంటూ వచ్చేను. ఈమధ్యనే కిందవాటాలోకి మారేను. ఎందుకు అంటే అది వేరే కథ. అంచేత అది వదిలేసి ఈకథకి వస్తాను. ఇంతకీ తొలిసారి ఏదో పొరపాటులే అనుకున్నాను. లేదా పాతమేడ కనక రిపేర్లు మామూలే కాబోలు అనుకున్నాను కూడా.

రెండువారాలక్రితం మాత్రం చిరాకు కలిగింది. బాత్రూందగ్గర ఏకధాటిగా నీళ్లు కురిసేయి పైవాటాలోంచి.

హాడావుడిగా మేనేజరుకి మెసేజి పెట్టేను ఐఫోనులో.

ఆవిడ వెంటనే జవాబిచ్చి, తరవాత కిందకొచ్చి మాయింట్లో వరద చూసి విస్తుపోయింది. తరవాత ఆవిడ పైవాటాకి వెళ్లి తెలుసుకున్నదేమిటంటే, సింకులో నీళ్లకోసం కొళాయి తిప్పి, ఆపని పూర్తి కాకముందే మరోపనిలో పడి … కొళాయిమాట మరిచిపోయేరు. తమతప్పేమీ లేదు. మతిమరుపు, అంతే అన్నారు!

ఆశ్చర్యం ఏమిటంటే, తమకేమీ ఇబ్బందేమీ లేదని మేనేజరుని పిలవలేదు. మరి నీళ్లన్నీ నాగదిలోకి కదా వచ్చేయి. వాళ్లకి చిన్న తడి.అంతే. అలా పిలవవలసిన అవుసరం నాకే కలిగింది.

నామాట విని, మేనేజరు ఓ మోపెడు తువాళ్లతో వచ్చి ఆ నీళ్లన్నీ తుడుస్తూ చెప్పినకథ, పైవారి నిర్లక్ష్యం మూలంగా ఇలాటివి చాలానే జరగడంవల్ల తనకీ, ఇంటి యజమానికీ కూడా చిరాకుగానే ఉందనీ, పైవాటాలో వాళ్లకి గట్టిగా బుద్ధి చెప్పవలసిన సమయం వచ్చిందనీ.

ఈసారి కొంచెం పెద్ద ఇబ్బందే అయింది. వాళ్లమూలంగా నావాటాలోకి పారిన నీరు ఎలక్ట్రిక్ దీపాలకి ఉండే డోములలో కూడా చేరింది. అంచేత ప్లమరుతోపాటు ఎలక్ట్రీషియనుని కూడా పిలవవలసిన అవుసరం కలిగింది. “అతడిబిల్లు వాళ్లనే ఇచ్చుకోమంటాను, దాంతో వాళ్లకి తెలివొస్తుంది,” అంది మేనేజరు.

అప్పుడన్నమాట నాకు కూడా తెలివొచ్చింది. మునుపు వాళ్ల నిర్లక్ష్యంవల్ల కలిగిన అవస్థలూ, మేనేజరుని పిలిచి, రిపేరరుని పిలిపించి నేను పడ్డ అవస్థలన్నీ గుర్తుకొచ్చేయి. కొంచెం వివరంగా చెప్పాలంటే, పైవాళ్లు పిట్టలకోసం విసిరిన గింజలు నావాకిట్లో పడడం, ముద్దుగా మనవరాలికి నారింజపండు ఒలిచి పెడుతున్నప్పుడు నావాకిట్లో రాలిన తొక్కలులాటివి. వాటిని ఎత్తిపోసుకోవలసిన అవుసరం నాకే అయినా వాటాలంటే ఇలాటివి తప్పవు అనుకుని ఊరుకున్నాను. ఇంకొంచెం పెద్ద మతిమరుపు వాళ్ల garbage disposalలో వారు పడేసిన నానాపదార్థాలు నా సింకులోకి వచ్చి నా వంటిల్లంతా బురదయినప్పుడూ కూడా అంతే. అప్పుడు కూడా మేనేజరుని నేనే పిలిచి, ప్లమరుని పిలిపించి శుభ్రం చేయించుకున్నానే కానీ పైవారికి ఏమీ అనినట్లు లేదు.

అలాటివన్నీ ఇప్పుడు మళ్లీ గుర్తుకొచ్చేయి. వీటన్నిటికీ వేరు వేరు కారణాలు కూడా చెప్పేరు. గింజలు చల్లకూడదని రూలుందని తెలియకపోవడంలాటివి. నారింజతొక్కలు నావాకిట్లో పడడానికి కారణం అసలు ఏ వస్తువైనా మీదనించి కిందకి పడుతుందని తెలియకపోవడం. అలాగే garbage disposalలో వేసేవీ, వేయకూడనివి వేరువేరుగా ఉన్నాయని తెలియకపోవడం కూడాను. వాళ్లు నాలా మరోదేశంనుంచి వచ్చినవారు కాదు కదా. ఇక్కడ పుట్టి పెరిగినవారికి ఇలాటివి తెలీవా అని నేను అనుకోడం నా తప్పు. దానికి కారణం కూడా మతిమరుపే అంటారావిడ. నేను మాత్రం దానికి సరైన పదం నిర్లక్ష్యం అనే అంటాను.

అలా నాకోసం మాయింటికి వచ్చేవాళ్లు లేకపోయినా, పైవారి “మతిమరుపు”వల్ల వచ్చేపోయే రిపేరర్లు, ప్లమర్లే నాకు వచ్చేపోయే చుట్టాలయేరు. ఆ రిపేరుజనాలు వెళ్లేక, ఇల్లు శుభ్రం చేసుకోడం నాకు మరోపని అయింది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఈ పనులు వేరు వేరు సమయాల్లో అవి జరిగినక్షణాల్లో అంత కష్టం అనిపించదు. కానీ ఇప్పుడు ఇలా ఒక్క పెట్టున తలుచుకున్నప్పుడు ఎక్కువ బాధగా ఉంటుంది. దానికి సాయం మామేనేజరుకి కూడా అదే అభిప్రాయం కలిగిందని తెలిసేక, నాకు చురుకు పుట్టింది.

ఇలా ఆలోచిస్తుండగా, వారంరోజులనాడు నాకు మరో మెసేజీ వచ్చింది మేనేజరునుండి. "నిన్న మీరిద్దరూ మాటాడుకోడం చూసేను. ఆవిడ నీకు క్షమాపణ చెప్పుకుందా?" అని. నేను మెయిలుబాక్సు దగ్గర నిలబడి ఉన్నప్పుడు పైవాటా మతిమరుపుమనిషి నన్ను పలకరించింది. అది మామేనేజరు చూసిందన్నమాట.

క్షమాపణలేవీ లేవనీ, ఆ మూడు నిముషాల్లోనూ పదిసార్లు తన మతిమరుపుగురించి చెప్పిందనీ చెప్పేను. అప్పుడే నాకు తోచిన మరోమాట కూడా చేర్చేను. ఆరోజు ఆవిడ అనుకోకుండా ఎదురుపడి పలకరించడంతో నాకు మాట తోచలేదు కానీ మళ్లీ కనిపిస్తే, "నేను చెప్పదలుచుకున్న మాట" ఘట్టిగా చెప్పేస్తానని. "అలా చెయ్యి," అని జవాబొచ్చింది మానేజరుదగ్గర్నుంచి. దాంతో నాకు ఘట్టిగా తగిలింది నామనసులో మాట పైవారికి చెప్పేయాలని. జరిగిందంతా సాగదీయను కానీ మతిమరుపు నాక్కూడా ఉందనీ, అంచేత మరింత జాగ్రత్తగా మళ్లీ మళ్లీ తిరిగి చూసుకుంటాననీ, ఇరుగూ పొరుగులకి ఇబ్బంది పెట్టడం నాకు నచ్చదనీ ఓ నోటు రాసి పైవారితలుపుమీద పెట్టేను. తిరుగుటపాలో నాకు జవాబొచ్చింది, నాకు బుద్ధి లేదనీ, పొరపాట్లు జరుగుతాయనీ, నాకిష్టం లేకపోతే మరోఇంటికీ మారిపొమ్మనీ. అంతే కాదు, నేను ఆవిడకి క్షమాపణ చెప్పుకోవాలని కూడా మరో తాఖీదు చేర్చింది జరిగే పొరపాట్లూ ప్రమాదాలూ చిన్నవీ కావచ్చు. పెద్దవీ కావచ్చు. వాటిమూలంగా బాధ పడేవారు చిన్నవయితే పట్టించుకోరు కానీ పెద్దవయితే పోన్లెద్దూ, ఏదో మతిమరుపు అంటూ ఊరుకోలేరు. మతిమరుపుపేరున మళ్లీ మళ్లీ చిరాకు కలిగించేవయితే పట్టించుకోకతప్పదు. అదీ పొరుగువారి మతిమరుపుమూలంగా అయితే మరీ బాధ.వీటన్నిటిమధ్యా జరిగిన అసలు విషయం ప్రత్యేకంగా గమనించేరా? ఆవిడని నేనూ, నన్ను ఆవిడా ఆడుకున్న మాటలు ఘాటుగానే ఉన్నా, నేను పట్టించుకోను అనుకున్నా, ఆ మాట పట్టించుకోడం కూడా జరిగింది కనీసం ఆవిడవిషయంలో. ఆర్నెల్లయింది. ఆవిడగారి మతిమరుపు ఏమయిందో కానీ నాకు మళ్లీ ఏ తంటా రాలేదు. ఆ తరవాత జరిగినకథ - చెప్పేను కదా నేనెప్పుడూ ఆలోచిస్తూనే ఉంటానని. ముఖ్యంగా నాజీవితంలో అట్టే మనుషులూ సంఘటనలూ లేవు కనక. ఇప్పుడు మతిమరుపుతోపాటు ధారణగురించిన ఆలోచనలు కూడా వచ్చేయి. ధారణ లేక జ్ఞాపకశక్తి లోపించడంచేత మరుపు కలుగుతుందా? కావచ్చు. కానీ తేడా ఉందనే నేనుకుంటాను. ధారణకి కృషి చేయాలి. మరుపు అయాచితంగా, అప్రయత్నంగా కలుగుతుంది. ఎవరూ కావాలని మరిచిపోరు. మరిచిపోవడం అభిలషణీయం కాదు. కానీ ధారణ కావాలి. అది పెంచుకోడానికి అవస్థలు పడాలి. పూర్వం లేవు కానీ ఇప్పుడు ధారణకి అనేక వసతులూ మేడీజీ పద్ధతులూ ఉన్నాయి.

నాచిన్నప్పుడు, ఇంకా అరచేతిని ఐఫోనులు అలంకరించని రోజుల్లో, చదువులు బట్టీ పట్టడంతోనే కదా మొదలయేవి. రామః రామౌ రామాః అంటూ శబ్దమంజరితో సంస్కృతమూ, రెండొకట్లు రెండు, రెండు రెళ్లు నాలుగు అంటూ గుణింతాలూ అవీ గట్టిగా మనసులో నాటిపోయేవరకూ మళ్లీ మళ్లీ ప్రతిరోజూ చదవడమే కదా. అదే మరి బట్టీ పట్టడం. అలాగే తల్లీ నిన్ను దలంచి అంటూ పద్యాలూను. ఇప్పుడు ఆ అవుసరం లేదు. రెండు రెళ్లు ఎంత అంటే ఉండు అంటూ చేతిలో ఫోను చూస్తారు పిల్లూ పెద్దలూ కూడాను.

ఈమధ్య సంగీతకచేరీలు చూస్తుంటే కూడా నాకు అదే దోరణి కనిపించింది. పూర్వం యమ్మెస్ సుబ్బులక్ష్మి కానీ వసంతకుమారి కానీ రెండు మూడు గంటలు కచేరీలు చక్కగా పద్మాసనం వేసుక్కూచుని పాడేసేవారు. ఇప్పుడు గాయకులందరికీ పక్కన మంచినీళ్లో మరో తీర్థమో ఉండాలి. ఎదుట ఫోనో టాబ్లెటో ఉండాలి. కదాచితుగా కాగితాలు పట్టుక్కూచున్నవారు కూడా కనిపిస్తున్నారు. గాయకులే కాదు నిర్వాహకులు కూడాను. రంగస్థలంమీద కూర్చున్న విద్వాంసులని పరిచయం చేయడానికి కూడా చేతిలో ఫోనో కాగితమో చూస్తూ తప్ప చెప్పలేరు. ఆమధ్య ఒకసారి ఒకాయన రంగస్థలంమీద కూర్చున్న వైయలినిస్టుని నీపేరేమిటమ్మా అని అడగడం కూడా చూసేను. అది కూడా కాయితమ్మీద లేదన్నమాట. అందుకే అంటాను ప్రస్తుతం మనం ఉన్నది ఖాళీబుర్రల కాలం అని. ప్రతి ఒక్కరికీ తెలీని సమాచారం లేదు. అదంతా ఉండేది మాత్రం బుర్రలో కాదు, అరచేతిలో ఉంటుంది.

సాంకేతిక పరిజ్ఞానం విజృంభించి మనిషిని మనిషి కాకుండా చేసింది. నేనిక్కడ మరో సంత పెట్టక్కర్లేదు అందరికీ తెలిసినదే సాంకేతికసౌకర్యాలపేరుతో జరుగుతున్న వ్యవహారం. నేను నేను కాకుండా పోయేను. ప్రతిదీ కంప్యూటరే చూసుకుంటుంది. (తా.క. అది ఇప్పుడు ఏఅయ్ (AI)గారు వచ్చేక మరీ తెగించింది). సరదాకి చూడండి ఇలా ఉంటుంది ఏఐతో సంభాషణ.

నిన్న ఏఐగారితో చిన్న వాదన జరిగింది -

నాకు death throes అన్న పదం తెలుసు. కానీ throes అన్నది విడిగా వాడతారా అని సందేహం. దానికి ఏఐ గారు, నీదే తప్పు. అంటూ throws అన్నపదం పట్టుకు సాగదీసింది.

నేను మళ్లీ జవాబిచ్చేను. నేను అడిగింది throes గురించి, throws గురించి కాదు అని.

ఎఐ మళ్లీ సమాధానం ఇచ్చింది. నువ్వే కరెక్టు అని ఒక్కమాటలో throes విడిగా వాడొచ్చు అంది కానీ మళ్లీ throws పాఠమే సాగదీసింది.

ఇక్కడ గమనించేరా? ఈ సంభాషణ ఇద్దరు మనుషులసంభాషణలా ఉంది అనడానికి కారణం అది మధ్యమపురుషలో సాగించడం. ఎఐ నన్ను you are correct అనడంవల్ల అది ఏదో

సాంకేతికజీవితో మాటాడుతున్నట్టు లేదు. రెండోది ఏఐ కూడా తప్పులు చేస్తానని ఒప్పుకుంది. మనుషులతో నేను మాటాడడం మానేసాను. ఇప్పుడు ఈ సాంకేతిక సారుతో తప్పడం లేదు. ఇదే ఇందాకా నేనన్నది. మనిషిని చంపుకుతినేస్తోంది సాంకేతికం అక్షరాలా.

ఇంతకీ అసలు సంగతికొస్తే మరుద్దాం అన్నా మరుపురానివి కొన్నయితే, తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి, గుర్తుంచుకుంటాం, గుర్తుంచుకోడానికి తంటాలు పడతాం అనుకున్నవి కొన్ని. ఎటొచ్చీ ఈ గుర్తుంచుకోడం, జ్ఞాపకం పెట్టుకోడం మాత్రం అనుకున్నట్టు జరగదు. మతిమరుపుకీ జ్ఞాపకశక్తికీ ఉన్న అవినాభావసంబంధం అంటే అదీ అనే అనిపిస్తోంది.

(అక్టోబరు 10, 2024, సంస్కరణ 11.2.2025)

అశ్వినీదేవతల వంశజులు

పురాణపురుషుల పునరావిర్భావం అని కూడా అనొచ్చు ఈకథని.

పూర్వకాలమందు అశ్వినీదేవతలు జన్మించేరని విన్నాం. వారు దేవతలకు వైద్యులుగా ఉద్యోగాలు స్వీకరించి కొన్ని వేలసంవత్సరాలపాటు తమధర్మాలు ఎంతో చక్కగా నిర్వహించేరు. సురులందరూ ఆయురారోగ్యాలతో సుఖములు అనుభవించేరు. అసురులు తమ అసురావతారాలు చాలించి తిరిగి తమ పూర్వజన్మలు పొందేరు.

ఇలా కొన్ని యుగాలు గడిచిపోయేయి. అశ్వినీదేవతలకు పని లేకుండా పోయింది.

ఒకరోజు ఇద్దరూ తమతమ అశ్వముఖాలు చూసుకున్నారు.

చిన్నశ్విని పెద్దశ్వినిగారి అశ్వముఖము తేటిపార చూస్తూ, "భూలోకం కూడా చాలా యుగాలుగా ఉంది కదా. అక్కడ జీవులు నూతనసాధనాలు కనిపెట్టినవారై వాటితోపాటు అనేక అగచాట్లకి కూడా లోనవుతున్నారుట. కొత్త కొత్త రోగాలు కనిపెట్టేరుట. అవేమిటో చూద్దామా?" అన్నాడు.

"అవును. నేను కూడా విన్నాను. అమోఘ మేధాసంపత్తి గలవారై ఏవేవో కొత్త సాధనాలు కనిపెట్టేరని. సాధనాలతోపాటే జీవనవిధానాలూను కదా మరి. మనం కూడా ఏమైనా నేర్చుకోగలమేమో," అన్నాడు పెద్దశ్విని.

కిందకి తొంగి చూసేరు ఇద్దరూను. చూసి బెదిరిపోయేరు. అమ్మో ఎంత ప్రపంచం, ఎన్ని కొత్తముఖాలు అని ఆలోచించి, చిరురూపములు ధరించేరు. ఒకొకరూపములోనూ తమ అంశం కొంచెం పొదుపరిచేరు. వారినే మనం ఇప్పుడు డాక్టరులూ, డాక్టరమ్మలూ అంటున్నాం. ఇది పూర్వగాథ.

ప్రస్తుతానికొస్తే, మనవాళ్లకి వైద్యులు కుటుంబంలో భాగమయిపోతారు. అసలు మొదట్లో ఆయుర్వేదవైద్యులయితే మరీను. ఊరికొక్కరే. అన్ని రోగాలకీ ఒకే గుళిక. ఎంత హాయిగా ఉండేవి ఆరోజులు. ధన్వంతరివారసులుట వారు.

ఆధునికకాలంలో తెలుగుడాక్టర్ల కథలే వేరు. మీకు గుర్తుందా నాయని కృష్ణకుమారిగారికీ డా. పి.శ్రీదేవిగారికి చదువుకునే రోజులలో పరిచయం ఎంత మంచి స్నేహంగా మారిపోయిందో. శ్రీదేవిగురించి **ఏంచెప్పను నేస్తం** అంటూ ఆత్మీయమైన ఆవేదన వెలిబుచ్చుతూ కవిత రాసేరు కృష్ణకుమారిగారు.

ఆపైన ఆధునికత పెరిగేక, స్నేహాలు లేవు అన్నీ బిజినెస్సులే. ఆత్మీయంగా పలికే మాటలు కూడా మెరమెచ్చుకబుర్లలో భాగమే. ప్రాణమిత్రులలా మాటాడినా ఎడందూరంలో ఉంచే.

ఇప్పుడు కంటికో డాక్టరూ, కాలికో డాక్టరూ, వేలికో డాక్టరూ, మోచేతికొకరూ, ముంజేతికొకరూ …

అప్పుడు ఏమవుతుందీ అంటే ఈ కాయము ఒక ప్రయోగశాల అవుతుంది.

అదెలా అంటే చెప్తాను విను మరి అన్నాను కానీ ఇప్పటికీ ఇంకా అలాగే ఉంది.

000

(సెప్టెంబరు 14, 2024)

మాటా మంతీ

- సాయంత్రం త్వరగా వస్తావా?

- ఏం ఏమైనా పనుందా?

- పనేం లేదు. ఊరికే. రామంగారిని చూసి చాలా రోజులయింది. ఓమారు పలకరించి వద్దాం అని.

- ఇవాళ కాదులే. వచ్చేవారం చూద్దాం.

- సరేలే. వీలయినప్పుడే. మునిగిపోయే రాచకార్యాలేం ఉన్నాయి కనక.

***

- అమ్మా, ఇవాళ ఇంటికి రావడం ఆలస్యం అవుతుంది. నాకోసం ఎదురుచూడకు. నువ్వు తినేసి పడుకో.

- నీపుట్టినరోజని నీకు ఇష్టం అని బెండకాయవేపుడు వంకాయ పచ్చికారంపెట్టి కూరా చేసేను. నొజ్జిప్పాలు కూడా వేడివేడిగా తింటే బాగుంటాయి.

- చాలా పనుందమ్మా.

- సరేలే. పని చూసుకో. పని తరవాతే కదా తిండి తిప్పలు.

- సారీ. తప్పదు మరి. నువ్వైనా వేడివేడిగా తినేసి పడుకో.

- హాహా. సరేలే.

***

- సన్నీవేల్ ఇక్కడికి ఎంత దూరంరా?

- కొంచెం దూరమే. ఏం? ఎందుకు?

- మీచిన్నత్తయ్య గుర్తుందా? వాళ్లబ్బాయిని చూడడానికి వచ్చిందిట. నువ్వంటే ప్రాణం పెట్టేది. విశాఖపట్నం వస్తే, నిన్నసలు ఎత్తుకు దింపేది కాదు.

- నువ్వంటుంటే గుర్తొస్తోంది.

- ఓమాటు చూసొస్తే బాగుంటుంది.

- నాకు కాన్ఫరెన్సుందమ్మా. ఫిలడెల్ఫియా వెళ్తున్నాను. అక్కడ మాట్లాడడానికి సిద్ధం కావాలి. ఇప్పుడు కుదరదేమో.

- పోన్లే. ఊరికే అన్నాను. ఇప్పుడు ఆవిడని చూడకపోతే మునిగిపోయేదేముంది కనక.

***

- ఏమండీ, మీఅమ్మగారు పోయేరని ఇప్పుడే విన్నాను. సారీ.

- అవునండి. వారంరోజులయింది. ఏమిటో. అస్సలు మాట్లాడేది కాదు. ఏం కావాలో, ఆవిడమనసులో ఏముందో చెప్పేదే కాదు అడిగినా.

- అవున్ట మితభాషి అని విన్నాను. సరేలెండి. ఏం చేస్తాం. మీరు ధైర్యంగా ఉండండి.

- అసలు ఇంకా అరవైలు దాటలేదు. ఇంత వేగిరం పోతుందనుకోలేదు.

***

- ఎందుకు నాయనా నేను పోయేనని బాధపడతావు? మాట్లాడలేదంటావా? లేదు బాబూ. నేను మాట్లాడుతూనే ఉన్నాను. నీకు మాట్లాడేతీరిక లేదని, నీవంతు మాటలు కూడా నేనే చెప్పుకున్నాను. ఇప్పుడు పైనుంచి నీ వ్యాపకాలు గమనిస్తూ అలాగే మాటా మంతీ మనమధ్య సాగించుకుంటాను. బాధ పడకు. నీపని నువ్వు చూసుకో.

***

(ఈకథకి స్ఫూర్తి ఒక ప్రకటన. తల్లీ కొడుకూ కారులో వెళ్తుంటారు. ఆవిడ కారు నడుపుతూ ఉంటుంది. కొడుకు కారుఅద్దంలోంచి చూస్తుంటాడు నిశ్శబ్దంగా. ఇద్దరిమధ్య ఎలాటి మాటలు లేవు. ఆ ప్రకటనచివరలో ఒక సందేశం, "మంచి సదవకాశం చేయి జారిపోయింది" అని. సమయం ఉన్నప్పుడు కూడా మాట్లాడుకోనివారికి ఆసందేశం. ఒకరినొకరు అర్థం చేసుకోడానికి మాటలు ముఖ్యం అని.)

(మే 19, 2024)

ఉద్యోగం పురుషలక్షణం

(పరిచయవాక్యాలు కొంచెం చెప్పాలిక్కడ. కనుపర్తి వరలక్ష్మమ్మగారి **పెన్షన్ పుచ్చుకున్న రాత్రి** కథకోసం చూస్తూంటే, వారంరోజులక్రితం స్వాతి పంతులగారి స్వరంలో యూట్యూబులో దొరికింది. లంకె ఇక్కడ. స్వాతిగారికి ధన్యవాదాలు. ఎవరైనా ఆకథ పిడియఫ్ ఫార్మాట్ లో ఇవ్వగలిగితే, ఇక్కడ పంచుకుంటాను, కాపీరైటు నిబంధనలకి లోబడి ఉంటేనే పంచుకోగలను.

వరలక్ష్మమ్మగారికథమీద సమీక్ష రాయాలనుకున్నాను కానీ అచ్చుప్రతి చూసి వ్యాఖ్యానించినట్టు ఇలా విని విమర్శ కుదరలేదు. అంచేత నాఆలోచన వేరే కథ అయిపోయింది.

ఉద్యోగంలో ఉన్నప్పుడు ఉన్న వ్యక్తిత్వం ఆ ఉద్యోగం విరమించేక మరొకరకం వ్యక్తిత్వంగా రూపు దిద్దుకుంటుంది. అలవాట్లు మారిపోతాయి. ఆలోచనలు మారిపోతాయి. మాటమాటకీ అర్థాలు కూడా వేరే స్ఫురిస్తాయి. ఇంట్లో మనుషులగురించి ఆలోచనలు కూడా అప్పుడే వస్తాయి. అదే ఆవిష్కరించడానికి ప్రయత్నించేను ఈకథలో.

దేశకాలాలకి సంబంధించినంతవరకూ నాకు ఇదమిత్థమైన ఆలోచన లేదు. సుమారుగా వరలక్ష్మమ్మగారి కథాకాలమే అనుకోవచ్చు. నాకు ఆ కాలం తెలిసినంతగా ఇప్పటికాలం తెలీదు మరి.)

ఇదుగో కథ -

"ఏం చేస్తున్నావు?"

జానకి ఆ మాటకి చప్పున వెనుదిరిగి గుమ్మంలో నిలబడి తననే పరికించి చూస్తూన్న శ్రీపతిని చూసి, మళ్లీ అటు తిరిగి బుట్టలో కూరలు చూస్తూ, "ఏముంది? ఈవేళప్పుడు రోజూ చేసే పనే. ఏం కూర చేయనా అని చూస్తున్నాను," అంది.

"ఏంవున్నాయి?" అంటూ దగ్గరకొచ్చేరాయన.

జానకి ఆలోచిస్తూ జవాబు చెప్పలేదు.

"బజారుకెళ్లి ఏమైనా తీసుకురానా?"

జానకి అనుమానంగా ఆయనవేపోసారి చూసి, "ఏ(వో. సరే. వెళ్లి కాస్త తాజాగా కనిపించినవి తెండి."

"ఏం తెమ్మంటావు?"

"ఏవి అంటే ఏం చెప్పను? అక్కడ ఏం ఉన్నాయో. తాజాగా ఏవుంటే అవి తీసుకురండి. అట్టే ఆలస్యం చేయకండి," అందావిడ.

"నాలుగు వీధులకవతల ఉన్నదుకాణానికి వెళ్ళిరావడానికి ఏమిటి," అంటూ ఆయన సంచీ పుచ్చుకు వెళ్లిపోయేరు.

ఈ సన్నివేశం ఇద్దరికీ కొత్తే. పెళ్లయి యాభయ్యేళ్ళవుతోంది. ఆయనెప్పుడూ వంటింట్లో అడుగు పెట్టలేదు. కూరలు ఇంటికెలా వస్తున్నాయో ఆలోచించలేదు. ఏంకావాలని అడగడమూ కొత్తే.

ఆరోజంతా, ఆ తరవాతా శ్రీపతి అలా అస్తమానం ఏదో ఒకటి అడుగుతూనే ఉన్నాడు. ఇల్లంతా కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. జానకికి కోడలు వచ్చిన కొత్తలో రోజు లు గుర్తుకొచ్చేయి. చేతిలో పని చేతిలోనే అందుకు ఆపిల్ల చేసేస్తుంటే. తను అంది ఆయనతో, "ఈ పిల్ల వచ్చేక నాకు చేయి విరుచుకున్నట్టుంది పని లేక," అని.

శ్రీపతి నవ్వేడు, "పని లేదని బాధా? బాగుంది. సుఖపడడం కూడా నీకు కష్టంగానే ఉందేమిటి?," అంటూ. ఆ సంభాషణ ఆయనకి ఇప్పుడు గుర్తులేదు. అదే విశేషం.

000

"రిటైరయేవుట, ఇంక బతుకంతా ఆటవిడుపే. హాయిగా పదిగంటలవరకూ పడుకున్నా అడిగేవాళ్లుండరు. దేశాలు తిరగొచ్చు శలవు దొరుకుతుందో లేదో అన్నబాధ లేదు," బజారులో కనిపించిన దూరపుచుట్టం ఒకాయన అన్నాడు చిరునవ్వుతో.

శ్రీపతికి అతని ధోరణి నచ్చలేదు. నీకు పనీ పాటా లేదు. ఉద్యోగం సద్యోగం లేదు అని తనని దెప్పుతున్నట్టనిపించింది.

"వస్తా. మీవదినగారు కూరలకోసం ఎదురుచూస్తూంటుంది," అంటూ గబగబా ముందుకి సాగిపోయేడు.

ఆలోచిస్తూ అడుగులేస్తున్నాడు. తనకి ముందు ముందు రాబోయే బతుకు ఆటవిడుపులా లేదు. ఒక బోనులోంచి మరోబోనులోకి మారినట్టుంది. పొద్దున్నే లేచి గబగబా స్నానం చేసి, జానకి

పెట్టిన కాఫీ ఫలహారం అయిందనిపించుకుని పనికి వెళ్లిపోనక్కర్లేదు ఇప్పుడు, నిజమే. కానీ మనసులో మాత్రం "హాయిగా" లేదు. ఒక క్షణంనించీ మరుక్షణానికి రాళ్లబండి ఈడుస్తున్నట్టుంది.

000

కూరలసంచీ జానకికి అందించి, అలా కొంచెంసేపు తిరిగొస్తానని చెప్పి బయల్దేరేడు. రెండు వీధులు తిరిగేక లైబ్రరీకి దారి తీసేడు.

లైబ్రరీలో ఒక షెల్ఫుదగ్గర నిలబడి ఒకొక పుస్తకం తీసి చూస్తుంటే, వెనకనించి, "తాతగారూ," అన్న సంబోధన వినిపించింది.

మొదట తనని కాదనుకుని తిరిగి చూడలేదు. రెండోసారి వినిపించేసరికి, తిరిగి చూసేడు. తనవెనక రెండడుగులదూరంలో నిలబడి ఉన్న యువకుడు, "కొంచెం జరిగితే, ఆపుస్తకం తీసుకు వెళ్ళిపోతానండీ, క్లాసుకి ఆలస్యం అయిపోతోంది," అన్నాడు వినయంగా.

శ్రీపతికి చటుక్కున కోపం వచ్చింది. వెంటనే తమాయించుకుని పక్కకి జరిగేడు. పదేళ్ల మనవడు తాతగారు అంటే బాగుంది కానీ నిలువెత్తు మనిషి తనని తాతగారూ అని పిలుస్తే కఠోరంగా వినిపించింది. ఒక్కరోజులో ఎంత తేడా!

ఉద్యోగం ముగిసీ ముగియగానే తను తాత అయిపోయేడా! మళ్లీ తమాయించుకున్నాడు. ఆ కుర్రాడికేం తెలుసు తను రిటైరయేడని.

000

అమెరికాలో ఉన్న చెల్లెలు అన్నగారిఉత్తరం చూసి ఆశ్చర్యపోయింది. పదేళ్లయిఉంటుంది. శ్రీపతిని చూసి. ఇండియా వెళ్ళేముందు మామూలుగా అందరికీ రాసినట్టే అన్నయ్యకి కూడా తెలియజేసింది ఇండియా వస్తున్నాననీ, రెండువారాలుంటాననీ. "ఎవరైనా ఇంటికి వస్తే ఎందుకొచ్చేవని అడగను. రాకపోతే రాలేదేమని అడగను," అన్నాడప్పుడు.

ఇప్పుడు ఈ ఉత్తరం? ఉద్యోగం విరమించేక మనం జ్ఞాపకం వస్తాం కాబోలు అనుకుంది.

000

ఆరాత్రి పడగ్గదిలో నిలువుటద్దంముందు నిలబడ్డాడు సూటిగా చూస్తూ.

ఆలోచనలు చుట్టిముట్టేయి.

నిన్న కూరలు కావాలా అంటే జానకి మొహం అటు తిప్పుకుంది.

- నవ్వుకుంటూండి ఉండాలి.

"నీకేం, హాయిగా జీవితం అంతా శలవే ఇంక. పదిగంటలవరకూ పడుకున్నా అడిగేవాళ్లు లేరు. టైంకి ఆఫీసుకి వెళ్లాలన్న తొందర లేదు," అన్నారు ఆఫీసులో అందరూను.

- మరి నాకు హాయిగా అనిపించడంలేదేమీ?

లైబ్రరీలో కాలేజీ స్టూడెంటు తాతగారూ అని సంబోధించేడు.

- ఇంతవరకూ సార్, కాకపోతే శ్రీపతిగారూ. ఇవాళ తాతగారూనా! తాతగారు?

మళ్లీ అద్దంలోకి చూసేడు. కళ్లు పొడుచుకు చూసేడు.

సగానికి సగం కుదించుకుపోయి కనిపిస్తున్నాడు అద్దంలో.

ఉద్యోగం పురుషలక్షణం అంటారు. మనిషిఅస్తిత్వం సంఘంతో ముడిపడి ఉంది.

అస్తిత్వం ఆదాయంతో.

ఆదాయం ఉద్యోగంతో.

శ్రీపతి సుదీర్ఘ నిట్టూర్పు విడిచి వెనుదిరిగేడు.

గుమ్మంలో జానకి నిలబడి ఉంది చిరునవ్వుతో.

ఆ మధురక్షణం మాత్రం ఎప్పట్లాగే. అందులో మార్పు లేదు!!

పాఠకులారా - ఈకథకి ముగింపు మీఉద్దేశంలో ఎలా ఉంటే బాగుంటుంది?

(జనవరి 22, 2024)

వ్యాసాలు

శంకరాచార్యులు, ఉభయభారతి

ఇంతవరకూ నాకు తెలిసిన, నేను విన్న కథనం- ఒకసారి శంకరాచార్యులకీ మండనమిశ్రునికీ మధ్య వాదం జరిగింది. శంకరులు ప్రతిపాదించిన అద్వైతవేదాంతం విషయంలో. ఇద్దరూ మేధావులే కనుక వాదాలు ఉధృతంగా జరిగేయి. మండనమిశ్రునిసతి ఉభయభారతి మధ్యవర్తిగా వ్యవహరించింది.

ఆవాదనలో మండనమిశ్రుడు ఓటమి అంగీకరించేక, ఉభయభారతి తాను మిండనమిశ్రుని అర్థాంగి కనక, తనని కూడా ఓడించాలని ప్రతిపాదించింది.

ఆమె కూడా మహావిదుషి కనుక శంకరుడు అంగీకరించి, వాదనకు పూనుకోగా, ఉభయభారతి దాంపత్యవిషయంలో ప్రశ్నలు వేసింది. శంకరుడు ఆవిషయాలతో తనకు పరిచయం లేదనీ, ఆరు నెలలు గడువు కావాలని అంటాడు. ఉభయభారతి అంగీకరించింది.

శంకరుడు మరణించిన ఒక రాజుశరీరంలో ప్రవేశించి, గృహస్థజీవితం సాగించసాగేడు. మహరాజు కాయంలో నున్నది శంకరుడు అని గ్రహించిన మంత్రులు శంకరుని కాయం ఎక్కడ ఉందో కనుక్కుని దహనం చేస్తే, శంకరుడు స్థిరంగా ఉండిపోగలడని ప్రయత్నాలు చేస్తారు. ఆవిషయం తెలుసుకున్న శంకరుని శిష్యులు శంకరుని వెనక్కి తిరిగి రావలసిందిగా కోరుతారు. ఇక్కడ శిష్యులు ఆనగరంలో ప్రవేశించి ఒక శ్లోకం గానం చేస్తూ నగరసంచారం చేస్తారని విన్నాను కానీ ఆ శ్లోకపాదం గుర్తు లేదు.

- నాకు తెలిసింది సూక్ష్మంగా ఇది.

ఆతరవాత ఏం జరిగిందో నాకు తెలీలేదు. అంతర్జాలంలో కూడా స్పష్టంగా లేదు.

నాసందేహాలు -శంకరుడు తనకాయంలోనికి పునఃప్రవేశం ఎలా జరిగింది?

ఉభయభారతితో సంవాదం జరిగిందా? ఉభయభారతి కూడా ఓటమిని అంగీకరించి శంకరుని శిష్యురాలయిందని నామమాత్రంగా విన్నాను కానీ వివరాలు తెలీవు.

మరొక సందేహం - అసలు ఈకథ మూలగ్రంథాలలో ఉందా, లేక తరవాతికాలంలో ప్రక్షిప్తమా?

(4.29.2025)

పైవ్యాసం రాసేక, నాకు దొరికిన సమాచారం ఇక్కడ ఇస్తున్నాను

ఉభయభారతి వృత్తాంతం

వెనక ఒక పోస్టులో నేను ఉభయభారతిగురించి ప్రస్తావించేను. ప్రధానంగా శంకరునితో ఆమెసంవాదంగురించి బ్లాగులో అడిగేను కానీ ఎవరిదగ్గర్నుంచీ ఏ స్పందనా లేదు.

అంచేత నేనే మళ్లీ వెతుకుతుంటే, **శంకరవిజయం** అన్న గ్రంథం దొరికింది. ఇందులో ఉభయభారతీదేవి వృత్తాంతం వివరంగా ఉంది. శంకరునికీ ఆమెకీ మధ్య జరిగిన సంవాదం లేదు కానీ మండనమిశ్రుడు, శంకరుల సంవాదం విపులంగా ఉంది ఈగ్రంథంలో.

శంకరవిజయం గ్రంథానికి లింక్. ఇక్కడ

Archive.org, Ramakrishna missionకి కృతజ్ఞతలతో.

(16.06.2025)

కల్యాణి నీలారంభంగారికి మొల్లసత్కారం

సభలో నాప్రసంగం

కల్యాణి నీలారంభంగారి సాహితీప్రస్థానంగురించి నాకు తెలిసింది చాలా తక్కువ. మొట్టమొదటిసారిగా నేను కల్యాణిగారినిగురించి తెలిసింది **ఆంధ్రరచయిత్రులసమాచార సూచికలో.** రెండుజడల కల్యాణి యన్. కనిపించేరు ఆపేజీలో. ఆ తరవాత మళ్లీ నేను ఫేస్బుక్కులో చేరేక ఆమె రచనావ్యాసంగంగురించి ఇంకొంచెం తెలిసింది. అంచేత నేను చెప్పగలిగింది చాలా తక్కువ. నేను గమనించినంతలో వారిసాహిత్యంగురించి తెలిసింది ఇదీ -

ఆవిడగురించి చెప్పేముందు, ఆ రోజులగురించి కొంచెం చెప్పాలి. అప్పట్లో ఆడవాళ్లచదువులు ప్రోత్సహించేకార్యక్రమంలో భాగంగా నాన్నలు పత్రికలు కొని పడేసేవారు ఇళ్ళలో. అమ్మలూ, అమ్మాయిలూ వాటిని చదివి పడేస్తూండేవారు. కొందరు అమ్మలు మాత్రం చదివేక, ఆ పత్రికలద్వారా స్ఫూర్తి పొంది రాయడం కూడాసాగించేరు. రామలక్ష్మిగారి సమాచారసంకలనం కూడా ఆవాతావరణంలోనించి అవతరించిందే.

పోతే, కల్యాణిగారింట్లో ఈసాహితీవ్యవసాయం మరింత బలంగా సాగడమే విశేషం. వాళ్లఇల్లే ఒక సాహితీవనం. అన్నం తిన్నా అర్థాలు వెతుక్కున్నా అందరూ సమష్టిగా చేసేవారుట. అలాటి వాతావరణం చాలామందికి దొరక్కపోవచ్చు. అందుకే ప్రత్యేకంగా చెప్తున్నాను.

అలాటి వాతావరణంలో పుస్తకాలు చదవడంతోపాటు వాటిగురించి ఆలోచించడం కూడా చిన్నప్పట్నుంచే అలవాటు చేసుకున్నారుట కల్యాణిగారు. బైరప్ప, బిchin (ఆమె వాడినపదం ఇది), రాహుల్ సాంకృత్యాయన్ వంటివారి రచనలు చదివి సంప్రదాయాలు, మూఢాచారాలగురించి ఆలోచించడమే కాక విశ్లేషించి చూడడం నేర్చుకున్నాను అంటారు. అక్కడితో సరిపెట్టుకోలేదు. "ప్రతిసంప్రదాయం, ఆచారం వెనక ఉండే కారణాన్ని విశ్లేషించి ఈనాటి మన జీవనవిధానంలో ఎంతవరకు సమంజసమో అంతవరకే పాటించడం అలవాటు చేసుకున్నాను," అని కూడా అన్నారు. అదీ విజ్ఞత అంటే. మూర్ఖత, మూర్ఖులు అని మరొకరిని దెప్పిపొడవడం కాదు కావలసింది. విచక్షణతో వాటివెనక ఉన్న కారణాలు వెతికినప్పుడే సరైన అవగాహన ఏర్పడుతుంది.

నిజానికి ఆచారాలే కాదు సాహిత్యంలో ఏ అంశాన్ని అర్థం చేసుకోడానికైనా అలాటి విజ్ఞత కావాలి. అలాటి విచక్షణతో అర్థం చేసుకోకపోవడం కూడా ఆనాటి సంప్రదాయాలలాటి మూర్ఖతకిందే జమ అవుతుంది. ఈరోజుల్లో సాంఘికప్రయోజనంపేరుతో సాహిత్యాన్ని ఏదో ఒక గాటకి కట్టేస్తున్నారు కథల్నీ కవితలనీ. సరే. మళ్లీ మొదటికొస్తాను.

కల్యాణిగారు మొదట్లో కథలూ, నవలతో మొదలు పెట్టేరు. ఆతరవాత అనువాదాలు చేస్తూ స్వీయరచనలు చేయలేదేమో అనుకున్నాను కానీ ఈ సత్కారసభలో వారికథలగురించి రహ్మానుద్దీన్ గారు వివరంగా చెప్పేరు. చాలా సంతోషం కలిగించింది. ఆకథలు దొరికినప్పుడు చదువుతాను.

కన్నడరచయిత బైరప్పగారినవలమీద ఆవిడవ్యాసం చూసేకే బైరప్పగారిప్రతిభా, కల్యాణిగారి నిశితవిశ్లేషణాపటిమా కూడా నాకు తెలిసేయి. పుస్తకం.నెట్ లో ఈవ్యాసానికి running title ఉంది కనక ఇంకా కొందరిని పరిచయం చేస్తారనుకున్నాను. కల్యాణిగారి ఈకార్యక్రమం అసంపూర్ణకావ్యంగా మిగిలిపోయింది.

ముఖపుస్తకంలో ఏదైనా ఆసక్తికరమైన విషయం నేను పోస్టు చేస్తే కల్యాణిగారు ఏమంటారో అని ఎదురు చూసేదాన్ని. వస్తువు అలా ఉండగా, మరో కోణమో అంశమో టూకీగా చేర్చుతారావిడ. మరోకోణం కనిపిస్తుంది. కొత్తసంగతి తెలుసుకుంటాం. ఇది ముఖపుస్తకంలో చాలా తక్కువ కనక ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

పైగా ఆచేర్చడంలో కూడా ఒక నిబద్ధత ఉంటుంది. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు సాహిత్యాలతో ఆమెకి ఎన్నదగిన పరిచయం ఉన్నా, తనకి తెలుసు కదా అని ఆ యా సాహిత్యాలలోంచి కోటులమీద కోటులు కుప్పించేయరు. సంయమనంతో సందర్భానికి తగినట్టు ఉంటేనే ఉదహరిస్తారు. నేనూ ఇంగ్లీషుసాహిత్యం చదివేను కానీ నాకు అట్టే జ్ఞాపకం లేవు. నాపోస్టుకి కల్యాణిగారు సరైన మూలాలు అందించేవారు. ఆమెధారణ, ఆసక్తి అలాటివి.

కల్యాణిగారికి అనువాదాలవిషయంలో నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి అనువాదకులు అనువాదంలో తమస్వంత అభిప్రాయాలు చేర్చకూడదన్నది. ఈమధ్య మూలకథలో లేని వివరాలు - ఒక రోగివిషయంలో మందులపేర్లూ, మోతాదులు - చేర్చడం చూసేను. అది న్యాయం కాదనే అంటాను నేను కూడా.

కల్యాణిగారు తమ అభిప్రాయాలు నిర్ద్వందంగా చెప్తారు. విభేదించినప్పుడు కూడా చెప్పడానికి వెనుదీయరు. కిందటేడు ఈసభలోనే ఒకమాట అన్నారు. "**జేబుకథ** స్త్రీవాదకథ కాదంటే ఎవరూ ఒప్పుకోరు," అంటూ చెప్పినప్పటి కల్యాణిగారిముఖంమీద చిన్న కొంటెనవ్వు నామనసులో స్థిరంగా

ముద్ర పడిపోయింది. (మొల్లసత్కారం విడియోలో **1.01.25 దగ్గర చూడండి**). ఆ ఒక్కకథమీదా కల్యాణిగారితో విడిగా ఒక చర్చ పెట్టుకుంటే బాగుండేదనిపించింది నాకు. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

ఈయేడు మొల్లసత్కారానికి కల్యాణి నీలారంభంగారిని ఎంచుకోడం అనేకవిధాల సముచితం. ఇది కల్పనే చెప్పినట్టు కాష్ (cash) సత్కారం కాదు, కషే (**cachet**=గౌరవం, ఘనత) సత్కారం. గౌరవప్రదం. ఈమొల్ల సత్కారసభలో రచయిత జీవితచరిత్ర కాక వారిసాహిత్యకృషిని పరిశీలించడం ప్రధానం అని కల్పన రెంటాల నిర్ణయించుకుంది. సాహిత్యాభిమానులందరూ గమనించవలసిన విషయం.

కల్యాణిగారిమీద పెంచుకున్న అభిమానంతో వక్తలు వారితో తమకు కలిగిన అనుబంధంగురించి ప్రస్తావించేరు, ఒకరిద్దరు తప్పిస్తే. సాహిత్యపరంగా వారిఅభిప్రాయాలు, ఆలోచనలగురించి ఇంకొంచెం ఎక్కవ విడమర్చి చెప్పి ఉంటే బాగుండేదనిపించింది వక్తలప్రసంగాలు విన్నతరవాత.

కల్యాణి నీలారంభంగారికి మనఃపూర్వక అభినందనలు. ఈ మొల్లసత్కారం తలపెట్టి, సమర్థవంతంగా నిర్వహించిన కల్పన రెంటాలకి హృదయపూర్వక అభినందనలు.

కల్యాణి నీలారంభంగారికి మొల్ల సత్కారసభకి లింకు ఇక్కడ

(మే 27, 2024)

కీర్తనలలో ఏకవచనప్రయోగం

నాచిన్నప్పుడు రేడియోలోనూ, 78mm LP పెట్టుకుని సంగీతం వినేదాన్ని. అయినా నాకు రాగాలూ, తాళాలూ పట్టుబడలేదు. కారణం నాదృష్టి అంతా సాహిత్యంమీదే. అంచేతే ఉచ్చారణ స్పష్టంగానూ, రికార్డింగు బాగుంటేనూ, సహవాద్యాలు గాత్రాన్ని మించకుండానూ ఉంటే మాత్రమే వింటాను. క్రమంగా సాంకేతికాభివృద్ధిమూలంగా యూట్యూబులో కచేరీలు రావడంతో నాసంగీతసేవ అక్కడికే పరిమితమయిపోయింది. నాకు కావలిసిన కచేరీలు పట్టడం శ్రమగానే ఉంటోంది ఇప్పుడు.

ఇక ప్రస్తుతానికి వస్తే, 4 రోజులక్రితం "నీవల్ల గుణదోషమేమి నావల్లనే గాని" కృతి విన్నాను. ఈ కృతి నాచిన్నప్పుడు రేడియోలో విన్నాను. అప్పట్నించీ నాకు చాలా ఇష్టమైన కృతి. ఒకకథకి నేను **గుణదోషాలు** అన్న శీర్షిక ఇవ్వడం ఈకృతిలో ఆ సమాసం తీసుకునే.

ఇప్పుడు మళ్లీ వింటుంటే కొట్టొచ్చినట్టు నాకు వినిపించిన మొదటిపదం "మీ"తో ఆ కీర్తన ప్రారంభం కావడం. దాంతో కుతూహలం కలిగి యూట్యూబులో ఈ కృతి ఎవరు ఎలా పాడేరు అని కొంత పరిశోధన చేసేను. చాలామంది "మీవల్ల" అనే పాడుతున్నారు. కొందరు మాత్రం "నీ" తో పాడేరు. కనీసం కొందరైనా నీ – అనే పాడేరు కనక ఈ ప్రయోగం కూడా ఉందని ఒప్పుకోవాలి. ఇక్కడే మరొకటి కూడా ఒప్పుకోవాలి. యూట్యూబులో మీ, నీ తేడా కనుక్కోడం కష్టం అంత స్పష్టంగా వినిపించదు కనక. అంచేత, వీలయినచోట పెదవులకదలిక చూసేను. కొందరు నీ అని పాడుతున్నట్టే కనిపించింది. సుప్రసిద్ధ గాయకులు, మహరాజపురం సంతానం, బాలమురళీకృష్ణ. నీ అనే పాడినట్టు కనిపించింది. యమ్మెస్ సుబ్బలక్ష్మి మాత్రం మీ అనే పాడేరు.

ఆతరవాత అంతర్జాలంలో చూస్తే చాలామంది బ్లాగర్లు, ఒకటి రెండు సైటులు కూడా మీ అన్న పాఠమే ఇచ్చేరు. నేననుకోడం అంతర్జాలంలో ఔత్సాహికులు ఒకరినొకరు చూసుకుని ఈ పాఠాంతరం తీసుకుని ఈ 'మీ' విశేషణాన్ని మరింత ప్రాముఖ్యంలోకి తెచ్చేరేమోనని. ఇలాటి పొరపాట్లు లేదా పాఠాంతరాలు సరిగా తెలియక కావచ్చు. ఇలాటిదే రామచిలుక నొకటి పెంచి అన్న చరణం. కూడా.

నాకు తెలిసి ఆ చరణం రామచిలుక నొకతె పెంచి అని. ఒకటి అంటే వ్యాకరణం సరిగా లేదనే నాకు అనిపిస్తోంది. ఇలాటివి వాదించడానికి కావలిసిన మూలాలు దొరకడం కష్టం.

మరికొంత పరిశోధన చేసేను. బ్రహ్మశ్రీ కల్లూరి ప్రభాకరశాస్త్రిగారి **త్యాగరాజకీర్తనలు సవ్యాఖ్యానము** అన్న గ్రంథం చూసేను. ఆ గ్రంథంలోని కీర్తనలు విశిష్ట పరిశోధకులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాటాకు గ్రంథాలు పరిశీలించి పరిష్కరించినపాఠంగా చెప్పుకున్నారు. ఆ గ్రంథానికి సంపాదకులు విస్సా అప్పారావుగారు. ఆయన కూడా పేరెన్నిక గన్న పండితులు. అంచేత అది ప్రమాణగ్రంథంగా తీసుకున్నాను. అందులోని కీర్తనలు తీసుకుని శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారు **త్యాగరాజ గేయార్థకుంచిక** రచించేరు వేరైన వివరణలతో. తాము కొన్ని మార్పులు చేసినట్టు చెప్పుకున్నారు కానీ, రెండు గ్రంథాలలోనూ ఈ కీర్తన లేదు. 30కి పైగా "నీ" తో మొదలైన కీర్తనలు ఉన్నాయి కానీ "మీ" తో మొదలైనది ఒక్కటి కూడా లేదు. ప్రారంభమే కాక, కీర్తనల అంతర్భాగంలో కూడా నిన్ను, నీతో, నీవే అంటూ విభక్తిప్రత్యాలతో ఏకవచనప్రయోగాలే కనిపించేయి.

నీదయరాదా, నిన్నాడనేల, నే పొగడకుంటే నీకేమి కొరత అంటూ ఏకవచనప్రయోగాలతోనే ఉన్నాయి. ఈనాడు మనం అవమానం అనుకునే 'ర'కారాంతపదాలు రారా మాయింటిదాకా, పలుకవదేమిరా, వాడేరా దైవము వంటివి కనిపిస్తాయి. అలాగే స్త్రీమూర్తులను సంబోధించినప్పుడు కూడా. నిను వినా వేల్పులెవరమ్మా అంటారు వినాయకునివలెను బ్రోవవే అన్న కీర్తనలో. రామదాసుకీర్తనలలో నీపైన చెప్పవే సీతమ్మ తల్లీ, నీనామమెంత రుచిరా లాటిప్రయోగాలు.

ఇంకా తరిచి చూస్తే, భాగవతం, మనం నిత్యం పఠించుకునే స్తోత్రాలే కాక ఛందోబద్ధకవితలలోనూ ఈ ఏకవచనప్రయోగమే ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాసభాగవతంలో కూడా తవ, తే, త్వాం అంటూ ఏకవచనప్రయోగమే ఉంది. నేను సంగీతశాస్త్రం అంతా క్షుణ్ణంగా శోధించి చూడలేదు కానీ గత 50. 60 ఏళ్లగా వింటున్న పాటలన్నిటిలోనూ ఏకవచనప్రయోగమే కనిపించింది నాకు.

"మీవల్ల గుణదోషమేమి" అన్న కీర్తన, "పొడగంటిమయ్య మిమ్ము" అన్న అన్నమాచార్యులవారి కీర్తన తప్పిస్తే మరే కృతీ దొరకలేదు నాకు, ఈ పొడగంటిమయ్య అన్న కృతిలో కోనేటిరాయుడా,

కాలమేఘుమా, శ్రీనివాసుడా అంటూ ఏకవచనసంబోధనలు ఉన్నాయి. బహుశా ఆ 'మిమ్ము" అన్నది "నీ" అనేక రూపాలలోనూ అన్న విస్తృతార్థంలో నేమో అని ఊహిస్తున్నాను.

ఈ ఏకవచనప్రయోగానికి కారణం భాగవతోత్తములు భగవంతుని విశ్వమయస్వరూపునిగా గ్రహించి, యోగనిష్ఠతో, మధురభక్తితో సంబోధించడం. మీరు అన్న గౌరవవాచకం లోకమర్యాదకి సంబంధించినది. ఈ యోగవైరాగ్యాలతో కూడుకున్న గీతాలు లోకమర్యాదలను అధిగమించినవి.

ఈఅంశాన్నే అడిదము సూరకవి బాల్యంలో, రతికేళివేళ, కవితలో, యుద్ధములో 'రా' కొట్టుట వన్నె సుమీ అంటూ సూత్రీకరించేరు.

గమనిక. ఇది కేవలం కృతులలో ఏకవచనప్రయోగం గురించి మాత్రమే. సంగీతశాస్త్రానికి సంబంధించిన విస్తృతచర్చ కాదు.

(జనవరి 6, 2024)

కొత్తతరం గాయకులు

మొదట గాయకులతో మొదలు పెడతాను. 5, 6 ఆరేళ్లక్రితం రాహుల్ వెల్లాల్ గాత్రకచేరీ విన్నప్పుడు ఇంత చిన్నబాలుడు అంతటి సంగీత పరిజ్ఞానంతో పాడుతున్నాడు, కంఠస్వరం కూడా బాగుంది అని ఆశ్చర్యపోయి, ఇక్కడ పాఠకులతో పంచుకున్నాను. ఆరోజుల్లో అట్టేమందిని నేను చూడలేదో, అలాటి యువగాయకులు అట్టే లేరో నేను గమనించలేదు. నాకు ఆ ఆలోచన రాలేదు.

ఇప్పుడు మళ్లీ 2, 3 నెలలుగా కచేరీలు వింటుంటే, హఠాత్తుగా తోచింది సగానికి సగం పైన గాయకులందరూ చిన్నవాళ్లే. చాలామంది పాతికేళ్లలోపువారే అని. కొన్ని కచేరీలలో అయితే గాయకులు, వైణికులు, మృదంగవిద్వాంసులు – అందరూ 15, 16 ఏళ్లవాళ్లే అయి, అదేదో స్కూలు నాటకంలో ఒక సీను అన్నట్టు అనిపించింది కూడా. కాని వారందరూ కచేరీస్థాయి విద్వాంసులే. నాకు చాలా నచ్చడానికి మరొక కారణం ఉంది. బాగా పేరు తెచ్చుకున్న గాయకులు ఈమధ్య వివరణలు, ఉపన్యాసాలు పెంచేరు. బహుశా అర్థవంతమే అయిఉండవచ్చు కానీ నాకు అర్థం కాదు. పైగా అవి చాలామటుకు తమిళంలో ఉంటాయి. కంఠస్వరం స్పష్టంగా ఉండదు. రికార్డింగ్ బాగుండదు. అందుకు భిన్నంగా, ఈ యువతరం చక్కగా పాడుకుంటూ పోతారంతే. అంచేత కూడా నాకు చాలా నచ్చింది.

ఇక్కడ విశేషంగా చెప్పుకోవలసిన మరో అంశం, ఈ యువగాయకులలో చాలామంది NRIలు కావడం. విదేశాలలో ఉన్న పెద్దలే తమ భాష వాడడం తగ్గిపోతోంది, సకారణంగానే అనుకోండి, భాషని ఉద్ధరించమంటూ చర్చలయితే జరుగుతున్నాయి కానీ ఇళ్లలో తెలుగు వాడడం తగ్గిపోతోంది. అంచేత ఆవాతావరణంలో ఈ పిల్లలు శ్రద్ధగా కర్నాటకసంగీతం చక్కని ఉచ్చారణతో పాడుతుంటే పరమానందంగా ఉంది. తెలుగు మాతృభాష కానివారు కూడా త్యాగరాజకీర్తనలు పాడుతుంటే నాకు ఆనందమూ, ఆశ్చర్యమూ కూడా. అప్పుడే అనిపించింది పిల్లలకి తెలుగు రావాలంటే కర్ణాటకసంగీతం నేర్పించాలి అని. వాళ్లు కచేరీలు చేసినా చేయకపోయినా భాషమీద అభిమానం ఏర్పడుతుంది.

అలాగే తోచిన మరోమాట ఒకరూ ఇద్దరూ అని లెక్కలేయడం కాదు. వీరంతా మరొకతరం అని. అంటే నాకళ్లముందు పుట్టినవారి కళ్లముందు పుట్టినతరం అన్నమాట వీరు. నేను మూడు తరాలు వెనకపడ్డాను. ఆ గాయకులందరిపేర్లూ రాయలేను. యూట్యూబులో చూడండి.

ఇక్కడే మరోమాట చెప్పాలి. యూట్యూబులో కచేరీలగురించి నాలుగుమాటలు చెప్పేను కిందటేడు. ఇప్పుడు మరింత విపులంగా చెప్తాను. ఎందుకంటే ఈ యూట్యూబు మరోలోకంగా క్షణక్షణానికీ పెరిగిపోతోంది. తెర తీయగానే కనిపించే శాఖలు చూస్తే తల తిరుగుతుంది. రాజకీయాలు, భగవత్సేవలు, సంగీతం, వంటలు, వ్యాయామం, ఆరోగ్యం, తదితర సలహాలూ, ఇదీ అదీ అని కాదు. అంతర్జాలంలో మరో చిన్న లోకం వెలిసింది. నేను Internet provider service మూసేసేక నాకు రోజులు మామూలుగానే గడిచేయి. Wi-fi ఉంటే చాలు, వేరే సర్వీసు అక్కర్లేదు నాకు అనుకున్నాను. కానీ ఆ సర్వీసుకి స్వస్తి చెప్పేసేక, ఇంకా మామూలుగా చూసే ఛానెల్సు, వార్తలు అన్నీ అందుతూనే ఉన్నాయి. ఆ ప్రొవైడెర్ ఖర్చు తప్పిందంతే.

మీరు music అని అడిగినా, ఆ సంగీతంలో విదేశీ సంగీతకచేరీలు, చిన్న చిన్న సలహాలు, అవీ కుప్పలుతిప్పలుగా తెరమీదకొచ్చేస్తాయి. పైగా ఒకే తెరపట్టులో అవే కచేరీలు మళ్లీ మళ్లీ కనిపిస్తాయి. ఇంతమంది గాయకులు ఉండగా, అవే కచేరీలే మళ్లీ ఎందుకు వస్తాయో తెలీదు.

సరే, అవన్నీ తప్పుకుని, అసలు కచేరీ పట్టుకుంటాం అనుకోండి. అక్కడ రికార్డింగ్ సాధకబాధకాలు కూడా చిరాకు పెట్టే స్థాయిలో ఉన్నాయి. అసలు ప్రక్కవాద్యాలు కూడా ఎక్కువే కొన్ని కచేరీలలో. ఇది నాకు మాత్రమేలెండి నచ్చదు. నిజ సంగీతజ్ఞులకి ఆనందదాయకమే కావచ్చు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఈ యువగాయకుల కచేరీలు చాలా సుఖంగా ఉన్నాయి. వీరికి నాఅభినందనలు.

(02.15.2025)

యన్నారై యువ కర్ణాటకసంగీత కళాకారులు

అమెరికాని ఇండియనైజు చేయుదినము వస్తుందనిపిస్తోంది ఈ యువకళాకారులని చూస్తే. అమెరికా అన్నాను కానీ ఇతరదేశాలలో కూడా గాయకులు కనిపిస్తున్నారు.

మొదట Indianize అని ఎందుకన్నానో చెప్తాను. Indianize అని ఎందుకన్నానంటే, ఆపదానికి తెలుగుపదం లేదు. ఆంధ్రీకరణం అంటే ఆంధ్రులకే పరిమితమైపోతుంది. భారతీకరణం అనొచ్చేమో కానీ అది అతకదు. వాడుకలో లేదు కనక ఎవరైనా మళ్లీ దానికి అర్థం అడగొచ్చు. అంచేత ఇండియనైజు అనే అంటున్నాను ప్రస్తుతానికి.

నామకరణమహోత్సవంకథ అయింది. ఇక, అసలు కథ ఏమిటంటే, యూట్యూబులో గానకచేరీలకోసం వెతుకుతుంటే ఒక విడియో నాకళ్లబడింది. ఇద్దరమ్మాయిలు. ఒక తెల్లవారమ్మాయి, రెండోఅమ్మాయి మనవాళ్ల అమ్మాయి. తెలుగుపిల్ల అవునో కాదో కానీ దక్షిణాది అనే అనిపించింది ఆ అమ్మాయి మాటతీరు చూస్తే. విషయం కర్ణాటకసంగీతం. ఇద్దరూ కులాసాగా కాళ్లు ముడుచుకు నేలమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

తెల్లవారిఅమ్మాయి, “మీ సంగీతం ఎంతో హాయిగా ఉంటుంది. దాన్నిగురించి చెప్పు,” అని మనవారిఅమ్మాయిని అడిగింది.

మ.వా.అ. సంగీతం నేర్చుకుని ఉంది కనక తనకి తోచినవిషయాలు వివరించింది. ఏమి చెప్పింది, అది సరిగా ఉందా లేదా అని నేను చర్చించబోవడంలేదు. నాకు ఆస్థాయి సంగీతజ్ఞానం లేదు. ఆ విడియో చూసినప్పుడు నాకు తోచింది ఏమిటంటే తెల్లవారికి మనసంగీతమందు ఆసక్తి కలగడం-

మనం అమెరికాని అనేకరంగాలలో అనేకవిషయాలలో అనుసరిస్తున్నాం సరే. కాని మనసంస్కృతి సంప్రదాయాలగురించి అమెరికనులలో కుతూహలం రేకెత్తిస్తున్నాం కూడా జరుగుతోంది. అది మనం అట్టే గుర్తించినట్టు లేదు. కనీసం ఆవిషయమై అట్టే చాటులు కూడా ఎక్కడా కనిపించడంలేదు. అందుకన్నమాట ఈ టపా.

ఒకొప్పుడు అమెరికావారి సౌకర్యార్థం మనవాళ్లు పేర్లు మార్చుకున్నారు. ఇప్పుడు అది తగ్గిపోయింది. చాలామంది తమపేర్లు, ఇంటిపేర్లతో సహా అలాగే ఉంచుకుంటున్నారు. అది తమనీ తమజాతినీ గౌరవించుకోడమే.

ఇంతకీ అసలు విషయం – సంగీతంగురించి కదా మొదలుపెట్టేను. విదేశీయులకి కర్ణాటకసంగీతంలో ఆసక్తి చాలాకాలంగానే ఉంది. అంతర్జాతీయస్థాయిలో కర్ణాటక కచేరీ చేసిన గాయని, మహా విద్వాంసురాలు యం.యస్. సుబ్బలక్ష్మి. ఆ తరవాతికాలంలో యు.యన్. లో సంజయ్ సుబ్రహ్మణ్యం కచేరీ చేసేరు. అలాగే హిందుస్థానీకచేరీ చేసిన ఖ్యాతి ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, భీమ్ సేన్ జోషి, రవి శంకర్ వంటి మహానుభావులు.

అయితే, వీరంతా మనదేశంలోనే ఉంటూ, విదేశాలలో కచేరీలు చేయడానికి మాత్రమే వెళ్లి, కచేరీలు చేసినవారు. వినేవారు ఉంటేనే కదా పాడేవారు పాడడం. అంచేత, అప్పటికే విదేశీయులు మనసంగీతంలో ఆసక్తి కనబరచడం జరిగిఉండాలి. లేదా విదేశాలలో ఉన్న మనవారే మనగాయకులని పిలిపించి కచేరీలు చేయించి ఉండాలి. ఏమైనా విదేశీయులు మనసంగీతం విని ఆనందించేరు. నేను అమెరికా వచ్చేక విన్న మొదటి అమెరికన్ పేరు జాన్ హిగిన్స్, ఆయనకి కర్ణాటకసంగీతంలో ఆసక్తి ఎలా కలిగిందో నాకు తెలీదు కానీ చెన్నై వెళ్లి కర్ణాటకసంగీతం నేర్చుకుని, కచేరీలు చేయగలస్థాయి సంపాదించుకున్నాడని విన్నాను.

అప్పటికీ ఇప్పటికీ మధ్యభాగం వదిలేస్తాను. మీకెవరికైనా తెలిస్తే చెప్పండి. ప్రస్తుతానికి, అంటే గత పదేళ్లలో కచేరీలు వింటుంటే నాకు కలిగిన ఆలోచన – ఈ కచేరీలలో చేస్తున్న యువతరం అమెరికాలో ఉంటూ, కాలేజీలలో చదువుకుంటూ చేస్తున్న సంగీతసేవ. కొందరు అమెరికాలోనే పుట్టి పెరిగినవారు కూడా కావచ్చు. ఇదీ నాకు ఆశ్చర్యం కలిగించింది. నాకు కొత్తగా పైకి వస్తున్న గాయకులంటే ప్రత్యేకాభిమానం. ఏ చిన్నదాని లేక చిన్నవాడి ముఖం కనిపించినా తప్పకుండా కొంచెంసేపు వింటాను.

కృతి భట్, హెచ్.యం. సింధు, నీనా బర్మీ, రియా రాజేష్, అనన్య అశోక్, అంజలి ప్రభల, ఇలా ఎంతోమంది యువతరంవారు కచేరీలు చేస్తున్నారు. అమెరికాలోనే కాదు, ఇండొనీషియాలో ప్రద్యుమ్న భట్, ఆస్ట్రేలియాలో మధుమతి మురళి – ఇలా ఇతర దేశాల్లో ఉండి మన శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటున్నవారు కూడా ఉన్నారు. ఫ్లోరిడాలో ప్రేమీ భట్ అన్న అమ్మాయి కేవలం అమెరికన్ పిల్లలకోసం ఒక కర్ణాటకసంగీతం క్లాసు నడుపుతోందిట.

అలాగే భరతనాట్యం. వయొలిన్, తబలా ఆదరిస్తున్నవారు కూడా ఉన్నారు. కమలాకిరన్ అన్న వైయొలిన్ వాద్యకారుడు అమెరికాలోనే ఉన్నాడని ఈమధ్యనే తెలిసింది నాకు. ఇంకా చాలామంది ఉన్నారని అంతర్జాలంలో చూసేను. నేను చెప్పినపేర్లు నేను యూట్యూబులో చూసినవి,

నాఅభిప్రాయం ఏమిటంటే, వీళ్ళందరూ అమెరికా సమాజంలో ఎదుగుదలకి కావలిసిన చదువులు సాగిస్తూ, ఈ సంగీతం నేర్చుకోడమే కాక కచేరీలు కూడా చేస్తున్నారు. ఈనాటిసమాజంలో ఒత్తిళ్లగురించి అందరికీ తెలిసిందే. పేర్లు మార్చుకోవలసివచ్చిన స్థితినుండి ఇది పెద్ద మార్పు మనవారిలో. ఈ యువతీయువకులు ఎన్ని ఒత్తిళ్లు – స్కూల్లో స్నేహితులు, ఇంట్లో తల్లిదండ్రులు, సమాజంలో కలిసిపోవడానికి అన్నిదిక్కులనుంచీ ఒత్తిళ్లు, తమ ఇష్టాలు, ఇవన్నీ తట్టుకుని ఇంత పట్టుదలతో, శ్రద్ధతో ఈవిద్యలు అభ్యసించి గర్వంగా ప్రకటించుకున్నారో తలుచుకుంటే అన్నమాట నాకు ఆశ్చర్యం.

సాధారణంగా ఈ యువతరంవారికి అమెరికన్ మిత్రులుంటారు. అంతో ఇంతో మనసంస్కృతిగురించి మాటలు సాగుతాయి వారిమధ్య. వాళ్లు కుతూహలం చూపిస్తారు. స్నేహధర్మంమీద కబుర్లు సరదాగా సాగుతాయి. ఇలా చిన్నస్థాయిలోనే కావచ్చు మనసంప్రదాయాలకి సంబంధించిన కబుర్లు సాగడం మాత్రం నిజం.

ఇలా వైయక్తికస్థాయిలో కాక, భాషలో కూడా కొన్న పదాలు చేరేయి కదా. యోగా, కర్మ, మంత్రా, నమస్తే, సొమోసా, పకోరా, చాయ్ ఇలా ఎన్నో పదాలు సర్వసాధారణమయిపోతున్నాయి. అందరికీ అర్థమవుతాయి అనను కానీ చదువుకున్నవారిలోనే అనుకుందాం మామూలయేయి. ఇది ట్విటర్, ఫేస్బుక్ లాటి వనరులు చూస్తే తెలుస్తుంది, నిజానికి బ్రిటిష్ పాలనలో మామూల్, వరండా, బంగళా, చీతా, జగర్నాట్ లాటి పదాలు బ్రిటిష్ ఇంగ్లీషులో చేరేయి కదా.

ఇండయనైజు అవుతోందని గట్టిగా ఇప్పుడే చెప్పుకోలేం కానీ అటువేపు కూడా బండి నడుస్తోందని తెలుస్తోంది. మరో నాలుగు తరాలతరవాత చెప్పుకోగమేమో. హాహాహ్. ఇప్పుడు మాత్రం మన సంగీత, నాట్య శాస్త్రాలను విదేశీయులకి పరిచయం చేస్తున్న యువతరానికి జేజేలు చెప్తాను.

పైన చెప్పిన లింక్ https://www.youtube.com/watch?v=m46PQdCHbCM

(నవంబరు 26, 2023)

హాస్యం

గానకచేరి అను అరికత

చీకటులు వీడకమున్నే లేచి హరినామస్మరణ చేసుకొనిన శుభములు కలుగుతాయని పెద్దలు చెప్పుటచేతనూ నాకు సంగీతశాస్త్రజ్ఞానము లోపించుటచేతనూ యూట్యూబు తెరచి స్వరశుద్ధితో, శృతిశుద్ధితో ఉచ్చారణశుద్ధితో భావయుక్తముగా గానము చేయ గాయకులకోసం వెతకడంతో మొదలవుతుంది నాదినము.

తెరవగానే తొలుత కనిపించేది యూట్యూబువారు అమ్మజూపే వివిధసేవలూ, వస్తుసంచయాలు, ఆవెంటనే ఇవి నీకోసమేనంటూ కొన్ని వంటలు, మరో మూడో నాలుగో క్రీడావిశేషాలూ, రాజకీయనినాదాలు, ఆపైన త్వరలోనే మొదలవుతుందంటూ ప్రకటించిన మరో కచేరీ - ఇవన్నీ దాటుకుని అరగంటక్రితం మొదలయిందన్న కచేరీ కనిపిస్తుంది. ఆ అరగంట వెనక్కి జరుపుతాను మొదటినుండీ వినాలన్న ఉత్కంఠతో. తీరా 0 ని. దగ్గరకొచ్చేక చూస్తే, నిర్వాహకులు తమ సంస్థగురించి వివరించే ఉపన్యాసం కనిపిస్తుంది. ఆతరవాత మరో ఇద్దరో ముగ్గురో ఆనాటి కచేరీలో గాయకులు, సహకారవాద్యకారులగురించి వివరిస్తారు. ఆ ఉపన్యాసాలు 5ని పట్టొచ్చు, పావుగంట పట్టొచ్చు. ఇక్కడ నాకు విచిత్రమైన విశేషం ఆ వక్తలు ఓ కాయితమో ఐఫోనో పుచ్చుకు అందులో చదువుకుంటూ పోవడం. రంగంమీద కూర్చున్న నాలుగు పేర్లు చెప్పడానికి కూడా ఆ కాయితమో ఫోనో కావాలా? ఒకొకప్పుడు ఆ కళాకారుల ప్రజ్ఞాపాటవాలు, వారిగురువులూ .. ఆ విశేషాలన్నీ చెప్పడానికి కావాలోమో మరి.

ఇవన్నీ అయి, గాయని లేదా గాయకుడు గొంతు సవరించుకుని, సహకారవాద్యకారులని సిద్ధమేనా అన్నట్టు సైగ చేసి, వారు సిద్ధంగా ఉన్నారని తెలుసుకుని ఆలాపన మొదలు పెడుతుంది. అప్పుడు నాకు తెలుస్తుది - సౌండ్ రికార్డింగు బాగులేదన్నసంగతి. సహవాద్యాలధ్వనులలో గాయనిస్వరం సరిగా వినిపించడంలేదు. ఒకొకప్పుడు బాగానే వినిపిస్తుంది కానీ నాకు ఆ గొంతు నాకు అంతగా నచ్చదు. గాయని రికార్డింగ్ ఆర్టిస్టుకి సౌంజ్ఞ చేస్తుంది వాల్యూము పెంచమని. ఇలాటివన్నీ కచేరీ మొదలుపెట్టడానికి ముందే ఎందుకు చూసుకోరో నాకర్థం కాదు.

అలాటి నాటకంతో ఆకచేరీ వదిలేసి మరో కచేరీకోసం వేట. మరో పావుగంట పడుతుంది. మళ్లీ పైవరసలో చెప్పినట్టు -- లండన్ లో మహారాణి నిర్యాణం, యుక్రేనులో రష్యాదురంతములు, ఎవరో దంపతుల వివాహ్ మహోత్సవం, మరో కచేరీ, మరో హరికథ-- ఏదో ఒక ఛానెల్ మీటినప్పుడల్లా ఏవో ప్రకటనలూ ... వీటిని దాటుకుని నాకు నచ్చిన కచేరీ పట్టుకునేసరికి మరో అరగంట. ఆ సస్పెన్సు భరించలేక fast forward చేయబోతాను కానీ లేదమ్మా, లైవంటే లైవే. తొందరపాటు పనికిరాదు. మేం ఇచ్చింది ఇచ్చినట్టు పుచుకోవాలి అని నాకు చెప్పబడుతుంది.

తెర తీయడమైనది. గాయని, వాయులీన విద్వాంసుడు, మృదంగవాద్యకారిణి, ఘటవాద్యకారుడు వేదికపై ఆసీనులయేరు. గాయని అటూ ఇటూ చూస్తూ, అటు వైలిన్ వాద్యకారునితోనో ఇటు మృదంగవాద్యకారిణితోనో ఏదో కబుర్లు చెప్తూ ఉంటుంది. ఏమై ఉంటుందాలాటి ఆలోచనలు ముసురుకుంటాయి నన్ను.

నాముందువరసలో ఆసీనులైన శ్రోతల తలల వెనుకభాగాలు కెమేరాలో తారట్లాడుతుంటాయి. మొదలు పెట్టమ్మా అని అరవాలనిపించిన కోరికని మృదువుగా ఆపుకుంటాను.

చటుక్కున ఒక యువకుడు వచ్చి మైకులు సరి చేస్తాడు. వెనక వరసలో ఉన్న ఘటవాద్యకారుడు ఎవరికో ఏదో సౌంజ్ఞ చేస్తాడు. అదేమయి ఉంటుందో అని నాకు మళ్లీ కుతూహలం.

గాయని గొంతు సవరించుకుని ఆలాపన ఎత్తుకుంటుంది. రంగంస్థలానికి బాగా దగ్గరకొచ్చి ఒక చిన్నపిల్ల ముందుకి వంగి గాయనిమొఖంలోకి చూస్తుంటుంది. వాళ్లమ్మ కాబోలు గబగబ వచ్చి ఆ చిన్నారిని పక్కకి లాక్కుపోతుంది.

కెమేరా ప్రేక్షకులవేపు తిరుగుతుంది. అటు ఇటూ తిరిగేవారు, ఎక్కడో అక్కడ సర్దుకు కూర్చునేవారూ, సెల్ ఫోనులోకి కళ్లు చికిలించి చూసుకుంటున్న అనేకమందీ ... పిల్లా పెద్దా, ఆడా మగా, అడ్డబొట్టువారు, నిలువుబొట్టువారు ఆహా మహాసభ అనిపించి మనసు ఆనందంతో ఉరకలు వేస్తుంది. లేదు. ఊరికే అన్నాను కానీ కచేరీ మొదలు పెడితే చాలు అనిపిస్తుంది.

మళ్లీ మొదట్లో చెప్పినట్టు కార్యకర్తగారొచ్చి సంఘం ఎలా మొదలయిందో, వారిధ్యేయం ఏమిటో, ఎంతటి మహామహులు ఈ సంఘున్ని ఆదరించి పావనం చేసేరో వివరించి, ఆ తరువాత గాయనినీ సహవాద్యకారులనీ పరిచయం చేస్తారు. కచేరీ ప్రారంభమవుతుంది.

గాయని సహవాద్యకారులని ఒకొకరినీ పలకరించి, అఁఆఁఁఁం ప్రారంభిస్తుంది.

మృదంగవాద్యకారుడు మృదంగాన్ని నిలబెట్టి శృతి సవరించుకుంటూ ఉంటాడు.

గాయని నీరసంగా ఆయనవేపు చూస్తూ ఉంటుంది, ముగించు తండ్రీ అన్నముఖంతో.

నాకు సందేహం వీళ్లు కచేరీ ప్రారంభించకముందే ఇదెందుకు సరి చూసుకోరూ అని.
కచేరీ ప్రారంభమవుతుంది. గాయని పాడుతున్నట్టు, సహవాద్యకారులు వాద్యాలు వాయిస్తున్నట్టు కనిపిస్తుంది. శబ్దాలు వినిపించవు.
ఎవరో ఎవర్నో హెచ్చరిస్తారు.
నాకు మళ్లీ అదే ప్రశ్న. మైకు సరిగా పని చేస్తోందో లేదో ముందే ఎందుకు పరీక్షించి చూసుకోరూ అని.
రెండునిముషాల తరవాత హోరుమని శబ్దతరంగాలు లేస్తాయి. ఒక పది నిముషాలు ఎంతో హాయిగా గాత్రం సాగుతుంటుంది.
సభలో కలకలం యథాప్రకారమే. కచేరీ మొదలయింది కదా విందాం అని వారికి తోచదు.
పాపం, గాయకురాలు కొంచెం ఇబ్బందిగా ముఖం పెట్టి, Give me some silence, please అంటుంది. నేను కల్పించలేదు ఇది. శ్రీరంజనీ సంతానగోపాలన్ కచేరీలో ఇలా అడగడం చూసేను నిజంగానే. కానీ చాలా కచేరీలలో ఇలా అడగడం లేదు. గాయకులు కళ్లు మూసుకుని పాడడానికి ఇదొక కారణం అనిపిస్తుంది నాకైతే. సంగీతం వినే ఉద్దేశంలేనివారు కచేరికీ రానేల, వచ్చిరి పో, ముందువరసలో ఆసీనులు కానేల అని నాలో నేనే కోపగించుకుంటాను.
హమ్మయ్య ఇంక వినొచ్చు అనుకునేవేళకి, మరో ప్రకటన మొదలవుతుంది. నిజానికి రెండు ప్రకటనలు. ఒక ప్రకటన మనం అనుభవించిన తరవాత (ఇక్కడ అనుభవం పూర్వజన్మ సుకృతముగా గ్రహించగలరు), మరో ప్రకటన వస్తుంది. అప్పుడు skip ad కనిపిస్తుంది. అప్పుడు నేను గబుక్కున రిమోటు పుచ్చుకు స్కిప్ నొక్కేస్తాను
ఆఖరికి నా పంట పండి, జ్ఞానమొసగరాదా అన్న కృతి వినిపిస్తుంది. మంచి కృతి. సందర్భానికి తగినట్టుంది. భగవంతునినుండి జ్ఞానము పొందవలసినవారు ఆ సభాస్థలిలో చాలామంది ఉన్నారు మరి. అదే, కబుర్లు చెప్పుకునేవారూ, ఐఫోనులో మెసేజీలు చూసుకునేవారూ, ఏదో పనున్నట్టు ఆ సభాప్రాంగణంలోనే హడావుడిగా అటూ ఇటూ తిరిగేవారూ - వీళ్లంతా అసలు సభకి రాకుండా ఉంటే బాగుండు అనిపించదూ?
పాడేవారికే కాదు, నిజంగా సంగీతం వినాలని అక్కడికి వేంచేసిన రసజ్ఞులకు కూడా అది చిరాకు కలిగించేవిషయమే కదా.
తా.క. నేను ఇంతకుముందు ఒక వాట్సాప్ గుంపులో పోస్ట్ చేసేను. గాయకులు ఎంత శ్రద్ధతో పాడతారో మీరు గమనించలేదు అని ఒక వ్యాఖ్య. నిజానికి నేను అంటున్నది అదే.

గాయనీగాయకులు ఎంతో నిష్ఠతో, శ్రమ తీసుకుని కొన్నేళ్లపాటు సాధన చేసి, కచేరి చేస్తారు. మరి కచేరీకి వచ్చిన శ్రోతలు, కచేరీ ఏర్పాటు చేసిన నిర్వాహకులు కూడా ఆవిషయం గమనించాలి కదా.

ఇది హాస్యానికి రాసేను. సరదాగా నవ్వుకోడానికి మాత్రమే. ఏ ఒక్క సంగీతకళాకారుని గానీ నిర్వాహకులని గానీ కించపరచాలని కాదు. నిజానికి వారంటే నాకు అమితగౌరవం.

(జనవరి 3, 2024)

సమీక్షలు, ముందుమాటలు

శీలా సుభద్రాదేవి. *కథారామంలో పూలతావులు* వ్యాససంపుటి

ఈ సంకలనంలో ఇరవైమూడు వ్యాసాలు, ఒక ఇంటర్వ్యూ ఉన్నాయి. వ్యాసకర్త్రి నాదో చిన్నమాట అంటూనే రెండు పెద్దవిషయాలే ప్రస్తావించేరు.

మొదటిది, నవలలు రాస్తేనే రచయితలా, ప్రతిభావంతమైన చిన్నకథలు రాసినవారిని ఎందుకు గమనంలోకి తీసుకోరు సంకలనకర్తలు అన్నది. ప్రధానంగా తెలుగు కథ 1910-2000, వందేళ్లకథకి వందనాలు వంటి సంకనలనాలలో ఎంపికగురించి ఈ ప్రశ్న. జాగ్రత్తగా పరిశీలించి చూడండి. ఈ సంకనాలలోనూ, ఇలాటి సంకలనాలలోనూ – అంటే తెలుగు సాహిత్యచరిత్రకి దర్పణాలుగా – సమకూర్చినప్పుడు తెలుగుకథలలో ఉండవలసిన వైవిధ్యం వీటిలో కనిపించదు. ఏదో ఒక కోణం- సాంఘికప్రయోజనంలాటిది- మాత్రమే దృష్టిలో పెట్టుకుని సంకలనం చేస్తే, ఆవిషయం పుస్తకంపేరులో తెలియాలి. తెలుగుకథ 1910-2000, సాంఘికప్రయోజనం ఆవిష్కరించిన కథలు అంటే వారి ధ్యేయం స్పష్టంగా తెలుస్తుంది. కానీ కేవలం తెలుగుకథ, 1910-2000 అంటే ఆ కాలంలో వేరుదృష్టితో రాసినకథలు కథలు కావని వారి అభిప్రాయం అవుతుంది. నిజానికి వారు అలా నిర్లక్ష్యం చేసినకథలలో సాంఘికప్రయోజనం గలవి చాలానే ఉన్నాయి. వారు లెక్కలోకి తీసుకోకపోవడం వైయక్తికమే. నవలారచయిత్రులుగా ప్రసిద్ధులయిన రచయిత్రులకథలు రెండో మూడో తీసుకుంటే, కేవలం చిన్నకథలు మాత్రమే రాసినవారిని నిర్లక్ష్యం చేసేరనే అనుకోవాలి. సుభద్రాదేవిగారి ప్రశ్న కేవలం కథలే రాసినా, అట్టే కథలు రాయకపోయినా, మంచి కథాలక్షణాలు కలిగిన కథలు ఈ సంకలనాలలో ఎందుకు చేర్చుకోలేదని. ఆ సంకలనకర్తలు ఈప్రశ్నకి సమాధానం ఇవ్వలేదు.

రెండో అంశం సంకలనాలమాట అలా ఉండగా, అసలు తెలుగు కథాసాహిత్యానికి సారథ్యం వహించిన సాహితీవేత్తలు తమ ప్రస్తావనలలో- ఉపన్యాసాలలో, వ్యాసాలలో, విమర్శలలో,

చర్చలలో- మంచి కథాలక్షణాలు గల కథలను కేవలం స్త్రీలు రాసినకథలు కనక నిర్లక్ష్యం చేస్తున్నారు. అనేకమంది రచయిత్రులకథలు ఈనాటి పాఠకులకు తెలియకుండా పోతున్నాయి, అంచేత ఈ వ్యాసరచన చేపట్టేనని చెప్పుకున్నారు వ్యాసకర్త్రి. ఈవిషయం ఈనాటి సాహిత్య అతిరథులూ, మహారథులూ ప్రత్యేకంగా గమనించాలి.

తెలుగుకథ చరిత్ర సమగ్రం కావాలంటే ఈ మరుగున పడిపోతున్న కథలు తప్పనిసరిగా ప్రస్తావించాలి. ఒక మంచి ఉదాహరణ – రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు మెచ్చుకున్న ఒక చిన్న కథ చెప్పుకోవచ్చు. ఆ కథపేరు **ఆ గదిలోనే**. రచయిత్రి యు. సత్యబాల సుశీలాదేవి. ఒకే ఒకపేజీలో ఒక స్త్రీ జీవితచరిత్ర ఆవిష్కరించేరు రచయిత్రి. ఆవిడ రాసిన మరో ఆరు కథలు ఈరోజు కథానిలయంలో కనిపించేయి నాకు. అంతకుమించి ఆమెగురించిన వివరాలు ఎక్కడా దొరకలేదు. ఆ ఒక్క కథ గొప్పకథ అని రావిశాస్త్రిగారు ప్రస్తావించకపోతే నాకు తెలిసేది కాదు. ఇలా చరిత్రకెక్కని రచయిత్రులూ, కథలూ ఎన్ని కాలగతిలో కలిసిపోతున్నాయో!

సుభద్రాదేవిగారు 22మంది రచయిత్రులకథలు (మందరపు పద్మ, లలిత జంటని ఒకరుగా తీసుకుంటే. లేకపోతే 23 అనొచ్చు) సేకరించి, వస్తుతత్వాన్ని పరిశీలించి చూచి, విమర్శనాత్మకంగా ఒకొక రచయిత్రికథలనూ పరిచయం చేసేరు. వ్యాసం చదివేక, పాఠకులకు ఆ రచయిత్రియొక్క భావజాలం విశదమవుతుంది. ఒకొక వ్యాసమూ సమగ్రం.

తెలుగుకథలు ఎక్కువగా చదివేవారికి కొందరిపేర్లు పరిచయమే కావచ్చు. కొందరిపేర్లు నామమాత్రంగా తెలియొచ్చు, మందరపు పద్మ, లలిత, వేదుల మీనాక్షీదేవి వంటివారి పేర్లు విని ఉండకపోవచ్చు.

మొత్తం సంకలనం అంతా చదివేక, స్త్రీల కథాసాహిత్యం మనకి తెలీనిది ఇంత ఉందా అని ఆశ్చర్యపోతాం. అందుకు సుభద్రాదేవి ఈసంకలనంలో చేర్చిన రెండు వ్యాసాలు – రచయిత్రుల కథాసాహిత్యంలో వెనుకబాటుతనం ప్రభావం, రచయిత్రుల కథానికలలో భాషాపరిణామం – తోడ్పడతాయి.

సుభద్రాదేవిగారి లక్ష్యందృష్ట్యా ఆలోచిస్తే, ఇప్పటికే బహుళప్రాచుర్యం పొందిన, దాదాపు అన్ని సంకలనాలలోనూ కనిపిస్తున్న సీతాదేవి, కామేశ్వరివంటి రచయిత్రులని ఈసంకలనంలో చేర్చకుండా ఉంటే ప్రధానోద్దేశం మరింత పటిష్ఠంగా ద్యోతకమయేది అనే నాకు అనిపించింది,

సుభద్రాదేవిగారు చేపట్టిన ప్రణాళిక ఎంతైనా హర్షించదగ్గది, శ్రమతో కూడుకున్నది. ఆమేరకు శీలా సుభద్రాదేవిగారిని మెచ్చుకోవాలి.

ఇలాటి సంకలనాలు ఇంకా ఇంకా రావాలి. వస్తాయనీ, సంకలనకర్తలు మరుగున పడిపోతున్న అనేకమంది రచయిత్రులనీ, వారికథలనీ వెలుగులోకి తీసుకొచ్చే ఆలోచనలు చేస్తారనీ ఆశిస్తున్నాను. శుభం.

(01.02.2021)

శీలా సుభద్రాదేవి. **నీడలచెట్టు** నవల

మూడేళ్లక్రితం సుభద్రాదేవి నన్ను ముందుమాట రాయమని సాదరంగా అడిగితే, రాసినది ఇది. ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.

ముందుమాట

శీలా సుభద్రాదేవి నీడలచెట్టు నవలికలో యువతజీవనసరళిలో, సమాజంలో, కుటుంబసభ్యుల ఆలోచనావిధానంలో వచ్చినమార్పులు ఆవిష్కరించేరు. సుమారుగా 20వ శతాబ్దం నాలుగోపాదంలో మధ్యతరగతి జీవితాలకి అద్దం పడుతుంది ఈ నవలిక.

అయితే మార్పు ఎప్పుడూ ఎక్కడినుంచో ఊడిపడదు. క్రమంగా ఒకొకఇంట్లో ఒకొకరు సమాజంలో కొత్తగా పాదుకొంటున్న భావజాలంమూలంగా ప్రభావితులై, తమజీవితాలను చక్కదిద్దుకోడంతో సమాజంలో మార్పు రూపు దిద్దుకుంటుంది. అంటే వ్యక్తిలో మార్పు, సమాజంలో మార్పూ కూడా పరస్పర దోహదకారులు. వ్యక్తివల్ల సమాజమూ సమాజంవల్ల వ్యక్తీ మార్పులకి గురవుతారు.

ఒక వ్యక్తి జీవితంలో అలా ప్రభావితమయే ప్రధానాంశాలు చదువు, ఉద్యోగం, పెళ్లే కదా. అయితే ఈ మూడు అంశాలూ ఆడపిల్లలకి ఒక రకం అయితే మగపిల్లలకి మరో రకం. దాన్నే వివక్ష అంటున్నాం.

వీరేశలింగంగారు ఆడవాళ్లకి చదువు కావాలన్నప్పుడు ఆయనధ్యేయం వేరు. ఆయన పెట్టిన స్కూళ్లలోనూ కాలేజీల్లోనూ చెప్పిన పాఠాలు – సతీధర్మాలు, పతిసేవ, పిల్లలపెంపకం – అన్నీ స్త్రీజాతికి ఈనాడు మనం చెప్పుకునే ఆదర్శాలు కావు. అంటే నిర్లక్ష్యం చేస్తున్నారని కాదు. తగువిధంగా మలుచుకుంటున్నారని మాత్రమే. ఆయనతరవాత ఇంగ్లీషువాళ్లు పెట్టిన స్కూళ్లలో ప్రధానోద్దేశం ఇంగ్లీషు నేర్పి మనవాళ్లని "నల్లదొరలు"గా మార్చడమే తప్ప వీరేశలింగంగారి ఆశయాలు వేరు కావు.

స్వతంత్రం వచ్చేక, మనప్రభుత్వమూ, సాంఘికసేవాతత్పరులూ, పత్రికలూ స్త్రీవిద్య, వయోజనవిద్య ప్రోత్సహించడానిక పూనుకోడంతో కొంతవరకూ ఆడపిల్లల పెంపకంవిషయంలోనూ, వారి ఆలోచనావిధానంలోనూ, "నేను ఒక మనిషినే" అన్న స్పృహ కలగడంలోనూ చెప్పుకోదగ్గ మార్పులు వచ్చేయి. సుభద్రాదేవి ఈ నవలికలో ఈ మార్పులు ప్రతిభావంతంగా ఆవిష్కరించేరు.

రామారావు, కామాక్షమ్మ దంపతులకి కలిగిన ఐదుగురు ఆడపిల్లల కథ చదువుకి సంబంధించినంతవరకూ ఈ క్రమానుగత అభివృద్ధి – మొదటిఅమ్మాయి నుంచి ఆఖరిఅమ్మాయి వరకూ – వరసగా చూపుకుంటూ వస్తారు రచయిత్రి.

చదువుతరవాత అత్యంత ప్రధానమయింది పెళ్లి. అయితే ఈ పెళ్లిదగ్గరకొచ్చేసరికి నిబంధనలు ఆడపిల్లలకి వేరూ మగపిల్లలకి వేరూ. అంతే కాదు. పెళ్లికి చదువు ముడిపడి ఉంటుంది ఆడపిల్లలవిషయంలో. బాల్యవివాహాలు అంతరించేక, (బహుశా పూర్తిగా అంతరించలేదేమో కానీ బాగా తగ్గేయి) పెళ్లి కుదిరేవరకూ చదువుకో అని కొందరు స్కూళ్లకి పంపితే, పెద్ద చదువులు చదివితే పెళ్లవదేమో అని బెంగ పెట్టుకునేవారు కొందరు. పైగా అమ్మాయిచదువు స్థాయి పెరిగినకొద్దీ పెళ్లికొడుకులు దొరకడం కష్టం. అది తల్లిదండ్రుల ఆలోచన అయితే, "అన్నయ్య చదువుకుంటున్నాడు, నేనెందుకు చదువుకోకూడదూ" అని ఆడపిల్లలు ప్రశ్నించడం మొదలయింది కూడా ఆరోజుల్లోనే.

మరొకవైపు కులాంతరవివాహాలు. అంటే అంతకుముందు లేవని కాదు. ఇప్పుడు ఈ వివాహాల సంఖ్య పెరిగింది అని. బాహాటంగా వాటిగురించి సుముఖంగానో విముఖంగానో మాట్లాడుకోడం కూడా మొదలయింది. చదువులకో ఉద్యోగాలకో వీధిగుమ్మం దాటి బయటికి వెళ్తున్న ఆడపిల్లలకి మగపిల్లలతో పరిచయాలవడం, ధైర్యంగా పెళ్లిళ్లు చేసుకోడం జరిగేయి. ఇక్కడ హాస్యాస్పదం ఏమిటంటే తల్లిదండ్రుల విపరీతధోరణులు. ఈవిషయంలో అడ్డు చెప్పేది ఎక్కువగా మగవాళ్లే. మనదేశంలో నిజమైన ప్రగతిశీలురు ఆడవాళ్లే. ధైర్యం చేసేది, ప్రోత్సహించేదీ కూడా ఆడవాళ్లే. ఇది దమయింతి, యశోద పాత్రచిత్రణలో కనిపిస్తుంది. నిజానికి చదువులవల్ల వచ్చింది కాదు. మన ధర్మశాస్త్రాలు అనులోమ వివాహాలు – పెద్దకులాల మగవారు తక్కువకులాలవారి అమ్మాయిలని పెళ్లి చేసుకోడానికి అంగీకరిస్తాయి. ఎటొచ్చీ ఆధునికయుగంలో అట్నుంచి ఇటు కూడా జరుగుతున్నాయి.

శిల్పందృష్ట్యా వెనకటిరోజులనుంచి ప్రస్తుతంవేపు సాగుతూ, ఒకొకరి మనస్తత్వాలలో, దృష్టిలో, ఆలోచనలలో వచ్చిన పరిణామాలు క్రమబద్ధంగా నడిపించేరు రచయిత్రి. పాత్రచిత్రణ, ఆడపిల్లలమధ్య సంభాషణలు ఆర్ద్రంగా ఉన్నాయి.

సుభద్రాదేవి రచయిత్రీ, కవయిత్రీ. భాషమీద మంచి పట్టుగల రచయిత్రి. “పైనం పైనంగా తీస్తోంది” వంటి జాతీయాలతోపాటు, జాబ్ వర్క్కు, వీడుగుపుస్తకం వంటిపదాలు ప్రస్తుతం వాడుకలోకి వస్తున్నవి కూడా కనిపిస్తాయి.

స్థూలంగా పైన చెప్పిన ప్రధానాంశలవిషయంలో వెనకటి ఆలోచనలకీ ప్రస్తుతపు ఆలోచనలకీ మధ్య వారధికి దర్పణం పడుతుంది ఈ నవల.

సుభద్రాదేవికి అభినందనలు.

జనవరి 3, 2021

(జనవరి 29, 2024)

కుందుర్తి స్వరాజ్యపద్మజ. **ఆకుపచ్చనేలకోసం** నవల

ఆ నవలకి నా ముందుమాట

సంఘంకంటె వ్యక్తి బలవంతుడని నేను నమ్ముతాను. ప్రతి ఒక్కరూ ఆ సంఘంలో భాగమే. ఒక్కొక్కరూ పూనుకుంటేనే సంఘం అయింది. స్వాతంత్ర్యసమరంలో సర్వశ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, పి.వి. నరసింహారావు, గుమ్మడిదల దుర్గాబాయమ్మ గారలవంటి ఎందరో మహానాయకులగురించి అందరం చదువుకున్నాం. చెప్పుకున్నాం. ఇంకా చెప్పుకుంటూనే ఉన్నాం. అయితే మనం సాధారణంగా గుర్తించని, గుర్తించినా పట్టించుకోని ఒక ముఖ్యవిషయం వీరందరికి మద్దతుగా నిలిచి, వారితోపాటు ఉద్యమంలో పాల్గొని ఉద్యమానికి మరింత బలమిచ్చి, ఫలప్రదం చేసినవారు వేలల్లో ఉన్నారు. ఏ చరిత్రపాఠాలలోనూ వీరిపేర్లు కనిపించవు. వారిపేర్లు ఎవరైనా చెప్పినా గుర్తు పట్టగలవారు నూటికో కోటికో వారి బంధువర్గంలోనివారై ఉండొచ్చు కానీ ప్రజాసమూహానికి తెలీనివే.

చరిత్ర సమగ్రం కావాలంటే వీరిచరిత్రలు కూడా తెలుసుకోవాలి. అటువంటివారు ఇద్దరు - కనుపర్తి హనుమాయమ్మగారు, కొండా సత్యవతమ్మగారు. సత్యవతమ్మగారి మనుమరాలు స్వరాజ్య పద్మజ కుందుర్తి చెప్పిన ఈ ఇద్దరు యోధులకథ ఈ పుస్తకం. ఇక్కడ "చెప్పిన" అన్న విశేషణం నేను యథాలాపంగా చేర్చలేదు. అక్షరాలా ఇది అమ్మమ్మ మనుమరాలికి చెప్పిన కథ. మనుమరాలు స్వరాజ్య పద్మజ సాయంత్రం భోజనాలయేక పక్కలు పరుచుకుని అమ్మమ్మని తన సందేహాలు అడగడం, అమ్మమ్మ వివరించి చెప్పడంగా సాగుతుంది.

దాదాపు 110 ఏళ్లక్రితం నాటిమాట అన్నారు రచయిత్రి. అంటే సుమారుగా 4, 5 తరాలకి వెనకటి సంగతి. ఇప్పటి తరానికీ, బహుశా వెనకటి రెండు తరాలకూ కూడా తెలీని సంగతులు ఇందులో అపారం. నిజానికి నేను 3 తరాలకి వెనుకటి మనిషినే అయినా నాకు తెలీనిసంగతులు ఇందులో ఎన్నో ఉన్నాయి.

అతి చిన్నతనంలోనే పెళ్ళిళ్లయి, వితంతువులైన ఇద్దరు యువతులు, హనుమాయమ్మగారూ, సత్యవతమ్మగారూ స్వాతంత్ర్యసమరంలో పాల్గొని వారు చేసిన దేశసేవను ఆవిష్కరించడమే ఈ పుస్తకం ధ్యేయమని స్వరాజ్య పద్మజగారు చెప్పి నన్ను ముందుమాట రాయమన్నారు. నేను

సాధారణంగా ఇటువంటి సాహసాలకి పూనుకోను. కానీ స్వరాజ్య పద్మజగారు తన కోరికకి జోడించిన మరోవాక్యం నన్ను ఆకట్టుకుంది. అదే పైన చెప్పిన సాధారణకుటుంబాలలోనుండి వచ్చి, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న "చరిత్రకెక్కని" ఉద్యమకారులు అన్నవిషయం. చాలామంది ఒప్పుకోకపోవచ్చు కానీ సామాన్యులని సామాన్యులు ప్రభావితం చేయడమే ఎక్కువ మనసంఘంలో. "ఆహా, నాలాటి మామూలు మనిషి ఇంత సాధించేరు" అనిపించడంకన్నా ప్రోత్సాహకరం ఏముంది? "మహాత్ముడు. ఆయనతో మనకి సాటేమిటి, మనమేం చేయగలం?" అనేవారికి హనుమాయమ్మగారూ, సత్యవతమ్మగారి జీవితచరిత్రలే సమాధానం.

ఇంటా బయటా సంప్రదాయవాదులమాటల్లో "క్రిష్ణా రామా అంటూ ఇంట్లో కూర్చోవలసిన" వితంతువులు, వీధిలో అడుగు పెట్టడమే ఘోరపాపమూ నేరమూ అయిన రోజుల్లో, స్వాతంత్ర్యసమరరంగం ప్రవేశించి, దుర్గాబాయమ్మ, పి.వి. నరసింహారావు, వి.వి. గిరివంటి ప్రముఖ రాజకీయనాయకులని కలుసుకోడమే కాదు, వారి మన్ననలు పొందడమే చెప్పుకోదగ్గ విశేషం. అది వారు ఎలా సాధించేరు అన్నది ప్రత్యేకంగా తెలుసుకోవలసిన అంశం.

రచయిత్రి అమ్మమ్మకాలంలో స్వచ్ఛమైన వాతావరణం తలుచుకుని యాభై ఏళ్ళలోనే ఎంతమార్పు, అది ఆస్వాదించిన తరం మాతోనే ఆఖరేమో అంటారు. అంటే 1930 ప్రాంతాలేమో. రచయిత్రి ఇలాటి విషయాలు ప్రస్తావిస్తున్నప్పుడు ఏ విషయం ఏనాటిదో స్పష్టం చేయడానికి తేదీలు ఖచ్చితంగా కాకపోయినా సుమారుగా ఫలానా దశాబ్దం అని సూచిస్తే బాగుండునేమో. ఉదాహరణకి పెద్దమ్మమ్మ మరణం మూడు చోట్ల ప్రస్తావించడం జరిగింది. మొదటిసారి ప్రస్తావించినప్పుడు "పెద్దమ్మమ్మ చనిపోయేక" అన్నారు. ఆమె మరణం ఎలా జరిగిందన్నది చివరలో చెప్పేరు. మధ్యలో సంఘటనలు ఎప్పుడు జరిగేయి అన్నది ఊహించుకోడం కష్టం. అలాగే అమ్మమ్మలిద్దరి జననమరణాల తేదీలు కూడా చేర్చితే బాగుంటుంది.

ఈ పుస్తకం కాల్పనికసాహిత్యం కాదు. జీవితచరిత్రల కోవలోకి చెందుతుంది. చారిత్ర్యకవ్యాసం అని కూడా అనొచ్చు. అందుచేత అనుకున్నాను తేదీలు తెలిస్తే మరింత పటిష్ఠంగా ఉండేది, చరిత్ర అర్థం చేసుకోడానికి ఇతోధికంగా ఉపయోగపడేది అని.

చిన్నతనంలో తనకి తెలీనిపదాలు వచ్చినప్పుడు "అంటే ఏమిటి?" అని మనుమరాలు అడగడంలో ఒక సొగసూ, పాఠకులకి ఒక సౌకర్యం సాధించేరు రచయిత్రి. ఆ అమ్మాయితోపాటు మనకీ తెలుస్తాయి ఓదలు, పనలువంటి పదాలకి అర్థాలు. అలా అడగని పదాలు కొన్ని, అలాదు, వారు

పోయించుకోడం లాటివి ఇప్పుడు ప్రాచుర్యంలో లేవు. వాటికి footnotesలో అర్థాలు ఇస్తే బాగుంటుందేమో.

మాటలమాట వచ్చింది కనక మరో విషయం - హైదరాబాదులో రచయిత్రి చిన్నతనంలోనే అక్కయ్యనూ ఊరినీ చూడడానికి అమ్మమ్మతో వెళ్లినప్పుడు తెలంగాణాభాషకి అలవాటు పడిపోవడం. పిల్లలకి భాష ఎంత త్వరగా వస్తుందో అనిపించింది. ఈ రోజుల్లో పిల్లలే కాదు పెద్దలు కూడా ఒక భాష వస్తే మరోభాష రాదనో మర్చిపోయాం అనో అంటున్నారు!

ఉపన్యాసాలవిషయంలో మనకొక సంప్రదాయం ఉంది. ఏ సాహిత్యసభలోనైనా తెలుగుకథమీద ఉపన్యాసాలు గురజాడ, పద్మరాజులతోనే మొదలవుతాయి. అలాగే రాజకీయసభలలో గాంధీ, నెహ్రూలతోనూ, స్త్రీలసభలయితే ఇందిరాగాంధీతోనూ మొదలవుతాయి. సత్యవతమ్మగారు మొట్టమొదటి సభలో తాను చెప్పినమాటలు చూడండి. అసలు విషయంకంటే ముందు ఆమె సభ ప్రారంభంలోనే చెప్పినమాట - "నేను ఒక స్త్రీగా కాక ఒక వ్యక్తిగా నాఅభిప్రాయాలు చెప్పబోతున్నాను" అని ప్రకటించడం. ఆ స్పృహ అవుసరం. సత్యవతమ్మ (అమ్మమ్మగారు)గారి వివేచనాపటిమ తెలుస్తుందిక్కడ.

పోతే, ప్రసంగానికి ఎంచుకున్న విషయం మరింత ఘనం. సత్యవతమ్మగారు గాంధీ, నెహ్రూ అంటూ అందరూ పాడే దంపుళ్ళపాట ఎత్తుకోకుండా, ఆనాడు ఎవరికీ అంతగా తెలీని యువకుడూ తమ ప్రాంతాలవాడూ అయిన గాదె చిన్నపరెడ్డిగురించి ప్రసంగించడానికి నిశ్చయించుకోడం. ఇందులో చమత్కారం - మొదటిది అన్ని సభలలోనూ సాధారణమైన పద్ధతికి విరుద్ధంగా మాటాడడానికి నిశ్చయించుకోడం, రెండోది స్థానికులైన సభికులదృష్టిని ఆకట్టుకోగలగడం. ఎవరికైనా స్థానికుడు అంటే ఆసక్తి కొంచెం ఎక్కువగా ఉంటుంది. ఎంత ప్రముఖనాయకులైనా, "వారినిగురించి మాకు తెలుసు" అనుకోవచ్చు. కానీ తమలో ఒకడైన వ్యక్తి చేసిన సాహసం, త్యాగం అనగానే ఉత్సాహం కలుగుతుంది. ఇది సత్యవతమ్మగారి ఆలోచనాసరళికి మచ్చుతునక.

ఆద్యంతాలా అమ్మమ్మలిద్దరూ సంప్రదాయాలను ఎదుర్కొని ఒకప్పుడు చాకచక్యంతోనూ మరొకప్పుడు సాహసంతోనూ తమ నిశ్చయాలను ఆచరణలో పెట్టడం చూస్తాం. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ఎలా ఎదుర్కొంటారన్నదే మనం గమనించవలసిన ప్రధానవిషయం. వితంతువైన సత్యవతమ్మగారి జుత్తు ఉంచడం, పోలీసులను తప్పించుకోడానికి రంగు చీరెలు ధరించడంవంటి విషయాలలో వీరి పట్టుదలా, కార్యదీక్షా కనిపిస్తాయి. నాకు ప్రత్యేకంగా నచ్చిన అంశం వీరిలో

కార్యదక్షతతో పాటు పట్టూ విడుపూ గుర్తించి తదనుగుణంగా మనుగడ సాగించుకోడం తెలిసినవారై ఉండడం. ఇది సాధారణమైన విషయం కాదు.

ఈ విశేషాలతోపాటు రచయిత్రి ఆనాటి పల్లెల్లో రాజకీయాలు, కలవారి కుటుంబాలలో ఈర్ష్యలూ, కోపతాపాలతోపాటు, దుర్మార్గుల కుట్రలూ ఎంతో విపులంగా చిత్రించేరు. మాఘస్నానాలూ, నిత్యజీవితంలో ఘట్టాలూ, ఒకటేమిటి ఏది తీసుకున్నా బుట్టెడు వివరాలు ఉంటాయి. పల్లెవాతావరణం వర్ణించినతీరు, "క్షితిజరేఖవరకూ పరుచుకున్న వరిచేలూ," "పెద్ద ఏనుగు పడుకున్నట్టుగా ఉండే కోటప్పకొండా" "నాట్లు పడినచేలు … కలనేతచీరెలా" వంటి వర్ణనలు చదువుతుంటే వరిచేల గట్లవెంట నడుస్తున్నంత ఆహ్లాదం.

కథాకథనంగురించి కూడా ఒకమాట చెప్పుకోవాలి. ఇది కౌముది.నెట్ మాసపత్రికలో 26 భాగాలుగా ప్రచురితమయింది. కొన్ని సంఘటనల సమాహారం. ఏ నెలకి ఆ నెల ప్రశ్నలకి సమాధానాలుగా వివరించిడం అర్థంవంతంగా ఉంటుంది. సందేహం లేదు. అయితే అదే సమాహారాన్ని ఒక పుస్తకంగా తెచ్చినప్పుడు సంఘటనకీ సంఘటనకీ మధ్య వ్యవధి లేదు. పుస్తకంలో నడక సాఫీగా సాగడానికి కొన్ని మార్పులు చేయవలసివస్తుంది. ఇది స్వానుభవంతో చెప్తున్నాను. దాదాపు మరొకపుస్తకం రాసినంత పని.

నాలుగైదు తరాలక్రితంనాటి విశేషాలతో మొదలు పెట్టి మూడుతరాలక్రితం వరకూ సాగిన జీవనవిధానం ఇందులో కళ్లకి కట్టినట్టు వివరించేరు రచయిత్రి. అమ్మమ్మల పుట్టుకదగ్గర్నుంచీ తన చిన్నతనంలోసే ఇన్ని వివరాలు విని, జ్ఞాపకం పెట్టుకుని అక్షరగతం చేయడం అంత తేలిక కాదు కదా. స్వరాజ్య పద్మజ కుందుర్తి గారి ధారణనీ, కథ మలిచినవిధానాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. మనచరిత్ర, స్వాతంత్ర్యయోధులచరిత్రలలో ఆసక్తి గలవారందరూ చదవవలసిన పుస్తకం.

- నిడదవోలు మాలతి

జులై 23, 2021

తా.క. నేను ముందుమాట రాస్తున్నసమయంలో ఈపుస్తకానికి working title జీవనతరంగాలు. ఆ తరవాత **ఆకుపచ్చనేలకోసం** అని మార్చేరు. ప్రస్తుతం బజారులో ఈపేరుతో దొరుకుతుంది, చూడగలరు.

భాష

భాషకీ సంస్కృతికీ అవినాభావసంబంధం ఉంది. అసలుసంస్కృతికి భాష ప్రాతిపదిక కూడా. సంస్కృతిని నిర్వచించేది భాషే. మనిషిని మనిషితో జత కూర్చేది భాష. అదే సాహిత్యంగానో వాఙ్మయంనో పదిలపరుచుకుంటున్నాం. సాహిత్యం రెండుపాయలుగా ప్రవహిస్తున్నట్టు కనిపిస్తోంది. 1. పండితులసృష్టి, 2. పామరులసృష్టి. పండితులు అంటే యూనివర్సిటీ డిగ్రీలు ఉన్నవారు అని కాదు. పామరులంటే అక్షరప్ముక్క రానివారు అనీ కాదు. పామరులు అంటే అజ్ఞులు, మూర్ఖులు అని ఆంధ్రభారతి నిర్వచనం. నేను ఆ అర్థంలో వాడడం లేదు. కాగితంమీదో గోడలమీదో పదిలపరచవారు అని మాత్రమే నా ఉద్దేశం.

ఈరెండు పాయలను ఖచ్చితంగా నిర్వచించలేను కానీ ఈవ్యాసం పూర్తయేవేళకి నాఆలోచన మీకు కొంతైనా తెలుస్తుందని ఆశిస్తున్నాను.

1. పండితులరచనలు మేధోపేతం. వారు వ్యాకరణం, ఛందస్సు, అలంకారశాస్త్రం క్షుణ్ణంగా చదువుకుని, ఆ నియమాలకి తమ ప్రౌఢిమ జోడించి రచనలు చేస్తారు. ఆ రచనల్లో చమత్కారం, భాష ప్రౌఢత, అన్నీ కవుల, పండితుల భావాలనే కాక, మేధోసంపత్తిని కూడా వెల్లడి చేస్తాయి. ఈవిషయానికి మళ్లీ వస్తాను.

2. పామరుల రచనల్లో ఈవ్యాకరణం, ఛందస్సువంటి అంశాలు ఆలోచించినట్టు తోచదు. చమత్కారం ఉంటుంది. శాస్త్రాల్లో చెప్పినట్టు అని వారు పట్టు పట్టి చెప్పకపోవచ్చు కానీ ఆపాటల్లో లయ ఉంటుంది, ఊపు ఉంటుంది. పండితులలా వారు యతిప్రాసలూ, గణాలూ లెక్కలు చూసుకోకపోయినా ఆశువుగా తోచినది చెప్పుకుంటూపోతుంటారు. లయ అయాచితంగా కుదురుతుంది. అలాగే వారికథల్లో అనేక జాతీయాలు, నానుడులు చోటు చేసుకుంటాయి. ఆ సాహిత్యం ప్రధానంగా నిత్యజీవితంలో తమఅనుభవాలను, ఆశలనూ, ఈతిబాధలనూ ప్రకటించేదిగా ఉంటుంది.

ఈ రెండు సాహిత్యాలమధ్య తేడాకి ఒక చిన్న ఉదాహరణ ఒక కూనలమ్మపదం.

కుక్కలే శునకాలు

కుండలే భాండమ్ముులు

ఆడువారే స్త్రీలు ఓ కూనలమ్మా.

కుక్కలు, కుండలూ, ఆడువారు అన్నపదాలు పామరులగేయాలలో కనిపిస్తాయి. శునకాలు, భాండాలు (భాండములు), స్త్రీలు వంటి పదాలు పండితులరచనల్లో కనిపిస్తాయి. ఈపద్యం స్త్రీలని హేళన చేయడానికి రాసినపద్యం అని ఆచార్య మలయవాసినిగారు అన్నారు. నేను మాత్రం ఇక్కడ ఎవరు ఏభాష వాడుతారు వారిసాహిత్యంలో అన్న కోణం చూపుతున్నాను. పండితులరచనలతో పామరులరచనలు పోల్చి ఎక్కువతక్కువలు నిర్ణయం చేయడంలేదు నేను. మౌలికమైన ఒక వ్యత్యాసాన్ని ఎత్తి చూపుతున్నాను. మనసుకి బుద్ధికీ మధ్యగల వ్యత్యాసం అనవచ్చు. కేవలం రెండు వర్గాలజనాలలో సృజనాత్మకతలో తేడా అనొచ్చు. ఈ తేడా ఇప్పటికీ కొనసాగుతోందని నాఅభిప్రాయం.

స్వాతంత్ర్యపోరాటం నేపథ్యంలో స్త్రీలను విద్యావంతులుగా చేసే ప్రయత్నంలో పత్రికలు వచ్చేయి.

గృహలక్ష్మి, హిందూసుందరిలాటి స్త్రీలపత్రికలు స్త్రీలరచనలని ప్రోత్సహించడం వచ్చేక, అక్షరాలు రానివారు కూడా రాయడం నేర్చుకుని ఈపత్రికలకి వ్రాస్తూ వచ్చేరు అని లక్ష్మణరెడ్డిగారు తమ **తెలుగు జర్నలిజం** సిద్ధాంతగ్రంథంలో వ్రాసేరు. ఆ స్త్రీలరచనలలో మూలతత్వం ఆ పామర రచయితలవంటిదే అంటాను నేను. వీరు కూడా లక్షణగ్రంథాలూ, కథనవిధానానికి కావలసిన సూత్రాలూ పట్టించుకోలేదు. పట్టు పట్టి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. కేవలం తాము చూసినవీ, అనుభవించినవీ రాసేరు. అవి వేలాదిసంఖ్యలో పాఠకులు ఆదరించేరు.

భాష సజీవం కనక మార్పు సహజం. కొత్తపదాలు వచ్చి చేరుతాయి, వాడుకలో లేని కొన్ని పదాలు వాడుకలో లేకుండా పోతాయి. భాష మారుతుంది అన్నవిషయంలో ఎలాటివివాదం లేదు. అయితే, ఈ మార్పు ఎప్పుడు ఎలా ఎందుకు వస్తుంది, తెలుగులో ఎలా వచ్చింది అని ఆలోచిస్తే నాకు తోచిన అభిప్రాయాలు ఇవి.

నాకు కనిపించినంతవరకూ భాషలో మార్పుకి భావాలలో మార్పుకి సంబంధం ఉంది.

ఈనాడు సాంఘికప్రయోజనం, సామాజికస్పృహ, అభ్యుదయభావాలు కథలలో ఉండాలని సాహితీవేత్తలు అంటున్నారు. ఆ ప్రాతిపదికమీదే కథలు వ్రాయడం, సంపాదకులూ విమర్శకులూ కథలని అంగీకరించడం లేదా నిరాకరించడం, విలువ కట్టడం జరుగుతోంది. నిజానికి

ప్రాచీనసాహిత్యంలో కూడా ఈవిలువలు ఉన్నాయి. సంఘంలో ధర్మం పునః ప్రతిష్ఠించడానికే నన్నయ భారతం వ్రాయడం జరిగింది అంటారు. అయితే భారతాన్ని ఇప్పుడు ధర్మాధర్మాలదృష్టితో కాదు కదా చదువుతున్నది. అల్లసానివాని అల్లిక జిగిబిగి అంటారు. మరో కవిగ్రంథంగురించి ద్రాక్షాపాకం, నారికేళపాకం అంటారు. అది సాంఘికప్రయోజనంమాట కాదు. కవిత్వం ఒక సాహిత్యప్రక్రియగా ఆదరించి, చేసినవ్యాఖ్యానాలు అవి. కేవలం సందేశం లేక ఇతివృత్తం మాత్రమే కాక, ఇతరకోణాలగురించి చేసిన విమర్శలవి.

ఇప్పుడు కథలవిమర్శలలో ఇలాటి వివిధ కోణాలపరిశీలన కనిపించదు. స్త్రీవాదం అనో మరోటో పేరు పెట్టి ఆ రచన సంఘాన్ని ఉద్ధరించడానికి ఏమాత్రం ఉపయోగపడుతోంది అన్న దృష్టితో మాత్రమే విమర్శించడం, విలువ కట్టడం జరుగుతోంది. అంటే **కథని సాహిత్యప్రక్రియగా కాక రోగాలు కుదిర్చే మందుగా** వాడుతున్నారు. కాల్పనికరచనకీ వాస్తవమైన వార్తాకథనానికి తేడా తెలీకుండా పోయింది.

"మాలతి కాదన్నా అవి స్త్రీవాదకథలే" అని నాకథలగురించి అనేవారు కూడా ఈకోవలోకే వస్తారు. కథకి కావలసిన ఇతరఅంశాలు – భాష, శైలి, పాత్రచిత్రణ, జాతీయాలు, సంస్కృతిపరమైన అంశాలు, శీర్షిక కథకి నప్పిందా లేదా- ఇలాటివేవి పట్టించుకోనివారు మాత్రమే అలా అనగలరు. కథని సాహిత్యప్రక్రియగా కాక రాజకీయనినాదంగా పరిగణిస్తేనే అలాటి లేబుల్ అంటగట్టడం జరుగుతుంది.

భాషలో వస్తున్న పరిణామం గమనిస్తే కనిపించేవి ఏవి అంటే -

1. ఒక కొత్తపదం చేరడానికో, ఉన్నపదం వాడుకలోంచి తప్పుకోడానికో సుమారు రెండు దశాబ్దాలు పట్టినట్టు కనిపిస్తోంది ప్రాచీనగ్రంథాలు చూస్తే. అంటే ఒకొక పదం మారడానికో, కొత్తపదం చేరి నిలదొక్కుకోడానికో అంత సమయం పడుతుంది అంటున్నా. ఇప్పుడు అలా పట్టే సమయం 2, 3 తరాలకి తగ్గిపోయింది. మనకి తొందర ఎక్కువయిపోవడంవల్ల కాబోలు.

2. అలాగే పదాలు మాయమవడం కూడా జరుగుతోంది. ఇక్కడ కూడా వాడుకలో ఉన్న పదాలు రెండు తరాలలో కనిపించకుండా పోతున్నాయి. నాకాలంలో నిత్యజీవితంలో ఉండే సాధారణపదాలకే ఇప్పుడు "అంటే ఏమిటి" అని అడుగుతున్నారు.

మనభాషలో కొత్తపదాలు చేరడానికి కొంతవరకూ కారణం ఇంగ్లీషుపాలన అని అనడం పూర్తిగా న్యాయం కాదు. ఇంగ్లీషువాళ్లు దేశాన్ని వదిలిపోయేముందు, మీరు మాభాషని నెత్తికెత్తుకోవాలి అని

నియమాలు పెట్టలేదు. పాలనావిధానం తెలియడానికి ఇంగ్లీషు నేర్చుకోండి అన్నారు. అది IAS చదువులతో మొదలయింది. మనభాషలో కొత్తపదాలు చేరడానికి కొంతవరకూ కారణం ఇంగ్లీషుపాలన అని అనడం పూర్తిగా న్యాయం కాదు. ఇంగ్లీషువాళ్లు దేశాన్ని వదిలిపోయేముందు, మీరు మాభాషని నెత్తికెత్తుకోవాలి అని

గెలటీ A dictionary of the current Telugu తయారు చేసేక, వారికుమారుడు ఆర్. గెలటీ ఆ నిఘంటువు తయారు చేయడానికి కారణం ఇంగ్లీషువారు వెళ్లిపోయేక మనం మనదేశాన్ని పాలించుకోడానికి మనభాషలో ఆ పదాలు అవుసరం అనిట. అది మనవాళ్ల తలకెక్కలేదు. వారికి వారై మీరు మాభాషే వాడాలి అని చెప్పకపోయినా, మనవాళ్లు ఆ భాషా, భావాలూ కూడా వదిలిపెట్టలేదు. అందుకే మన **స్వేచ్ఛ వాగాడంబరంగానే మిగిలిపోయింది.**

గిడుగు వెంకట సీతాపతి A History of Telugu Literature అన్నపుస్తకంలో ఇతరభాషాపదాలు మనభాషలో ఎలా వచ్చి చేరడానికి కారణం ఆ వస్తువులో భావాలో మనభాషలో లేకపోవడమే అంటారు. నాఅభిప్రాయం కూడా అదే.

ముస్లిములు పరిపాలనకాలంలో అనేక అరబ్బీ, పెర్షియన్, హిందుస్థానీ పదాలు తెలుగులో చేరడం మొదలయింది. పోర్చుగీస్ వారి రాకతో ఇతర భాషాపదాలు మరింత విస్తరించేయి, ప్రధానంగా అధికారపత్రాలలో. కృష్ణదేవరాయలు, పెద్దనవంటి కవుల ప్రబంధాలలో పార్శీపదాలు ఉన్నాయిట.

పరిశీలించి చూస్తే, అవన్నీ ఆనాటి పరిపాలనకి సంబంధించినవీ, నిత్యజీవితంలో మనసంస్కృతిలో లేనివీ అన్నది స్పష్టం అవుతుంది. జిల్లా, తాలూకా, జిలేబీ, టాంగా, వీటిలో కొన్నిపదాలు తెలుగులో ఎంతగా కలిసిపోయేయంటే కొందరు తెలుగువారికి అవి తెలుగు పదాలు కావని తెలీదు కూడా అన్నారు సీతాపతిగారు. నిజమే. కిటికీ, దుప్పటీ లాటిపదాలు తెలుగు పదాలు కావు అని నాకు తెలీదు గిడుగువారి పుస్తకం చదివేవరకూ.

మరి, ఏ పదాలు ఆమోదిస్తున్నాం, ఏకారణంగా ఆమోదిస్తున్నాం, ఎందుకు అన్ని పదాలూ ఆమోదయోగ్యం కాదు అని ఆలోచిస్తే నాకు తోచినవిషయాలు - బహుశా 1930, 40 దశకాల్లో మొదలయినట్టుంది తెలుగంటే మనకి నిరసనభావం.

భమిడిపాటి కామేశ్వరరావు రెండు పుస్తకాలు – **మన తెలుగు. 1938లో, తెలుగు రెండోభాష 1941లో-** ప్రచురించేరు.

మనమే తెలుగుని ఎంత హీనంగా చూస్తున్నామో చెప్పడానికి కామేశ్వరరావుగారు అద్భుతమైన నిదర్శనంగాచూపేరు. వారిమాటల్లో –

అది తెలుగుదేశంలో ఒక బడి. తెలుగువారు ప్రారంభించిన బడి.

తెలుగువారు ప్రారంభించిన ఇంగ్లీషుమీడియం బడి.

తెలుగుదేశంలో తెలుగువారు ప్రారంభించిన ఇంగ్లీషుమీడియం బడి.

ఆబడిలో తెలుగు **రెండోభాష.**

తెలుగుదేశంలో తెలుగువారు ప్రారంభించిన ఇంగ్లీషుమీడియంబడిలో తెలుగు రెండోభాషగా బోధించే తెలుగుపండితుడు ఆయన.

ఆ తెలుగుపండితుడి అనుభవాలు ఎంత హాస్యరసస్ఫోరకంగా ఉంటాయో అంత బలంగానూ ఆనాటి కటికవాస్తవాన్ని ఆవిష్కరిస్తాయి. ఇప్పుడు మెరుగుపడలేదు. మరింత హీనం అయిందని కూడా అనవచ్చు.

తెలుగులో ఇతర భాషాపదాలు చేరడానికి కారణాలు –

1. కొన్ని యథాతథంగా తెచ్చుకున్నవి – మనసంప్రదాయంలో లేని పదాలు.

సీతాపతిగారే చెప్పినట్టు, విదేశీ సంప్రదాయాలు, విదేశీ వస్తువులూ మనవి చేసుకున్నప్పుడు ఆభాషలో పదాలు మనవి చేసుకోడం న్యాయం. కంప్యూటరు, కెమెరాలాటి వస్తువులకి తెలుగు పదాలు సృష్టించక్కర్లేదు. సృష్టించినా కాలానికి నిలబడవు. దీనికి దృష్టాంతంగా పొగబండి, ధూమశకటం చెప్పుకోవచ్చు.

2. శంఖంలో పోసి తీర్థంగా స్వీకరించిన పదాలు.

మన సంప్రదాయంలో ఉన్నపదాలను పాశ్చాత్యులు, ముఖ్యంగా అమెరికనులు, చిన్నమార్పులతో తీసుకుని వాడుకుంటుంటే, మనం కూడా వారి ఉచ్చారణలతో తీసుకుని వాడుకోడం.

యోగా – యోగవిద్య, యోగాసనాలు, రాజయోగం ఇలా ఉంటాయి తెలుగుల వాడుకలో. వీటిలో ప్రధానంగా ధార్మికమైన కోణం ఉంది. అమెరికనులకి అది వ్యాయామం మాత్రమే. మనవాళ్లు యోగాభ్యాసం చేస్తున్నప్పటి మనస్తత్వం వేరు. కానీ ప్రస్తుతం విపరీతంగా వాడుకలో ఉన్న పదం మాత్రం అమెరికనులు ప్రసాదించిన యోగా మాత్రమే.

3. నిజానికి ఆసందర్భంలో వెనకటిరోజుల్లో “అలాగే” “చేసి చూస్తాను” అనేవాళ్లం, నాతో సహా. నేను అలాటిదాన్నే. ఇది గ్రామ్యభాషకి ఉదాహరణ. అంటే మాట్లాడేవారికి డిగ్రీలున్నాయా లేవా అని కాదు. ఆ వేళకి ఏమాట నోట వస్తుందన్నది ప్రధానం.

అలాగే 1 నించి 4 వరకూ నానబెట్టాలి – ఇది తెలుగు ప్రయోగం కాదు. తెలుగువాళ్లం మామూలుగా అయితే 3,4 గంటలసేపు నానబెట్టాలి అంటాం.

మరో ఉదాహరణ. కంచుతో చేసిన విగ్రహాలు. మీ అమ్మమ్మని అడిగి చూడండి. ఆవిడ కంచుతో చేసినవిగ్రహాలు అంటారు. కంచుతో "చేయబడిన" అనరు. ఈ "బడు" ప్రత్యయంగురించి నాకు చాలా అనుమానాలున్నాయి కానీ ఇప్పుడు కాదు.

4, ఇంగ్లీషులో ఆలోచించి, తెలుగులో వాటిని తర్జుమా చేసుకుని, ఓ కృత్రిమతెలుగు సృష్టించడం. ఇదే ఎక్కువ ప్రమాదం. ఉదా. నిన్ను విన్నాను, I hear you. తెలుగులో "నీమాట నాకర్థం అయింది". అలాగే "ఆయన్ని చదివేను". ఇది తెలుగు కాదు. I read him అనం. మనభాషలో ఆయనతీరే అంత అంటాం. ఆయన్ని పుస్తకంలా చదివేస్తాను అన్నది కూడా ఇంగ్లీషువాక్యాన్ని తెనుగీకరించడమే.

ఇక bath take చేసేరా, fruit throw చెయ్యకండి లాటివాక్యాలని ఏమనలో నాకు తెలీదు. ఇవి భాషాభివృద్ధికి దోహదం చేస్తున్నాయా? స్నానం చేసేరా, పళ్లు పారేయకండి అంటే ఏమి తక్కువయింది?

నేను మొదట్లో చెప్పిన పండిత పామర లేక గ్రామ్యభాష ఛాయలు ఇప్పటిసాహిత్యంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఆనాటి పండితులలో శాస్త్రనియమాలూ, చర్చలూ ఈనాడు స్త్రీవాదంలాటి వాదాల్లోనూ, సాంఘికప్రయోజనం, సామాజికస్పృహ రచనలుగా పరిణమించేయి. అంటే ఈవివాదాలు పండితులమధ్యే ఉంటున్నాయి. సామాన్యప్రజలకి అందుతున్నాయా, వారు చూస్తున్నారా, వారికి వీటివల్ల ఏమైనా లాభం కలిగిందా అంటే నాకు అనుమానమే. అలా కాక కేవలం తాము చూసినలోకం, తమఅనుభవాలు తమకి తెలిసినభాషలో కథలు రాస్తున్నవారు చాలామంది ఉన్నారు. ఇది పామజనులగుణం అంటున్నాను నేను.

భాష దగ్గరకొచ్చేసరికి మాత్రం అన్నిరచనల్లోనూ ఇంగ్లీషు విపరీతంగా ఉంటోంది. ఒకొకప్పుడు మొత్తం వాక్యం ఇంగ్లీషులో చెప్పి, చివర అండి అనో కదా అనో చేరుస్తారు. అంతమాత్రాన అది తెలుగయిపోతుందా? ఇది వ్యావహారికభాషావాదానికి దీటుగా ఉందని కొందరివాదన. ఇలా మాట్లాడుతున్నాం కనక ఇలా రాస్తున్నాం, ఇలాగే రాయాలి అని.

నేను అది సంజసం అనుకోను. అది భాషాసేవ అనిపించుకోదు. ఇప్పుడు నేను మంచి తెలుగు రాస్తున్నానంటే, నాకు ఆభాష ఎలా పట్టుబడిందంటే, నాచిన్నతనంలో – 1940, 50, 60 దశకాల్లో భారతి, ఆంధ్రపత్రిక, సాహితి వంటి పత్రికలలో నోరి నరసింహశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారూ, వేటూరి ప్రభాకరశాస్త్రిగారివంటి పండితులు వ్రాసిన కథలే కాక, వ్యాసాలు కూడా చదివేదాన్ని, అర్థం అయినా కాకపోయినా. ఈనాడు పత్రికలలో వస్తున్నకథలలో తెలుగు నేర్చుకోడానికి పనికొచ్చేవి ఉన్నాయా? ఈకథలు చదివేక నాకు మంచి తెలుగు వచ్చింది అని చెప్పుకోగల పాఠకులు ఉన్నారా?

నేను ఉన్నచోట తెలుగు వినిపించక, నాకు అదొక పెద్ద సమస్య అయిపోయేక, ఫేస్బుక్కులో చేరేను. చేరగానే తెలిసినవిషయం తెలుగులో రాయండి అంటే చాలదు. "తెలుగు తెలుగుపదాలు తెలుగులిపిలో వ్రాయాలి" అని స్పష్టంగా చెప్పాలని తెలిసింది. లేకపోతే ఇంగ్లీషుపదాలూ వాక్యాలు తెలుగులో రాసేవారు కొందరైతే, తెలుగుపదాలూ వాక్యాలూ ఇంగ్లీషులో రాసేవారు కొందరు. నాకు కావలసింది తెలుగుభాష తెలుగు అక్షరాలలో అని చాలాసార్లు చెప్పవలసివచ్చింది. అది కొందరికి కష్టంగా ఉందని తెలుసు కానీ నేనక్కడ చేరింది అందుకే కదా మరి. అది దొరక్కపోతే నేను అక్కడ ఉండవలసిన అవుసరమే లేదు. చాలామంది టపాల్లో నాకు అర్థమయిందీ, ఆసక్తి కలిగించేదీ ఆవగింజంతైనా లేదు. కానీ క్రమంగా కొందరు నా తెలుగుమూలంగానే నాపేజీకి వస్తున్నారని తెలిసింది. అసలు కొందరు కేవలం నాపేజీలో ఉండడంకోసం తెలుగుఫాంట్స్ తీసుకుని కంప్యూటరులో తెలుగు వ్రాయడం నేర్చుకున్నాం అన్నారు. ఇందాకా చెప్పేను కదా 50వ దశకంలో స్త్రీలు పత్రికలలో రాయడంకోసం తెలుగు నేర్చుకున్నారని. ఇది కూడా అలాటిదే. సాంకేతికయుగంలో రెండవదశ అనుకోవచ్చు.

నాతెలుగంతా పండితులు వ్రాసినకథలు చదివి నేర్చుకున్నది అన్నాను కదా. అంటే కొన్నిమాటలకి అర్థాలు సందర్భాన్నిబట్టి నాకు నేను అర్థం చెప్పుకున్నవి. అలా చెప్పుకోడంలో పొరపాట్లు కూడా జరిగేయని ఫేస్బుక్కులో చేరేకే తెలిసింది. అలా కూడా నాతెలుగు మెరుగు పరుచుకోడానికి దోహదమవుతోంది. ఇంకా కొందరు సంస్కృతశ్లోకాలకి అర్థాలు చెప్తున్నారు. అదీ పనికొచ్చింది. అలా ఎన్నో విధాల నాకూ, నాతెలుగుకీ ఫేస్బుక్ మేలే చేసింది. ఆకారణంగా కూడా నాకు తెలుగుభాషమీద ఆసక్తి పెరిగింది. అందుకే అంటున్నాను. వ్రాస్తూఉంటేనే భాష నిలుస్తుంది అని.

సమాజంలో, మనజీవనవిధానంలో, మనం ఉన్న వాతావరణంలో వస్తున్న మార్పులమూలంగా మనం మాట్లాడేభాష మారుతోంది. అది కాదనడంలేదు నేను. ఇద్దరు ఇంజినీర్లు వాళ్లవృత్తివిశేషాలు మాట్లాడుకున్నప్పుడు ఇంజినీరింగుమాటలు రావడం సహజమే కదా. అలాగే వంటల్లోనూ. గ్రైండరులో గ్రైండ్ చేయడంలో ఆశ్చర్యంలేదు. గ్రైండ్ చేయడానికీ రుబ్బడానికీ తేడా పెద్దదే. ఒప్పుకుంటాను. కాని నీళ్లకీ, ఉప్పుకీ, సాయంత్రానికీ, కిందటేడుకీ water, salt, evening, last year అనవలసిన అవుసరం ఏమిటి? దీనివల్ల భాషాభివృద్ధి జరుగుతోందా? నష్టం జరుగుతోందా?

ఇలాటిపదాలు కనీసం కథల్లోనైనా వాడుతుంటేనే భాష నిలుస్తుంది. అది రచయితలబాధ్యత

నేను రచయితలని కోరుతున్నది ఇదే. దేశాభిమానంలాగే భాషాభిమానం కూడాను. దేశాభిమానం నాకు కద్దని భాషాదినాలు చేస్తే చాలదు. ఈరోజుల్లో మాటల్లో ఎలాగా లేదు, కనీసం రాతల్లోనైనా తెలుగు నిలబెట్టండి. మన తరవాతితరాలు తెలుగు అంటే ఇదీ అని తెలుసుకోగలిగేది కథల్లోనే. సామాజికస్పృహలాగే, నిజానికి ఇంకా ఎక్కువగా, భాష స్పృహ కూడా ఉండాలని నేను దృఢంగా నమ్ముతాను.

(సెప్టెంబరు 11, 2022)

(సిరికోన సాహితిసంస్థవారిచ్చిన కోడూరి పార్వతి పురస్కారం సందర్భంలో నేను చెప్పదలుచుకున్నమాటలు సరిగా చెప్పలేకపోయేను. ఆప్రసంగాన్ని సంస్కరించి ఇక్కడ ఇస్తున్నాను. - నవంబరు 20, 2025)

ఆధునికసాహిత్యం. అసంగతమా పురోగమనమా?

గ్రంథచౌర్యానికి సాహిత్యస్థాయి

ఈనాటి సాహితీక్షేత్రం చూసి విసుగేసి, నేనింక రాయను అనుకుని దాదాపు ఏడాది అవుతోంది. నేను మరిచిపోయినవి కూడా జ్ఞాపకం చేస్తుంటారు అభిమానులు. నాలుగు రోజులక్రితం ఒక పత్రికవారు నా పాతవ్యాసం **భానుమతి కథానికలు**, 15ఏళ్లక్రితంనాటిది, ప్రచురించుకోడానికి అనుమతి కోరేరు. అహ్ ఇంకా నన్ను తెలుచుకునేవారు ఉన్నారన్నమాట అనుకుంటుండగానే, మరొకరు శివరాజు సుబ్బలక్ష్మిగారుగురించి 12ఏళ్ళక్రితం నేను రాసినవ్యాసంవిషయంగురించి ఇమెయిలు పెట్టేరు. మరోసారి ఇంకా ఉన్నారన్నమాట అని అనుకోక తప్పలేదు.

ఇవన్నీ ఇప్పుడెందుకు మళ్లీ తవ్వి తీయడం అంటే ఇప్పుడే చూసిన ఒక ప్రముఖ వెబ్ సైటు. ప్రముఖ సాహితీవేత్తలు, సాహితీనేతలు నడుపుతున్న website. పేరు **తెలుగు రచయిత.** వారి ధ్యేయం తెలుగురచయితలను స్థిరస్థాయిగా సజీవులుగా నిలబెట్టడం అని వారే చెప్పుకున్నారు. అక్కడ నేను 15 ఏళ్లక్రితం రాసి నాబ్లాగులో ప్రచురించనవ్యాసం తెన్నేటి హేమలత తెలుగుసాహిత్యంలో ఒక ప్రభంజనం **ఆ తెలుగు రచయిత** సైటులో పూర్తిగా, తు.చ. తప్పకుండా ప్రచురించుకున్నారు. నేను వ్రాసిన వ్యాసాలలో ఇది బహుజనాదరణ పొందినవ్యాసం. 2300 చూపులు వచ్చినట్టు గణాంకం చెప్తోంది. తెలుగురచయిత సంపాదకులు చేసిన ఒక మార్పు శీర్షికలో "తెలుగుసాహిత్యంలో ఒక ప్రభంజనం" అన్న భాగం తొలగించడం. ఆ సైటు నిర్వాహకులు నాకు చెప్పకపోవడం, నా అనుమతి ప్రచురించుకోడం కాపీరైటు చట్టంప్రకారం నేరం కదా. ఆవ్యాసంకింద ఏదో ఒక అనామక చిహ్నంలాటిదేదో పెట్టేరే తప్ప ఎవరు వారికి పంపేరో కూడా తెలీదు. మరొకరెవరైనా ఆసైటులోంచి సమాచారం తీసుకుని, వారికి క్రెడిట్ ఇస్తే, ఇది గ్రంథచౌర్యమే కదా.

ఈవిషయం నేను ప్రత్యేకించి ఎత్తి చూపుతున్నది రచయిత సజీవంగా ఉండేదెలా అంటూ తమ ప్రశస్త కృషిగురించి చక్కగా వివరించుకున్న ఆ పరిచయంలో ఎవరైనా వ్యాసాలు పంపితే

కాపీరైటుప్రకారం అనుమతి పత్రం జతపరచాలని నొక్కి వక్కాణించేరు. మరి నావ్యాసం ప్రచురించేవిషయంలో ఆ నియమం ఎందుకు పాటించలేదు? ఆ సైటు నిర్మాతలో నిర్వాహకులో ఎవరో గానీ వాళ్లలో నాతో వ్యక్తిగతంగా పరిచయం ఉన్నవాళ్లు – జంపాల చౌదరి, చంద్రలత, గీతామాధవి వంటి ఘన సాహితీవేత్తలు ఉన్నారు. మరి నేను ఉన్నా లేనట్టే కదా అలా ప్రచురిస్తే. బహుశా లతగారిని సజీవంగా ఉంచడం ముఖ్యం కానీ ఆమెగురించి రాసినవారు కాదని ఆ ప్రముఖుల అభిప్రాయమేమో. మరి నేను చనిపోయేక, నాగురించి వ్యాసం ఒకటి రాసి అక్కడ పెడతారా? ఊరికే అడుగుతున్నాను నిజంగా అలా చేస్తారని కాదు. నేను జీవించి ఉండగానే పట్టించుకోలేదు కదా!

ఈనాడు తెలుగు సాహిత్యరంగంలో ప్రముఖులే ఇలా చేస్తున్నారు, ఇలాటివారి సంఖ్య పెరుగుతోంది. సుప్రసిద్ధ సాహితీవేత్తలు చేస్తున్నారు కనక గ్రంథచౌర్యం ఒక ఆమోదయోగ్యమైన సాహిత్యప్రక్రియ అయిపోయిందనుకోవాలి.

(సెప్టెంబరు 4, 2025)

గ్రంథచౌర్యం ఒక సాహిత్యప్రక్రియ (తొలితరం)

పైన చెప్పిన విషయం చూసేక, నాకు మరొకటి 2016లో ఇదే విషయంమీద నేను రాసిన టపా గుర్తొచ్చింది. ఇంతవరకూ పేరు తెచ్చుకోవాలన్న కాంక్షతో కొత్తగా సాహితీక్షేత్రంలో అడుగుపెడుతున్న సామాన్యరచయితలు అలా కాపీ చేసి తమపేరుమీదుగా ప్రచురించుకుంటారని అనుకున్నాను. ఇప్పుడు మహా ఘనత వహించిన మేధావులు, తెలుగుసాహిత్యపోషకులూ కూడా అదే చేస్తున్నారని నాబాధ.

ఇంతకుముందు రాసిన టపా చూడనివారికోసం ఉన్నదున్నట్టు ఇక్కడ మళ్లీ ఇస్తున్నాను. చూడండి కొత్తగా వచ్చినమార్పు పోల్చిచూసుకోడానికి. ఇది ఎన్నెమ్మకతలు సంకలనంలో కూడా ఉంది. మీకు మళ్లీ వెతుక్కునే ఓపిక ఉండదని మళ్లీ ఇక్కడ చేర్చేను. (ఒక మిత్రురాలు చెప్పినట్టు నాటపా నేనే గ్రంథచౌర్యం చేసుకున్నాను, హహ)

166 ఊసుపోక – కాపీ చేయుట ఒక సాహిత్య ప్రక్రియ!

కాపీ చేయుట చాలాకాలము క్రితము కనిపెట్టబడినది. మొదట అతి సాధారణమైనదీ అనాదిగా అభ్యాసములో నున్నదీ చెప్పుకుందాం. అక్షరాభ్యాసం చేసి పిల్లలకి ఓ పలకా బలపం ఇచ్చి అక్షరాలు దిద్దించడం నాంది. ఆ తరవాత చూచి వ్రాత రెండోపాదం. మూడోపాదంలో నీతి వాక్యాలు – అబద్ధమాడరాదు, పరులసొమ్ము దొంగిలించరాదు –వంటివి కాపీ పుస్తకంలో చూచి రాయడం వచ్చింది. నా చిన్నతనంలో కాపీ చేయుట అంటే అదే. అంతే.

ఆ తరవాత పుస్తకాలు వచ్చేయి. చేతివ్రాత రూపంలో కాపీ చేయడం జరిగేది. అవి అపురూపం అనేక కారణాలవల్ల. అది శ్రమతో కూడిన పని కూడా. రెండోది వ్రాయసకారుల పొరపాట్లవల్ల పాఠ్యం. అర్థాలు మారిపోయే ప్రమాదం ఉండేది. అచ్చుయంత్రాలొచ్చేక కాపీ రాయడం అయితే తప్పింది కానీ అచ్చుకోసం galleyలో అక్షరాలు పేర్చేవారివల్ల కూడా పొరపాట్లు జరిగే అవకాశం కొనసాగుతూనే ఉండేది. ఇది కాపీకథలో పూర్వార్ధం.

20వ శతాబ్దం నాలుగోపాదంలో మొదలయి. 21వ శతాబ్దంలో కాపీ చేయుట మరొక విశేషార్థంలో ప్రచారంలోకి వచ్చింది. ఒక కథకి అనేక కాపీలుండవచ్చు. అంటే నేను ఒక కథ రాసి, ఆ తరవాత మనసు మార్చుకునో, తప్పులు దిద్దుకునో మరొక కాపీ తయారు చేస్తాను. క్రమంగా ఇదో పత్రికకీ అదో పత్రికకీ పంపడం కూడా జరిగింది. అయితే ఈ రూపాలన్నీ రచయిత స్వయంకృతం.

ప్రింటు పత్రికలని వెనక్కి పెట్టేసి, బ్లాగులూ, జాలపత్రికలూ, ముఖపత్రాలూ మహోద్ధృతంగా విజృంభించేసి, నియమాలను పోల్చుకోలేనంతగా మార్చేసేయి. వీటిల్లో కూడా తొలిపాదంలో ఎవరో ఒకరు ఆధిపత్యం వహించి తమ దృక్పథాలకి అనుగుణంగా రచయితలచేత మార్పులు చేయించి వివిధ కాపీలు తయారు చేయించి వారిపేరుమీదే ప్రచురించడం జరిగింది.

గత ముప్పై ఏళ్ళలో రాసేవారిసంఖ్య బాగానే పెరిగింది. రాయాలన్న తపన పెచ్చు పెరిగిపోయింది. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ రాయాలన్న, రాసి తీరాలన్న, రాయకపోతే పేరు పడిపోతుందన్న అద్భుతమైన ఆలోచన మొత్తం సాహిత్యక్షేత్రాన్ని సంపూర్ణంగా మార్చేసింది. దాంతో మొదలయింది ఇక్కడివక్కడా అక్కడివిక్కడా పెట్టడం. కొందరు తమవే పెట్టుకుంటే మరి కొందరు పేరేవారివి కూడా పెట్టడం ప్రారంభించేరు. చెప్పి కొందరు, చెప్పకుండా కొందరు కూడా పునశ్చరణ పెంచుకుంటూ వచ్చేరు.

ప్రస్తుతం మనం ఈ దశలో ఉన్నాం. విశాల హృదయం లేని కొందరు ఈ ప్రక్రియని గ్రంథచౌర్యం అంటున్నారు కానీ అది సబబు కాదనే అనేకులు అంటున్నారు. ఇది చివరివరకూ చదివిన తరవాత, మీరు కూడా అంగీకరిస్తారు ఇది ఒక ప్రత్యేక కళ అని.

ఇప్పుడు ఈ దశ రూపురేఖలేమిటో వివరంగా తెలుసుకుందాం. శాస్త్రప్రకారం – అదేలెండి నూతనంగా ప్రచారంలో ఉన్న శాస్త్రప్రకారం – అచ్చులో వచ్చిన కథ జాలంలో, జాలంలో కథ అచ్చు పత్రికలో మళ్ళీ ప్రత్యక్షం కావడం ఒకపద్ధతి. కాపీరైటు నియమాలకి ఇది విరుద్ధం కాదు. కానీ పేరేవారివి కూడా shell gameలోలాగ చేయడం మాత్రం కాపీరైటు నియమాల్లో లేదు

ఇటీవల ఇది ఎక్కువయిపోయింది. జాలంలోనే ఒకరిపేజీలో కనిపించింది మరొకరు వారిపేజీలోనో మరో సమూహపేజీలోనో పెట్టేడంతో మొదలయింది. మూలరచయితపేరు నూటికి 90వంతులు కనిపించదు. పదుగురాడుమాట పాటియై చెల్లు అంటారు కనక పదేమిటి ముప్పైమంది అలా చెప్పకుండా ప్రచురిస్తున్నట్టు కనిపిస్తోంది కనక అదే నిజమైన నియమం. “అయితే చెప్పఖ్ఖర్లేదంటారా?” అని మళ్లీ నన్ను అడక్కండి. అలా అడగడం చాదస్తం. ఇది ఎవరూ చెప్పని, చెప్పకూడని రూలు అని మీకు మీరు రహస్యంగా రాసుకోండి.

మూలరచయితపేరు చెప్పకుండా ఇతరరచయితల రచనలు పూర్తిగానో సగంసగమో తమవిగా ప్రచురించుకోడం అంచెలంచెలుగా పట్ట గ్గాల్లేకుండా అభివృద్ధి చెందేసింది. నా వ్యాసాలు, కథలు కూడా ఈ అసాధారణగౌరవానికి నోచుకున్నాయి. మూలరచయితలు అమాయకులైతే, “అయ్యో. అది నారాత. నాఖర్మ,” అని నొచ్చుకుని ఊరుకుంటారని ఆ కాపీరచయితలు, నేను కాపికేయులు అంటాను ప్రస్తుతానికి – ఆశిస్తారు. కానీ రచయితలు ముఖ్యంగా నాలాటి రచయితలయితే ఊరుకోరు. అట్టే రచ్చ చెయ్యకపోవచ్చు. చాలా మర్యాదగా కాపికేయులకి చెప్పడానికి ప్రయత్నిస్తారు. ఆ ఉత్తరం సుమారుగా ఇలా ఉంటుంది, “మీరు ప్రచురించిన కథ/కవిత/వ్యాసం నేను రాసేను. … పత్రికలో … తేదీన ప్రచురించడం జరిగింది. మీరు చూడక పొరపాటున మీదనుకుని ప్రచురించినట్టున్నారు (హాహా. చూడకపోతే కాపీ చేయడం జరగదు అని చాదస్తంగా అడక్కండి). మీరు పెద్దవారు. మిమ్మల్ని తప్పు పట్టుట నా అభిమతం కాదు. మీరు మూలరచయితగా నాపేరు కూడా చెప్తే బాగుండేది కదా. లేదా మీరు మీ పేజీలోనుండి తొలగించినను నేను అపార్థం చేసుకోను.”

దానికి సమాధానం, “మీరు రాసినట్టు నాకు తెలీదు. నేను అసలు ఆ పత్రిక చూడలేదు. చూడను. కానీ మీరు నిజంగా చాలా బాగా రాసేరు. నాకు చాలా నచ్చింది. అందుచేత నాస్నేహితులు కూడా చూసి ఆనందిస్తారని నాపేజీలో ప్రచురించేను. ఆ క్రెడిటంతా మీకే.”

సరదాకే నా మరో అనుభవం కూడా చెప్తాను. **పొట్టి కూడా పొడుగే** అని నేను ఒక చిన్నకత ఊసుపోక సీరీసులో రాసేను. అచిరకాలంలోనే మరొకరి బ్లాగులో అది కనిపించింది యథాతథంగా. అక్కడ వ్యాఖ్యలసదుపాయం ఉంది కనక ఆయనకే వ్యాఖ్య పెట్టేను, అది నారచన అనీ, తొలగించవలసిందనీ మర్యాదగానే. నావ్యాఖ్య వారిఅంగీకారానికి నోచుకోలేదు. ఆ పోస్టు తొలగించనూ లేదు. నేను ఊరుకోకుండా బ్లాగు నడిపేవారికి (బ్లాగ్ స్పాట్ అని గుర్తు)

ఈసంగతి విశదం చేసేను. దానికి ఋజువేదీ అని అడిగేరు వాళ్లు నన్నే. దానికి సమాధానంగా నేను ప్రచురించిన తేదీ, అవతల బ్లాగులో ప్రచురించినతేదీ చూపించేను. దాంతో, ఆ పోస్టే కాదు, ఆబ్లాగే అంతర్ధానమయింది. ఇలా తరుచూ జరుగుతుందనుకోను. అందుకే సరదాగా కథలా చెప్పుకోడం.

(జనవరి 5, 2016)

వేరొక రచయిత పేరుచెప్పుకుని …

రావెల రమేష్ ప్రసాద్ నాపేరు వాడుకున్నపైనం

ఆధునిక సాహిత్యంలో జరుగుతున్న మరొక అసహజధోరణి కొంచెం పేరున్న రచయతలపేర్లు వాడుకోడం. డా. రమేష్ ప్రసాద్ రావెళ్ళ రచించిన వ్యాసానికి **మిసిమి, నవంబరు 2022** పత్రికలో శీర్షిక ఇలా ఉంది. గమనించండి ఈశీర్షిక. అది చూస్తే మీరేమనుకుంటారు, ఆవ్యాసంలో ఏమి ఉంది అనుకుని చదువుతారు?



Aricle Heading in Misimi 11/2021

రమేష్ ప్రసాద్ నాకు పంపిన ఈవ్యాసం 20 పేజీలు. PDF format. ఈవ్యాసం ప్రచురణ అయేక మళ్ళీ చూసేను. 20 పేజీల వ్యాసంలో 4 పేజీలు మాత్రమే నిడదవోలు మాలతి సాహిత్యం గురించిన ప్రస్తావన. అలాటప్పుడు ఆవ్యాసానికి నాపేరూ, ఫొటో ఎలా సమర్థిస్తారు? ఆ రచయితనీ, ఆ పత్రికాసంపాదకులనీ అదే అడిగేను కానీ సమాధానాలు లేవు. అంతకుముందు రావెల తాను రచించిన మరో 3 వ్యాసాలు పంపేరు కానీ వాటిల్లో ఇలా ఒక రచయితపేరూ, మరో పదిమంది రచయితల ప్రస్తావనలూ లేవు. ఈ నేపథ్యంలో రావెల అభిప్రాయం నన్ను కించపరచడమేనా కావాలి, ఆయనగారి అజ్ఞానమేనా కావాలి.

రెండవ సందేహం ప్రవాససాహిత్యం అన్న running title గురించి. అసలు ఏది ప్రవాససాహిత్యం అన్నవిషయం మొదట చూదాం. ఈవిషయంమీద విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి.

ఈ "ప్రవాససాహిత్యం" అన్న నుడికారం ప్రాచుర్యంలోకి వచ్చేక, నిర్వచనం ప్రశ్న తలెత్తింది. ఒక సంస్కృతివారు విదేశాలలో స్థిరపడి మరొక సంస్కృతినీడన నివసిస్తూ ఆ రెండు సంస్కృతులు కారణంగా వారిజీవితాలలోని సంఘర్షణలూ, తమజీవితాలలో, భావుకతలో కలిగిన మార్పులను అవగాహన చేసుకుని, సమన్వయపరుచుకుని కొత్తపద్ధతిలో మరొక సంస్కృతిని సృష్టించుకున్నవారు రాసిన కథలు అని నిర్వచించేరు. అంటే రెండు భిన్నసంస్కృతులను

సమన్వయపరుచుకుని ఆ అవగాహనతో చేసినరచనలు అని.

నేను చాలాకాలం ఈ భిన్నసంస్కృతులు అన్నది రెండు దేశాలయితేనే తమకి ప్రత్యేకమైన సంస్కృతి సృష్టించుకునే పరిస్థితి ఏర్పడుతుందని అనుకున్నాను. కానీ ఈమధ్య మనదేశంలోనే ఒక రాష్ట్రంనుండి మరొకరాష్ట్రానికి తరలివెళ్లి అక్కడ స్థిరపడి రచనలు చేసేవారిని కూడా ప్రవాసులనే అంటున్నారు. ఇంకొంచెం ముందుకి వెళ్లి మరొక ఊళ్లో స్థిరపడినవారి అనుభవాలు కూడా అవే అంటున్నారు. ఇలా మరోఊరికి మరో వీధికీ మారినవారిని కూడా ప్రవాసులంటే **తెలుగుదేశంలో ప్రవాసరచయితలు కానివారు అంటూ వేరే ఉండరు.** పెళ్లిళ్లూ, ఉద్యోగాలూ, పిల్లలచదువులూ ఇలా ఏదో ఒక కారణంగా ఊరు మారని రచయితలు లేరు. అలాటప్పుడు సాహిత్యమంతా ప్రవాససాహిత్యమే. అలాటప్పుడు ప్రత్యేకించి విడిగా ప్రవాససాహిత్యం అని ఒక లేబులు తగిలించుకోడం కూడా అనవసరమూ, అర్థరహితమూ కాదా?

ఇన్ని రకాలవాదనలు లేక నిర్వచనాలు ఉన్నప్పుడు సహజంగానే వ్యాసకర్త తనకు తాను ఒక నియమాన్ని విధించుకుని ఆ పరిధిలో వ్యాసం వ్రాస్తాడు. ఈ నియమాన్ని వ్యాసం మొదట్లో వివరించడం రచయితధర్మం.ఈవ్యాసకర్త, రమేష్ ప్రసాద్ రావెళ్ళకి అలాటి ఆలోచన ఉన్నట్టు లేదు.

ఇంతకీ ఈ రచయిత రమేష్ ప్రసాద్ గారు వేటిని ప్రవాసకథలుగా తీసుకున్నారు అంటే – వస్తువు, మూలరచయిత అన్న విషయాలు వదిలేసి, స్వగ్రామం వదిలి మరో ఊళ్లో ఉన్న ఏ రచయిత అయినా ఒకకథని ఇంగ్లీషులోకి అనువదిస్తే అది ప్రవాసకథే అన్నట్టు ఉంది. ఉదాహరణకి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి **అరికాళ్ళకింద మంటలు** ఈవ్యాసంలో చోటు చేసుకుంది. అంటే రమేష్ ప్రసాద్ గారి అభిప్రాయంలో అది ప్రవాసకథే! నిజానికి అది ప్రవాసకథ కాదు. ప్రతి ఆంగ్లానువాదమూ ప్రవాసకథ కాదని ఈరచయితకి తెలిసినట్టు లేదు. అనువాదకుడు ఊరు మారినంతమాత్రాన ప్రవాసకథ అయిపోదని కూడా తెలీదు.

"నిడదవోలు మాలతికథలను చెహోవియన్ కథలు అని, చెహోవ్ కథలలో శిల్పంగురించి తరవాత ప్రస్తావిస్తాన"నీ వ్యాసకర్త మొదట్లో అన్నారు కానీ తరవాత చెహోవ్ కథలు చర్చిస్తున్నప్పుడు మళ్లీ మాలతికథలగురించిన ప్రస్తావన లేదు. అలా చేసి ఉంటే ప్రధానశీర్షికకి కొంత బలం కలిగేది.

అసలు వ్యాసరచనగురించి ఒకమాట చెప్పుకోవాలి. ఈ వ్యాసంలో చాలాకథలు సంక్షిప్తంగా చెప్పేరు. కొన్ని కథలకి తమఅభిప్రాయాలు జోడించేరు. కొన్ని కథలకి అది కూడా లేదు. బహుశా వ్యాసంనిడివి పెంచడానికి కథంతా చెప్పేయడం జరిగిందేమో.

స్థూలంగా ఈ వ్యాసానికి ఎలా చూసినా నిడదవోలు మాలతి అన్నపేరు సమంజసం కాదు.

కనీసమర్యాద తెలిసినా ఇది ఇంతటి అవకతవకవ్యవహారం అయేది కాదు.

ఈవ్యాసం ఆయనే నాకు పంపేవరకూ ఆయనెవరో కూడా నేనెరగను. ఏడు దశాబ్దాలుగా సాగిస్తున్న నా రచనావ్యాసంగం గురించి అంతకంటె చెప్పడానికి ఏమీ లేకపోతే, నాసాహిత్యం తన వ్యాసానికి వస్తువుగా తీసుకోవలసిన అవుసరమే లేదు. మాలతిసాహిత్యంగురించిన వ్యాసమే అయితే మిగతా రచయితలచర్చ ఉండకూడదు తులనకి తప్పించి. అలాకాక, ప్రవాససాహిత్యంగురించి అయితే, మాలతికథలలో ప్రవాసజీవితానికి సంబంధించినవి మాత్రమే చర్చించాలి. ఆ రెండూ జరగలేదు ఈవ్యాసంలో.

1. వ్యాసకర్తకి నాప్రశ్న: ఈ వ్యాసానికి "నిడదవోలు మాలతి" అని పేరు పెట్టడాన్ని, నాఫొటో జోడించడాన్ని ఎలా సమర్థిస్తారు? ఈప్రశ్న నేరుగా రచయితకి పంపేను కానీ సమాధానం రాలేదు.

అది అర్థరహితం కనుక రచయిత తమప్రతిభని చాటుకుంటూ ఒక సంకలనంగా వేస్తే, అందులో నాపేరూ, ఫొటో, నాసాహిత్యానికి సంబంధించిన భాగాలు చేర్చరాదని తెలియజేస్తున్నాను.

2. **మిసిమి** సంపాదకులకి నాప్రశ్న: ఆ పత్రికని సాహిత్యపత్రికగా కొందరు గుర్తించేరుట. మరి ఈ కలగూరగంప వ్యాసాన్ని ప్రచురించడానికి ఎలా అంగీకరించేరు? అని. మళ్లీ అంతే, సమాధానం లేదు.

ఈ వ్యాసం ఈనాటిసాహిత్యకారుల అవకతవక రాతలకి ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాటిరచనలు, చిత్తశుద్ధి లేని రచనలు, చాలానే వస్తున్నాయి. పేరుప్రతిష్ఠలు గల సంపాదకులూ, రచయితలూ, విమర్శకులూ వీరిని ఆదరిస్తున్నారు తమ తమ పరిచయాలనుబట్టి. అలాటి పరిచయాలేమీ లేని నాలాటి రచయితలు అనామకులుగా మిగిలిపోతున్నారు. ఆధునిక తెలుగు సాహిత్యచరిత్రలో ఆలోచించదగ్గ అంశం ఇది. మిడిమిడి జ్ఞానంతో ఏ గూగుల్లోనో పదినిముషాలు గడిపి రచయితలుగా పేరు తెచ్చుకుంటున్న జనాలనీ, వారిని అందలాలెక్కిస్తున్న సంపాదకులనీ, విమర్శకులనీ కూడా అడుగుతున్నాను ఇది సాహిత్య పురోగమనమా అని!! నేను అసంగతం అనే అంటాను.

(నవంబరు 8, 2021)

శీలా వీర్రాజుగారి పేరున కుహనాసంస్థ

పైవ్యాసంలో రావెల రమేష్ ప్రసాద్ నాపేరు వాడుకొనడం ఒక ఎత్తు. అంతకంటె హేయం, చట్టరీత్యా నేరం, ఒక సుప్రసిద్ధరచయిత పేరున ఒక సంస్థ పెట్టి సొమ్ము చేసుకోడం.

ఈ ఉదయం శీలా సుభద్రాదేవిగారినుండి వచ్చిన ఈ వార్త చూడగానే ఆశ్చర్యమూ, ఆవేదనా కలిగేయి. ఆధునికయుగంలో ధనార్జనకోసం దొంగఖాతాలు, సంస్థలు సృష్టిస్తున్నారన్నది అందరికీ తెలిసినవిషయమే అయినా, సాహిత్యంలో కూడా ఇంత హీనంగానూ ఉందని ఇప్పుడే తెలిసింది. వీర్రాజుగారి కుటుంబాన్నే ధనసహాయం చేయమని అడిగేరంటే, ఎంత లేకిమనుషులై ఉండాలి. సాహిత్యాభిమానులు ఇటువంటి చర్యలను గర్హిస్తారని ఆశిస్తున్నాను. ఈవిషయమై సుభద్రాదేవి ప్రచురించిన లేఖని కూడా ఇస్తున్నాను, విషయం సమగ్రంగా అర్థం చేసుకోడానికి.

సుభద్రాదేవిలేఖ –

రాజమహేంద్రవరంలో జూన్ ఒకటవ తారీఖున శీలావీర్రాజు స్మారక పురస్కారాలు మూడురంగాల్లో ముగ్గురికి ఒక ప్రముఖ సాహిత్య సంస్థ ఇస్తున్నట్లు పేపర్ లలో వచ్చిన కటింగ్ ఫార్వర్డ్ కొందరు చేసారు. అయితే ఈ పురస్కారాలకు మా కుటుంబానికి ఏమాత్రం సంబంధం లేదని సవినయంగా తెలియజేస్తున్నాను.

బహుశా శీలా వీర్రాజు గారి మీద అభిమానం వల్లనే కావచ్చు నన్ను ఏమాత్రం సంప్రదించకుండానే అక్కడ వాళ్ళు వారికి వారే ఎవరికి పురస్కారాలు ఇవ్వాలో నిర్ణయించేసుకుని పేపర్లో ప్రకటన ఇచ్చుకున్నారు.

తర్వాత నాకు ఫోన్ చేసి పురస్కారప్రదాతలపేరిట మూడు క్రాస్డ్ చెక్కులు పంపుతే బాగుంటుంది అన్నారు.

ఆయన పేరిట ఇవ్వాలనుకున్నట్లు ముందుగా తెలియజేయలేదు, ఎవరికి ఇవ్వాలను కుంటున్నారో వారి అర్హతలు ముందుగా తెలియజేయలేదు. మాకుటుంబ సభ్యులను

ఆహ్వానించలేదు. కానీ డబ్బు ప్రసక్తి తేవటం నాకు బాధ, ఆగ్రహం కలిగించాయి. అందుచేత నేను దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను.

దామెర్ల రామారావు ఆర్ట్ గాలరీకి వీర్రాజు గారి చిత్రాలు అంకితం చేసాము కనుక ఇరవై ఏళ్ళ లోపు చిత్రకారులకు ప్రతీ ఏడాదీ పోటీ నిర్వహించి వాటిని నేను పరిశీలించి బహుమతులు ఇవ్వాలను కుంటున్నట్లు నిర్వాహకులకు గత ఏడాది తెలియజేసాను.ఆ మాటకు నేను నిబద్ధతతోనే ఉన్నాను.

మా కుటుంబం పురస్కారం పెట్టాలని ఎప్పుడైనా నిర్ణయించుకున్నప్పుడు ఎవరి ఆర్థిక సహకారం లేకుండా మాకై మేము డబ్బు సమకూర్చుకుని , వీర్రాజు గారి నిబద్ధత, నిజాయితీ మేరకు కుల,మత, ప్రాంతీయతల వివక్షతలకు చోటులేకుండా తెలుగు సాహిత్యానికి ప్రతిష్టాత్మకంగా ఉండేలా శీలా వీర్రాజు గారి పేరిట పురస్కారాలు ఇస్తామని తెలియజేస్తున్నాను.

(5.31.2023)

((తా.క. ఇది తేదీ చూస్తే వెనకటి సంకలనంలో చేర్చిఉండాలి కానీ వ్యాసమాలతి 5వ సంకలనంలో లేదు. అంచేత ఇక్కడ చేరుస్తున్నాను. ఈకుహనాసంస్థలవ్యవహారం కూడా ఈనాటి సాహిత్యచరిత్రలో ఒక మెచ్చలేని మార్పు అనుకుని.))

తన తదనంతరం (రచయిత గతించేక)

ఏ రచయితకైనా తనరచనలు తన సంతానంవంటివే. తన తదనంతరం అవి ఏమౌతాయో అన్న ఆలోచన ఉంటుంది. కొందరికి వారి కొడుకులు కూతుళ్లు వాటిప్రచురణ, కాపీరైటుహక్కులు కాపాడుకోవడం వంటివి చేస్తారు. కొందరు ఎవరైనా అడిగినప్పుడు అనుమతివ్వడం, పుస్తకాలు అందించడంలాటివి చేస్తారు. కొందరిరచనలు మాత్రం వారు పోయేక ఆనవాలయినా లేకుండా పోతాయి. ఇదంతా ఎందుకు మొదలు పెట్టేనంటే ఈరోజు ఒకచోట ఒక పోస్టు చూసేను. కాఫ్కా తన అముద్రిత రచనలను Brad అన్న స్నేహితుడికిచ్చి వాటిని ప్రచురించవద్దని, తగలబట్టేయమనీ స్పష్టంగా చెప్పేడుట. కానీ బ్రాడ్ మిత్రునికోరిక మన్నించక, ప్రచురించేసేడు. ఇది న్యాయమా కాదా అని ఈరోజు పోస్టు. సహజంగానే అవునని కొందరంటే కాదని కొందరన్నారు. అవన్నీ అలా వదిలేస్తే, అది చూసేక నాకు కలిగిన ఆలోచనలే ఈ పోస్టు. కానీ మొదటి ఆలోచన ముందు చెప్పుకోవాలి. వాటిని తగలబెట్టేయమని మరొకరికి ఎందుకూ చెప్పడం? తానే తగలబెట్టేయొచ్చు కదా.

ఇంక మనకి స్పష్టంగా కనిపించే లాభనష్టాలు చూదాం. అలా ప్రచురించడంవల్ల ప్రపంచానికి కాఫ్కా రచనలు మరి కొన్ని అందేయి, శుభం అని కొందరు ఆనందించేరు. అవి ఉత్తమరచనలస్థాయిలో ఉన్నాయో లేదో నాకు తెలీదు. కానీ ఆయనరచనలను అభిమానించేవారికి, పరిశోధకులకు అది మంచి తృప్తినిచ్చి ఉంటుంది.

అయితే నష్టం ఏమిటి అంటే కాఫ్కా నమ్మకాన్ని ఆయన మిత్రుడే వమ్ము చేయడం. కాఫ్కా మిత్రుని నమ్మి ఆ రచనలను ఆయనకి అప్పచెప్పేడు. కాఫ్కాకోరిక మన్నించడం మిత్రధర్మం. మరి బ్రాడ్ అలా చేయలేదు. కాఫ్కా బతికి ఉంటే నొచ్చుకునేవాడు కదా.

రెండోది, కాఫ్కా ఎందుకు ప్రచురించవద్దన్నాడు అన్నది. ఆయనకే వాటివల్ల తృప్తి కలగలేదేమో. వాటిని మరింత మెరుగుపరచేక కానీ ప్రచురించకూడదు అనుకున్నాడేమో. అంతవరకూ ప్రచురించినరచనలస్థాయిలో అవి లేవు అని అనిపించి ఉండవచ్చు ఆయనకి.

మరోకోణం, వాటిమీద వచ్చేవ్యాఖ్యలకి, ప్రశ్నలకి సమాధానం ఇవ్వగల అవకాశం తనకి ఉండదు తాను గతించేక. అంచేత కూడా వాటిని ప్రచురించడం న్యాయం కాదు అనుకునిఉండవచ్చు.

అయితే ఇన్ని సందేహాలు ఉండగా, అసలు వాటిని బ్రాడ్ కి ఎందుకు ఇవ్వడం? నామటుకు నాకు తోచిన సమాధానం ఆయనకి ఏమూలో చిన్న ఆశ కూడా ఉండి ఉండాలి. వాటికి ప్రచురించేస్థాయి లేదు అని ఒకపేపు అనుకున్నా, మరోపేపు ఏమో బాగానే ఉన్నాయేమో అని కూడా అనిపించి ఉండవచ్చు. లేదా, కనీసం తనస్నేహితుడు చదవాలి అన్న కోరిక కావచ్చు.

కాఫ్కా "తదనంతరం" ఇంతటితో ఆపుతాను. నన్ను నేను కాఫ్కాతో పోల్చుకోడం లేదు. కానీ కోరికలు, సందేహాలూ లాటివి నాక్కూడా ఉన్నాయి. ఎంత చెట్టుకంత గాలి అన్నట్టు నాస్థాయిలోనే నేను అనుకోవచ్చు కదా.

మరో రెండు మాటలు చెప్పి ముగించేస్తాను. మూడు నాలుగేళ్ళు అయిందనుకుంటాను. నాకో ఆలోచన వచ్చింది. నాతరవాత నాబ్లాగూ వెబ్ సైటూ ఏమవుతాయని. అంటే నా తదనంతరం, ఎవరైనా వాటిని hack చేసి తమకి తోచినట్టు మార్పులు చేసేయడం, నాఆలోచనలకి భిన్నంగా రాసేయడం చేస్తే అవన్నీ నాపేరుమీద చెల్లుతాయి కదా అన్న భయం. అంచేత అప్పట్లో కొందరు మిత్రులని అడిగేను. వాళ్లు చూస్తాం అని అన్నారు. కానీ ఈమధ్య ప్రజలని చూస్తుంటే నేను అలా వారికి బాధ్యత అప్పచెప్పడం న్యాయం కాదని తోచింది. ఎవరిని చూసినా "టైం చాలక" ఉక్కిరిబిక్కిరి అయిపోవడమే కనిపిస్తోంది కానీ "తోచడం లేదు, ఏం పని లేదు" అన్నవాళ్లు కనిపించలేదు. వాళ్లకి చూడాలని ఉన్నా ఈ బ్లాగూ సైటూ చూసే సమయం వారికి ఉండకపోవచ్చు. అయినా మోడువారిన చెట్టులా ఏ కార్యకలాపాలూ లేనిచోట ఏముందక్కడ చూడడానికి అని కూడా వారికి అనిపించవచ్చు. అంచేత అటు తిరిగి చూడకపోవచ్చు.

ఇలా ఎందుకనుకుంటున్నానంటే, అలా వదిలేసిన సైటునీ బ్లాగునీ మరొకరు hack చేసి, తమ ఇష్టం వచ్చినట్టు మార్చేయవచ్చు. ఇలాటి మార్చేయాలనుకునేవారు కూడా ఉన్నారు. కొంతకాలం క్రితం తెవికీవారే అనుకుంటాను అందులోనే మరొక విభాగం మొదలు పెట్టి రచయితలపేర్లూ, సమాచారం మాత్రమే కాక రచనలు కూడా చేరుస్తున్నాం అని నారచనలు పంపమని అడిగేరు. అయితే అందులో ఒక నియమం పెట్టేరు. అదేమిటంటే, నారచనలు వారిష్టం వచ్చినట్టు మార్చుకోడానికి అనుమతి ఇవ్వాలని.

అలా మార్చడం న్యాయం కాదు అని నాఅభిప్రాయం. ఈమధ్య అనువాదాలలో కొందరు తమకి తోచినట్టు మార్చేస్తున్నారు. అది న్యాయం కాదు. ఆమాటే వారితో కూడా అన్నాను. ఎందుకంటే ఏరచయిత అయినా తనవైన అభిప్రాయాలు తనదైన భాషలో చెప్తారు. ఆనాటి ఆలోచనలూ, అలవాట్లూ కూడా ఉంటాయి అందులో. సాహిత్యచరిత్ర సాంఘికచరిత్రలో భాగం. 1940, 50 ప్రాంతాలలో రాసినకథల్లో ఆనాటి ఆలోచనలూ, అలవాట్లే ఉంటాయి. ఆరోజుల్లో రాసినకథల్లో ఒక రోగిగురించి రాస్తున్నప్పుడు ఆయన తీసుకున్న మందులూ, వాటిపేర్లూ, లక్షణాలూ, మోతాదులూ వంటి వివరాలు ఉండేవి కావు. అది ఆనాటికథ లక్షణం అనాలి. అదే కథని ఇప్పుడు అనువాదం చేస్తే, అందులో ఆ రోగలక్షణాలూ, మందులూవంటి అనేక వివరాలు చేరిస్తే అది ఈనాటికథ అయిపోతుంది. ఈనాటి పాఠకులకి ఆవివరాలు కావాలి, ఇష్టం అనే అనువాదకులు ఇప్పుడు ఉన్నారు. నాకు మాత్రం అది న్యాయంగా అనిపించదు.

నాఅనుభవంలో ఒకటి. నేను **చాతకపక్షులు** నవల నాల్గాగులో ప్రచురించినప్పుడు, కొందరు ముగింపు బాగులేదన్నారు. అలా అన్నందుకు నేను తప్పు పట్టను. బాగుందా లేదా, బాగుంటే ఎందుకు బాగుంది, బాగులేకపోతే ఎందుకు బాగులేదు అని పాఠకులు ఆలోచించుకోడం, చెప్పడం సహజమే. ఆమాట చెప్పడంలో కూడా తప్పు లేదు. ఆ ఆలోచన కొనసాగిస్తూ ఎలా ఉంటే తనకి బాగుండునో కూడా పాఠకులు చెప్పవచ్చు. నిజానికి చర్చ అంటే అదే. వేరు వేరు పాఠకులు వెలిబుచ్చే వేరు వేరు అభిప్రాయాలు. అంతవరకూ సమంజసమే. కానీ నాకథలో ముగింపు నాకాలంనాటికి అనుగుణంగా ఉన్నాయి. అది మారిస్తే మాత్రం నాకథ కాకుండా పోతుంది. అది మరో కథ అవుతుంది.

(జూన్ 6, 2024)

సాహిత్య ఎకాడమీ లక్ష్యశుద్ధి

(మొల్లసత్కారంసభలో మునిపల్లెరాజుగారి కథాసంకలనం అనువాదం ప్రచురణవిషయం నాప్రసంగంలో భాగం ఇది)

ఈసరికి చాలామంది మరిచిపోయి ఉంటారు నేను మునిపల్లె రాజుగారి **అస్తిత్వనదం ఆవలితీరాన కథాసంకలనం** అనువాదం చేసేనని. అది చేసి 9 ఏళ్లు అవుతోంది. దానికి ప్రచురణ సమయం ఇప్పటికి వచ్చినట్టు కనిపిస్తోంది.

రెండురోజులక్రితం **మొల్ల సత్కారం** సభలో ఈ ప్రస్తావన చేసేను తూలిక.నెట్ లో అనువాదాలమాట వచ్చినప్పుడు. సభ అద్భుతంగా జరిగింది. నాకు తెలీని ఎన్నో విశేషాలు తెలుసుకున్నాను. నారచనలగురించి.

రెండుగంటలసేపు అనుకున్న సభ 3గం. 4 ని. వరకూ సాగింది. వక్తలు టైం పరిమితివల్ల ఇంకా చెప్పవలసినవి ఉన్నాయి కాలపరిమితి మూలంగా చెప్పలేకపోతున్నాం అన్నారు అంటే మీరే ఊహించుకోవచ్చు.

ఈ సభ ఇంతగా ఫలవంతం కావడానికి ముఖ్యకారణం కల్పన రెంటాల శ్రమ. సంకల్పించిన క్షణం నుండి వక్తలను ఆహ్వానించడం, సత్కారానికి చిహ్నాలుగా కుర్తా, ఫలకం, నాముఖచిత్రం గల కాఫీకప్పుతో పాటు రాత్రి భోజనంవరకూ ఎంత జాగ్రత్తగా ప్లాను చేసిందో చూస్తే నాకు ఆశ్చర్యమూ ఆనందమూ కలిగేయి. ధన్యవాదాలు కల్పనా.

అలాగే వక్తలు ఏదో మాట్లాడేం అంటే మాట్లాడేం అనికాక, నాకథలు వ్యాసాలు చదివి, సునిశితంగా పరిశీలించి, సోదాహరణంగా ప్రసంగించేరు. చాలా ఆలస్యం అయిపోయిందని పబ్లిక్ ఆఫ్ చేసినతరవాత కూడా మరో నలుగురు ఆగి మరో అరగంట చర్చించుకున్నాం. ఇంత పకడ్బందీగా నాసాహిత్యంమీద చర్చ అంటే నిజంగా సంపూర్ణంగా నారచనలమీదే చర్చ జరగడం నాజీవితంలో ఇదే మొదటిసారి. నాసాహిత్యానికి నిజమైన సత్కారం. వక్తలందరికీ ధన్యవాదాలు.

ఈపానకంలో పుడకలా అనిపించినా, ఇది మీముందు ఉంచవలసిన అవుసరం కనకనూ, యూట్యూబులో విడియో చూడనివారు ఉంటారు అన్న ఉద్దేశంతోనూ ఇక్కడ మళ్లీ పంచుకుంటున్నాను.

ఇంక సాహిత్యఎకాడమీవారు ప్రచురించనున్న మునిపల్లె రాజుగారి **అస్తిత్వనదం ఆవలితీరాన** కథాసంకలనానికి నా అనువాదం ప్రచురణవిషయంలో ఏమి జరిగిందో అవధరించండి.

——-

మునిపల్లె రాజుగారి అస్విత్వనదం ఆవలితీరాన. నాఅనువాదం.

2014లో సాహిత్య ఎకాడమీ రాజుగారి కథాసంకలనం అనువాదం చేయమని నన్ను అడిగేరు.

నేను చేస్తానన్నతరవాత, రాజుగారు నాకు ఉత్తరం రాసేరు. తమకి 90లు దగ్గర పడుతున్నాయననీ, తాను activeగా ఉండగానే ఆపుస్తకం వస్తే బాగుంటుందనీ.

నేను రాత్రీ పగలూ పని చేసి, రెవ్యూలకి సమాధానాలు చెప్పుకుని, ఏప్రిల్ 2015నాటికి సాహిత్యఎకాడమీకి ఫైనల్ కాపీ అందజేసేను. అంటే 8 ఏళ్లయింది అది సిద్ధమయి.

మీలో చాలమందికి తెలిసే ఉంటుంది రాజుగారికథలలో భాష. ఉదాహృత ఉపకథలూ, సంస్కృతశ్లోకాలు చాలానే ఉన్నాయి. చాలమంది స్నేహితులసహాయం తీసుకోవలసివచ్చింది. ప్రముఖ పండితులు ఏల్చూరి మురళీధరరావుగారిని అడిగి కొన్ని సంస్కృతశ్లోకాలకి అర్థాలు తెలుసుకున్నాను. అలాగే అబ్బరాజు మైథిలిగారూ, నూతక్కి రాఘువేంద్రరావుగారూ, ఇంకా అనేకమంది ముఖపుస్తక మిత్రులు సాయం చేసేరు ఈఅనువాదం పూర్తి చేయడానికి.

ఇక్కడ సాహిత్యఎకాడమీవారి స్పందన విచారకరం. ఎకాడమీలో ఆ సమయంలో తెలుగువారే అధినేతలు. 2, 3సార్లు బెంగుళూరులో సెక్రటరీని అడిగేను ప్రతిసారీ రెండునెలల్లో అంటూ వచ్చేరు కానీ ప్రచురణ జరగలేదు. ఆసందర్భంలో మునిపల్లె రాజుగారు నాకు రాసేరు తమకి 90లు దగ్గర పడుతున్నాయనీ, ఈపుస్తకం తానుండగా వస్తే బాగుంటుందనీ. రాజుగారివంటి గౌరవనీయులైన రచయితపుస్తకం ప్రచురించడానికి 8 ఏళ్లు పట్టింది సాహిత్యఎకాడమీవారికి. ఆమధ్యలో చాలా పుస్తకాలే వెలువరించారు. మరి ఈపుస్తకంవిషయంలో అంత ఉపేక్ష ఎందుకో వారే చెప్పాలి.

శ్రీ మునిపల్లె రాజుగారు 2018లో ఈపుస్తకం చూడకుండానే స్వర్గస్థులయేరు.

గత నాలుగేళ్లలోనూ సాహిత్యఎకాడమీని రెండుసార్లు అడిగేను ఎప్పుడొస్తుందని. ఈ ఎకాడమీలో ఈప్రచురణకి ఎవరు వ్యక్తిగతంగా బాధ్యులో నాకు తెలీదు. సాహిత్యఎకాడమీ అనే ఇమెయిలు ఇస్తూ వస్తున్నాను.

అడిగిన ప్రతిసారీ ఇదుగో రెండు నెలలలో వస్తుందన్నారు. అలా అని రెండేళ్లకి పైనే అయింది.

పదిరోజులక్రితం మెయిలిచ్చేను మరోసారి. “మీరు ప్రచురించేట్టు లేదు. నేనే ఇ-బుక్ చేసి ఆర్కైవ్.ఆర్గ్ లో పెడతాను. కనీసం రాజుగారి సంతతి, పాఠకులూ అయినా చూస్తారు,” అని.

దానికి వెంటనే జవాబు వచ్చింది. జవాబు వచ్చింది డా. యస్. రాజ్ మోహన్ గారినుండి. వెనకటి ఆఫీసరు ఇంతవరకూ ప్రచురించలేదా అని ఆశ్చర్యం వెలిబుచ్చి, వెంటనే ప్రచురణకి కావలసిన టైపుసెటింగ్ లాటివి పూర్తి చేసి కేంద్ర సాహిత్యఎకాడమీకి వారంరోజులలో పంపేరు.

తొమ్మిదేళ్లపాటు ఏ చర్యా తీసుకోకుండా ఉద్యోగి యస్.పి. మహాలింగేశ్వరే తమ అలసతకి కారణమేమిటో ఆయనే చెప్పాలి మరి.

ఇంగ్లీషు వికిపిడియాలో సాహిత్యఎకాడమీగురించి ఉన్న వ్యాసంలో ఎకాడమీకార్యక్రమాలలో అలసతలూ, అవకతవకలగురించి విపులంగానే రాసేరు. రాజ్ మోహన్ గారివంటి బాధ్యతాయుతవ్యక్తులవల్ల సంస్థకి మళ్లీ ప్రతిష్ఠ వస్తుందనుకుంటాను. ప్రస్తుతం మునిపల్లె రాజుగారి సంకలనానికి నాఅనువాదం కేంద్రసాహిత్య ఎకాడమీవారిచేతుల్లో ఉంది. కనీసం ఈసారి వారు పూనుకుని ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

(మార్చి 14, 2023)

తా.క. నా అనువాదం Beyond the Shores of River Existentialism 2023 జూన్ లో విడదలయింది.

తెవికీలో పి. శ్రీదేవిపేజీలో చిత్రం ఆమెది కాదు

నాయని కృష్ణకుమారి గారిబొమ్మ తెచ్చి పి. శ్రీదేవిగారి పేజీలో పెట్టేరు. తెవికీ సాధారణంగా అనుమతిపత్రం అడుగుతారు కదా. మరి ఈబొమ్మ తెచ్చి పి. శ్రీదేవిగారి పేజీలో పెట్టడం ఎలా జరిగింది? ఎవరు అనుమతిపత్రం లేకుండా ఎలా ప్రచురించగలిగేరు? అది చూడడం నాకు బాధాకరంగానే ఉందని కూడా చెప్పుకుంటున్నాను. అది బాధ్యతారహితంగా చేసినది కనుక.



శ్రీదేవిగారి బొమ్మ వారికుమార్తె, మాళవిక, నాకు పంపినచిత్రం ఇది.

తెవికీవారికి ఈవిషయం శ్రీదేవిపేజీలో చర్చలో రాసేను. నాదగ్గర ఆమెచిత్రం ఉందనీ, వారికి కావలస్తే పంపగలలనీ కూడా మెయిలిచ్చేను. వారినుండి సమాధానం లేదు. అంచేత ఆధునికయుగంలో తెలుగుసాహిత్యంలో విలువలు ఎలా మారిపోయేయో వివరిస్తూ కిందటివారం ఒక టపా రాసి నాబ్లాగులో పెట్టేను.

- నిడదవోలు మాలతి

(09/18/2025)

తా.క. ఈ వ్యాసం నాబ్లాగులో పెట్టేను ఇంకెవరైనా చూసి సరి దిద్దుతారేమోనని. అది కూడా జరగలేదు. అంచేత ఈవిషయమే ప్రస్తావిస్తూ, మరో వ్యాసం రాసేను.

.

తెవికీలో శ్రీదేవిబొమ్మ సాంకేతికలోపమా?

నాలుగు రోజులక్రితం తెవికీలో శ్రీదేవిగారిబొమ్మగురించి పోస్టు పెట్టేక, మరికొన్ని ఆలోచనలు చేయవలసివచ్చింది. వెనకటి చరిత్ర కొంచెం చెప్తాను.



పి. శ్రీదేవిగారి అమ్మాయి మాళవిక నాకు పంపిన చిత్రం ఇది

వికిపీడియాలో తెలుగు వికిపిడియా (తెవికీ) ఒకభాగం. ప్రసిద్ధులైన పండితులనుంచీ సామాన్యపాఠకులవరకూ తెలుగువారందరూ తెవికీని సాధికారికమైన సైటుగా ఆదరిస్తున్నారు. అనేకులు తమవ్యాసాలకు తెవికీనుంచి సమాకారం తీసుకుని వాడుకుంటారు. నేను కూడా అనేక సందర్భాలలో సమాచారంకోసం అక్కడ వెతుకుతూంటాను.

తెవికీ నిర్వాహకులూ, సభ్యులూ నిస్వార్థంగా సేవ చేస్తున్నవారే. యథాశక్తి నేను కూడా కొన్ని వ్యాసాలు అక్కడ పోస్టు చేసేను. ఎప్పటికప్పుడు వారి స్పందన నాకు అందుతూనే ఉంది. సైటునిర్వాహకులలో ఇద్దరు ముగ్గురు నాకు పరిచయస్థులే.

ఈనేపథ్యంలో నేను శ్రీదేవిగారి బొమ్మగురించి వారికి తెలియజేసినప్పుడు, వారు ఆ పొరపాటు సరిదిద్దుతారనే అనుకున్నాను. అది జరగలేదు. అంచేత నిన్న మళ్లీ శ్రీదేవిపేజీ మరికొంచెం పరీక్షగా చూసేను. నాకు కలిగిన సందేహాలే ఈ పోస్టు.

మొదటిప్రశ్న వారు ఎందుకు మార్చలేదు అన్నది. నాకు విశదపరచలేదేమీ అన్నది రెండో ప్రశ్న. ఆ నిర్వాహకులలో కొందరు సాహితీవేత్తలు. అసలు తెలుగుసాహిత్యంతో ఏమాత్రం పరిచయం

ఉన్నవారైనా నాయనికృష్ణకుమారిగారి చిత్రం గుర్తించగలరు. నాయని కృష్ణకుమారిగారిచిత్రం శ్రీదేవిగారి పేజీలో 3 నవంబరు 2024లో చేర్చబడింది. అలా చేర్చినవారు తెవికీ సభ్యులుగా చాలాకాలంగా ఉన్నవారే. వారు మార్చలేదు, నేనే మార్చుదాం అనుకుని ప్రయత్నించబోతే నాకు ఒక హెచ్చరిక వచ్చింది. **కాలదోషం పట్టిన పోస్టు మార్చడానికి ప్రయత్నిస్తే, ఆతరవాత చేసిన దిద్దుబాట్లు అన్నీ తొలగిపోతాయి** అని ఆ **హెచ్చరిక.** ఈమధ్య నియమాలు చాలా మారేయి.

కాలదోషం పట్టడం ఎందుకు జరిగింది? ఆ బొమ్మ ఎక్కించినతేదీ 3 నవంబరు 2024. అంటే దాదాపు ఏడాది అవుతోంది. ఈ కాలదోషం ఎప్పుడు ఎలా పడుతుందో నాకు తెలీలేదు. కానీ అంతకాలం ఎలా ఊరుకున్నారని నాసందేహం. ఎందుకంటే, నేను ఏమి పోస్టు చేసినా నాకు వెనువెంటనే వారి స్పందనలు అందేయి ఇంతవరకూ. కానీ ఈ శ్రీదేవి బొమ్మవిషయంలోనే ఏచర్యా లేదు. పైన చెప్పినట్టు తెవికీని సాధికారికమైన సైటుగా గుర్తించి చాలామంది రచయితలూ, రిసెర్చిస్కాలర్లు ఉపయోగించుకుంటారు తమరచనలలో.

ఈవిషయంలో తెవికీవారు తగిన చర్య తీసుకోడానికి కారణం నాకు తెలీదు మరి. కానీ అది సమంజసం కాదని మాత్రం చెప్పదలుచుకున్నాను.

(సెప్టెంబరు 21, 2025)

(తా.క. ఈటపా పోస్టు చేసేక, తెవికీ సభ్యులొకరు నాయని కృష్ణకుమారిగారి చిత్రం తొలగించినట్టు వ్యాఖ్య పెట్టేరు.)

(అ)రాచకీయాలు

అమెరికా రాజకీయాలు

మామూలుగా నేను అమెరికా రాజకీయాలు ప్రస్తావించను కానీ కొన్ని అంశాలగురించి సూచనప్రాయంగా మనం తప్పనిసరిగా ఆలోచించవలసినవాటిగురించి రాసేను.

ఇది అమెరికా రాజకీయాలూ, అరాచకీయాలగురించే. ఇదంతా నేను చూసినప్రపంచంలో నేను బతుకున్నసంఘంలోనించి నేను గ్రహించినది మాత్రమే. ఎవరి అభిప్రాయాలు వారివి. ఇవి నా అభిప్రాయాలు.

ప్రత్యేకించి ఇప్పుడు ఇది రాయడానికి కారణం ఒక తమిళపడుచు అమెరికాకి అధ్యక్షురాలు కాగలసందర్భం వచ్చిందని. మామూలుగా మనవాళ్లు అనగానే ఉత్సాహం రావడం మామూలే కదా.

కమలా హారిస్ ఉపాధ్యక్షురాలయినప్పుడు కూడా సంతోషించేను. చాలామంది భారతీయులు అమెరికాలో చాలా ఉత్సాహం చూపించేరు కానీ ఇండియాలో అంత స్పందన వచ్చినట్టు కనిపించలేదు. అధ్యక్షురాలనగానే మాత్రం తమిళనాడులో ఆఅమ్మాయి తల్లి పుట్టినఊరునుండి అమెరికాలో పుట్టి పెరిగిన భారతీయులవరకూ ఆవిడకి అమితప్రోత్సాహం ఇచ్చేరు. కొందరు భారతీయులు మద్దతు ఇవ్వలేదని నాకు ఇప్పుడే, ఎన్నికలు ముగిసేక, కమలా హారిస్ ఓటమి అంగీకరించేక తెలిసింది.

యూట్యూబులో నాకు తెలీని వేదికలు భారతీయముఖాలతో దర్శనమిచ్చి ఆవిడ ఎందుకు గెలవలేదో, మనవాళ్లు ఎందుకు మద్దతు ఇవ్వలేదో ఉపన్యాసాలమీద ఉపన్యాసాలు గుప్పించేస్తున్నారు. అవి అనవసరం, అధికప్రసంగాలు అనిపించి విసుగెత్తి సంగీతం విందామని యూట్యూబు తెరిస్తే, మూడొంతులు తెరనిండా మళ్లీ ఆ రాజకీయాలే. వాటితో తల దిమ్మెత్తి పోయేకన్నమాట రాస్తున్నాను.

అసలు అమెరికాలో అందరూ విదేశీయులేకదా. ఇది వలసదేశం. రెండు వందలఏళ్లక్రితం అచ్చతెల్లవారు ఇక్కడికి వచ్చి ఇక్కడున్న అసలు అమెరికనులనుండి ఈభూభాగం దోచుకోకపోతే, ఇంత రగడ జరగవలసిన అవుసరమే ఉండేది కాదు.

చుట్టమై వచ్చి దెయ్యమయి పట్టుకున్నట్టుగా ఉంది ఇదంతా చూస్తుంటే. రిపబ్లికనులు విదేశీయులని వాళ్లదేశాలకి తోలేయాలన్న రగడ తెచ్చేరు. అలా అరుస్తున్నవాళ్లలో మనవాళ్లు కూడా ఉన్నారు. బ్రిటనునుండి వచ్చిన తెల్లవారివాదన, "మేమే అసలుసిసలు అమెరికనులం, మేము ఈ భూభాగాన్ని ఇంతగా అభివృద్ధి చేసేం కనక ఇది మాదే" అని. అలాగే ఇతర విదేశీయులూ వచ్చేరు. భారతీయులు, జపానువారు మేధాసంపన్నులు కనక వారిని పని గట్టుకు పిలిపించి వారిచేత దేశం అభివృద్ధి చేయించుకున్నారు.

నాఅభిప్రాయంలో కమలా హారిస్ ఆలోచనలు సమర్థవంతంగానే ఉన్నాయని. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో చేసిన నియమాలూ, చట్టాలూ ధనవంతులకి పనికొచ్చేవే కానీ మధ్యతరగతివారికీ శ్రామికులకీ ఉపయోగపడేవి కావు. అనేకమంది మధ్యతరగతి జనాలకి చిక్కులు తెచ్చిపెట్టేవి కూడా. అంచేత, ట్రంప్ రెండోసారి మళ్లీ అధ్యక్షుడు కాకపోతే బాగుండుననే నేను అనుకున్నాను. కానీ అయేడు. తాను అధ్యక్షుడయితే చేయగల ఘనకార్యాలమాటకొస్తే, ఆయన ఎన్నికలకి ముందు ఇచ్చినమాట వేరు. ఇంకా అధ్యక్షుడు కాలేదు కానీ అవగానే చేయగలఘనకార్యాలకి సిద్ధమవుతున్నాడు. ముందు ఇచ్చినమాటకీ ఇప్పుడు చేస్తున్న లేదా చేయబోయే కార్యాలకి సంబంధించిన మాటకీ పొందిక లేదు. ఒక చిన్న ఉదాహరణ తాను స్త్రీల బాగోగులు చూస్తానన్నాడు ఎన్నికలకిముందు. ఇప్పుడు ఆయనకార్యక్రమంలో స్త్రీలఆరోగ్యవిషయంలోనే కాదు సాంఘికస్థాయి విషయంలోకూడా స్త్రీలకి హాని కలిగించేవే. స్త్రీలఉద్యోగాలు పరిమితమయిపోతాయి. మిలటరీలో ఉద్యోగాలు ఊడిపోతాయి.

ఇలాటివి చాలా ఉన్నాయి. ప్రస్తుతం ట్రంప్ కి ఓటు వేసిన కొందరు ఓటు వేసినందుకు విచారం వెలిబుచ్చుతున్నారు. వీరిలో ఎక్కవమంది చిన్నచిన్న పనులుచేసి పొట్ట పోషించుకునే లటీనోలు. వాళ్లందర్నీ మూకఉమ్మడిగా వారిదేశాలకి పంపేయడానికి అప్పుడే ప్రయత్నాలు కూడా మొదలయేయి. వాళ్లని అలా తోలేసేక వారు చేసే పనులకి తెల్లవారు సిద్ధంగా ఉన్నారా? రిపబ్లికనులు ఈకోణంగురించి మాటాడరు.

సీనియర్ సిటిజనుల పరిస్థితి అస్తవ్యస్తమయిపోతుంది social security, healthcare హరించేస్తే. వీటివల్ల గవర్నమెంటు నాశనం అయిపోతుందని వారివాదన. నిజానికి ఇది గవర్నమెంటు డబ్బు కాదు. పెన్షన్ లాటిదే. ఉద్యోగాలలో ఉన్నంతకాలం నెలనెలా జీతాల్లోనుండి 6.2 శాతం Social securityకి తీసుకుంటారు. అలాగే వారి employer కూడా తమఆదాయాల్లోంచి కొంత ఇచ్చుకుంటారు. ఇవి తప్పనిసరి. నిజానికి ఆ సొమ్ముని ప్రభుత్వం ఇతర ప్రోగ్రాములకి ఖర్చు పెట్టినసందర్భాలు అనేకం ఉన్నాయి. రిపబ్లికనులు, డెమొక్రటులూ కూడా అలా ఖర్చు పెట్టేరు. అంచేత, ప్రభుత్వం దివాలా తీస్తోందన్న రిపబ్లికనువాదన సమర్థనీయం కాదు.

నాకు వివరాలు అంతగా తెలీవు కానీ నేననుకోడం, ఈ సో.సె. ప్రోగ్రాము ప్రైవేటు చేసి, ఉద్యోగాల్లో ఉన్నవారందరినీ తాము కొత్తగా తెరిచిన భీమాపథకాల్లో చేరమని ప్రోత్సహించడం అని. అలా తమ సొంత కంపెనీలు నడుపుకుంటే వాటికి హామీలుండవు ప్రేవేటుకంపెనీకి ఉండే వసతులు తప్ప.

ట్రంపు అలాటి కంపెనీలు తనస్నేహబృందంచేతే పెట్టించి డబ్బు చేసుకోవచ్చు. సామాన్యులు దివాలా తీయొచ్చు. అంతే కాక, ఈ గవర్నమెంటు ప్రోగ్రాము తొలగించేస్తే, ఇప్పటికే రిటైరయినవారిగతి ఏమవుతుందో నాకు తెలీదు. ప్రస్తుతం 67 మిలియన్లు ఈ సోషల్ సెక్యూరిటీఆదాయంమీద బతుకుతున్నారు. అంటే 20 శాతం అమెరికనులు!!

అలాగే ట్రంప్ విదేశీవస్తువులమీద 20 శాతం టారిఫ్ వేస్తానడం కూడా. ఆర్థికరంగంలో ప్రముఖులు అలా టారిఫ్ వేస్తే, ఆ విదేశీయులు కాదు అమెరికన్ వాడుకదారులే ఇచ్చుకోవలసివస్తుందని అనేకవిధాల చెప్తున్నారు కానీ ట్రంప్ ఒప్పుకోడం లేదు. మీలో ఆర్థికవేత్తలుంటే అవునో కాదో చెప్పండి.

సూక్ష్మంగా చెప్పాలంటే అవినీతే వీరి నీతి అయిపోయింది. ట్రంప్ కాబినెట్ లో చేర్చుకుంటున్న ప్రతి ఒక్కరూ సమాజం అంగీకరించిన నీతికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నవారే. ఇందులో భారతీయులు కూడా ఉన్నారు. ఇక్కడ కూడా స్పష్టంగా తెలిసేది ధనవంతులయిన భారతీయులు, స్వార్థపరులు ట్రంప్ మందలో కలిసిపోయేది. అలాటిచింతన లేనివారు కమలా హారిస్ ని సమర్థించేరు.

ఇలాటివే ప్రతిరంగంలోనూ ట్రంప్ ఆలోచనాధోరణికీ సామాన్యజనుల ఆర్థికపరిస్థితులకీ పొంతన లేదు. నక్కకీ నాగలోకానికీ ఉన్నంత తేడా. ఆయనకి ఓటు వేసిన సామాన్యులకి ఇప్పుడు అర్థం అవుతోంది కనక ఓటు వేసినందుకు విచారిస్తున్నారు. దానివల్ల కలిసొచ్చేది ఏమీ లేదు.

ఇవేమీ సరిగా అర్థం చేసుకోకుండా మనవాళ్లు కమలా హారిస్ ఎందుకు ఓడిపోయింది అని ఉపన్యాసాలు ఇవ్వడం అజ్ఞానమే. వీళ్లకి నిజంగా ఏదైలా తెలిస్తే అవేవో ఎన్నికలకి ముందే చెప్పి ఉంటే కొందరైనా తెలివి తెచ్చుకుని తగిన అభ్యర్థికి ఓటు వేసేవారేమో.

(నవంబరు 11, 2024)

(తా.క. 3 జడ్జీలు ఆ tariffs చట్టవిరుద్ధం అని రూలింగ్ ఇచ్చేరు. ఇక ఏమౌతుందో చూడాలి)

అమెరికాచరిత్రలో ఒక దుర్దినం

నాయకుడు అంటే సామాన్యజనాలకు, తుఫానుసమయంలో దుర్భరఅగ్ని శిఖలలో చిక్కుకుని సర్వస్వం పోగొట్టుకున్న దురదృష్టజీవులకు తగినసహాయం అందించవలసిన మానవుడు కావాలి. ఒట్టిమాటలు కాదు క్రియలో చూపాలి.

లాసాంజలస్ లో 5 ఊళ్లలో ప్రచండ అగ్ని శిఖలు చెలరేగుతున్నాయి పదిరోజులుగా. కొన్ని వేల ఎకరాలు ఘోరమైన మంటలలో ఆహుతి అయిపోతున్నాయి. వందలలో వేలలో ప్రజలు ప్రాణాలయినా నిలుపుకోడానికి కుతకుతలాడుతున్నారు.

వారికి సహాయం అందించవలసిన నాయకుడు లేడు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా అందించే సహాయానికి ఏనాడూ లేని కొత్త ఆంక్షలు సృష్టిస్తున్నారు ట్రంప్ అనుయాయులు. అమెరికా ఈరోజునుండి నిశ్చయంగా రెండు తెగలయిపోయింది. డెమొక్రట్ ఆధ్వర్యంలో ఉన్న ఏ స్టేటూ ఏ సహాయాన్నీ పొందదు ట్రంప్ ఆధ్వర్యంలో. ఇది కూడా ఆయన campaign వేళ చెప్పకుండా దాటేసిన మాటే.

ట్రంప్ ఈరోజునుండి 4 ఏళ్లపాటు అధికారంలో ఉంటాడు. ప్రజలందరినీ ఆదుకుంటానంటూ ఎన్నికలకు ముందు కబుర్లు చెప్పిన మానవుడు, గెలిచేక, ప్రభుత్వసహాయం అందించడానికి తనకి ఓటు వేసేరా లేదా అని అడుగుతున్నాడు.

తెలియనివారికి తెలియడంకోసం ఈయనగారి ఔదార్యం ఏమిటో ఒక్క ఉదాహరణ ఇస్తాను. 2017లో పోర్టోరికోలో తుఫాను వచ్చినప్పుడు చూడడానికి వెళ్లి అక్కడ గుంపులలోకి పేపర్ టవల్స్ విసిరేడు. తుఫానులో జీవితాలు ధ్వంసమయిపోతున్నప్పుడు అందించవలసిన సహాయం అదా? అలా విసరడానికి ఆయనకి అసలు అవి ఎలా అందుబాటులోకి వచ్చేయంటే అలా చేయడానికి సిద్ధుడన్నమాటే కదా. అది ఒకటి. రెండోది ఆ విషయం తరవాత ఇంటర్వ్యూలలో మాటాడినప్పుడు ఎందుకలా చేసేరంటే, I had fun, they had fun అని జవాబు. నీటిలో మునిగిపోతున్నవాడికి గరికిపోచ అందించినట్టనిపించదా?

ఇలాటి పరిస్థితులలో సహృదయులు, ఉదారులు అయిన అనేకులు బాధితులకు తాము చేయగలిగిన సహాయం చేస్తున్నారు. సామాన్యజనులని ఆదుకునేవారు సామాన్యజనులే. స్వయంగా కానీ ధనసహాయంద్వారా కానీ ఆదుకోవచ్చు.

అనేక సంస్థలు ఉన్నాయి. అలాటి సంస్థలలో ఇదొకటి. https://www.letterscharity.org/ ఈలింక్ చూడండి. వారు అందుకున్న దానం పూర్తిగా అగ్నిబాధితులకి అవుసరమైన సహాయం చేయడానికే వినియోగించబడుతుంది. మాఖర్చులు అంటూ అందులో కోతలు ఉండవు.

ఈ సంస్థకే మీసహాయం అందించమని నేను అడగడం లేదు. మీకు మీరే కనుక్కుని మీకు నచ్చిన సంస్థద్వారా కానీ మరొకవిధంగా కానీ తోడ్పడమని నా అభ్యర్థన.

(జనవరి 20, 2025)

తదితరములు

కథ, వ్యాసం అంటూ ఏదో ఒక వర్గానికి చెందని మరికొన్ని రచనలు ఇక్కడ ఇస్తున్నాను. ఇవే నా ఆత్మకథ అనుకోవచ్చు.

నా అంతర్జాలప్రస్థానం

అన్ని ప్రస్థానాలు అయేయి, ఇది మాత్రం ఎందుకు చూడకూడదూ అని మొదలుపెట్టేను. అసలు కంప్యూటరులో తెలుగు వాడడం 1980వ దశకంలో విస్కాన్సిన్ లో తెలుగుపాఠాలు కంప్యూటరుమీద రాయడంతో మొదలయింది.. ఆ తరవాత ఒక దశాబ్దంపాటు వేరు వేరు ఫాంటులతో కుస్తీ పట్టవలసివచ్చింది. కొన్నఫాంట్లు అచ్చిరాలేదు. దాంతో కంప్యూటరుతోనే వచ్చిన గౌతమి ఖత్తు వాడడంమొదలు పెట్టేను. గతిలేనివారికి ఖతి గౌతమి అంటారని విన్నాను కానీ నాకు మరే ఇతరఫాంట్లు నచ్చలేదు. ఇప్పుడు గౌతమి ఎంత అలవాటయిపోయిందంటే, ఏఅక్షరానికి ఏ కీ అంటే చెప్పలేను. నావేళ్లే కొట్టుకుంటూ పోతాయి డిక్టపోస్ లాగ.

ఆ తెలుగుపాఠాలరోజులలోనే, యూనివర్సిటీలో పరిచయమైన కొందరు అమెరికనులు మన సంప్రదాయాలగురించి మాటాడడంతో మొదలుపెట్టి, కథలగురించి చర్చించడంవరకూ కొనసాగించేరు. ఒకావిడ తమిళం నేర్చుకుని సంగమ్ సాహిత్యంమీద రిసెర్చి చేసేరోజుల్లో, తను అనువదించిన కథలు నాకు చూపించింది. ఆతరవాత నన్ను తెలుగుకథలు అనువాదం చేయమని అడిగింది. ఆరోజుల్లోనే 2, 3 కాన్ఫరెన్సులలో కూడా తెలుగుకథలగురించి మాట్లాడేను. నా అనువాదాలకి అదీ నాంది. ఒక యూనివర్సిటీ జర్నల్ అడిగితే రావిశాస్త్రిగారికథ ఒకటి అనువాదం చేసి ఇచ్చేను. సరే, ఎలాగా చేస్తున్నాను కదా, వాటిని అంతర్జాలంలో పడేస్తే మరో పదిమంది చూడొచ్చు అనుకుని thulika.net website **తెరిచేను**. ఇక్కడే కథ రసపట్టులో పడింది. విదేశీయులు చూసి ఆనందించడం, మెయిళ్లివ్వడం ఒక ఎత్తు. మన వి.బి. సౌమ్య మెయిలు మరో ఎత్తు. "మీఅనువాదాలు చూసేను. నాకు నచ్చలేదు," అని. ఏమంటాను? సరే అన్నాను.

నిజానికి నాకు ఇంగ్లీషు వచ్చు అని గొప్పలు పోతూ నాఅంతట నేను నాకొచ్చిన ఇంగ్లీషులో రాసి పారేసినవి కావు ఆ అనువాదాలు. అనువాదం చేయమన్న అమెరికనుమిత్రులకీ, ఆతరవాత ఇంకా కొంతమందికీ చూపించి, వాళ్లసలహాలు తీసుకుని, ఆప్రకారం మార్చుకుని, ప్రచురిస్తూ వచ్చేను. అప్పుడే మరోవిషయం కూడా కనిపెట్టేను. ఒక కథ ఇద్దరు ముగ్గురికి చూపిస్తే, ఒకరికి తప్పయింది మరొకరికి ఒప్పు. అంతే కాదు, వీళ్లకి మర్యాదలు కూడా ఎక్కువే కదా. ఈకథ నాకు నచ్చలేదు అని చెప్పరు. కూరెలా ఉంది చీరె బాగుంది అన్నట్టుంటాయి. ఉదాహరణకి interesting అంటారనుకోండి. అంటే వాళ్లకి "ఇంటరెస్టింగుగా ఉంది, అంటే బాగుంది" అని మనం అనుకుంటే, మనదే పొరపాటు. ఇక్కడ భాషలో ఉన్న నాజూకుతనం నాకు ఇప్పటికీ కొత్తే. పండితులు రాసేవ్యాసాలవిషయంలో కొన్ని స్టైల్స్ ఉన్నాయి. యూనివర్సిటీ పేపర్సుకోసం, థీసిసులకోసం రచయితలు ఒక స్టైలుని స్థిరం చేసుకోవాలి. దానికి చాలా తంటాలు పడాలి. అది నాకు పొసగలేదు. అంతే కానీ నేనేదో నిర్లక్ష్యంగానో అసమర్థతతోనో అనువాదాలు చేసి పారేయలేదు. యథాశక్తి శాయశక్తులా సరిగా చేయడానికే ప్రయత్నించేను. ఇంతకీ, మనవాళ్లు ఎందుకు బాగులేదంటారు అంటే, నాకు తోచినవి 3 కారణాలు.

1. తెలుగువాళ్లకి తెలుగురుచి తెలుసు కనక అనువాదాలు అంతగా రుచించవు. అది సాధారణంగా వచ్చే స్పందన.

2. ఒకభాషలో నుడికారం మరొకభాషలో నుడికారం అచ్చంగా మూలభాషలాగే రాదన్నది ఒప్పుకోకపోవడం. అమెరికాలో నివసిస్తున్న తెలుగువారు కూడా ఇది గమనించకపోవడం విశేషం. అసలిక్కడ సాంస్కృతికపరమైన విభేదాలు కూడా ఉంటాయి. మనకి హాస్యంగా తోచినది అమెరికనులకి దూష్యం కావచ్చు. అనువాదకులు అది కూడా గుర్తుంచుకోవాలి.

3. ఇండియనింగ్లీషు అయితే తెలుగువారికి నచ్చేఅవకాశాలు ఎక్కువే కానీ విదేశీయులకి అర్థం కావు. వారికి అమోదయోగ్యం కాదు.

ఇవన్నీ కాక వ్యక్తిగత ఇష్టాయిష్టాలు కూడా ఉంటాయి. తెలుగువాళ్లకి ఇండియనింగ్లీషు నచ్చినట్టు తెమెరికనింగ్లీషు నచ్చదు. ఆ రెంటిలో గల సునిశితమైన తేడాలు, దానికి కారణాలు గమనించినట్టు కనిపించదు. ఇండియాలోనూ అమెరికాలోనూ కూడా పురస్కారాలు పొందిన రచనలు సూక్ష్మంగా పరిశీలిస్తే తెలుస్తుంది.

ఇంతకీ, కొన్నాళ్లయేక ఆ సామ్యే మళ్లీ మెయిలివ్వడంతో అనువాదాలమాట ఎలా ఉన్నా, మా పరిచయం మాత్రం పెరిగింది. ఆ తరవాత తన తెలుగుబ్లాగుకి లింకిచ్చింది. అదే నాకు అంతర్జాలంలో తెలుగుబ్లాగులతో తొలిపరిచయం. అసలు బ్లాగు అనేది ఒకటి ఉంటుందని కూడా తెలియనిరోజులవి. తనబ్లాగు చూసేక, నాకూ ఒక బ్లాగు పెట్టాలనిపించి బ్లాగు తెరిచేను. అదే **తెలుగు తూలిక**.తూలిక పేరు ఎలా వచ్చిందో చెప్తాను. మాడిసన్ లో ఎండాకాలంలో farmer's market అని ప్రతి శనివారం సంతలాటిది పెట్టేవారు. చుట్టుపట్ల పల్లెల్లో రైతులు తమతోటల్లో పెంచిన కాయగూరలు, ఇల్లాళ్లు చేసిన బ్రెడ్, ఇంకా అనేక తినుబండారాలతో state capital చుట్టూ చిన్నచిన్న దుకాణాలు తెరిచి పెట్టేవారు. చాలా సరదాగా ఉండేది ఊరికే వాళ్లని చూస్తూ నడవడం. ఒకసారి ఎవరో నెమలి ఈకలు అమ్ముతూ కనిపించేరు. ముచ్చటేసి మూడు కొన్నాను. ఇంటికొచ్చేక, నాసైటుకి తూలిక అని పేరు పెట్టాలని తోచింది. తూలిక.నెట్ ఆ నెమలీక తొలి అవతారం అన్నమాట. ఇంగ్లీషు సైటుకి తూలిక అని ఉంది కనక, తెలుగు బ్లాగు తెలుగు తూలిక అయింది.

ఒకమ్మాయి బెంగుళూరునించి మెయిలిచ్చింది. ఈసైటు సగం సగం తెలుగు వచ్చిన మరియు ఇంగ్లీషుబడిలో చదువుకున్న తెలుగువారికి చాలా ఉపయోగం అని చెప్పి, సామెతలు నాఅనువాదంతోపాటు తెలుగులో కూడా ఇవ్వమని సూచించింది. ఆతరవాత నేను ఇండియా వచ్చినప్పుడు పని గట్టుకుని బెంగుళూరునించి హైదరాబాదు వచ్చింది కూడా నన్ను కలవడానికి. దాంతో, నా సైటుకి నేను అనుకోని మరొక ఆదర్శం కనిపించింది. తెలుగు రాని తెలుగు యువతీయువకులు తెలుగుమీద అభిమానం ఉన్నవారు కూడా తూలిక.నెట్ అభిమానులయేరు.

(10/22/2023)

నా అంతర్జాలప్రస్థానం 2

తెలుగుపాఠకలోకానికి స్వాగతం.

మీఆదరణ, అభిమానాలకోసం నాకథలు ఇక్కడ పెడుతున్నాను. ఇది నా తెలుగుతూలిక.

ఇదీ నాబ్లాగుకి తొలి పరిచయవాక్యం. డిసెంబరు 2, 2017నాడు ప్రారంభించేను.

కేవలం నాకథలు పోస్టు చేయడం మాత్రమే ఆక్షణంలో తోచిన మాట. అన్నానే కానీ కథలే కాదు విమర్శలు కూడా ఆ వెంటనే మొదలుపెట్టేను. "చివరకు మిగిలేది" నవలగురించి. ఈనవలగురించి తెగ మెచ్చుకుంటూ రాసిన విమర్శలూ, వ్యాసాలు కోకొల్లలు. అవన్నీ కాకపోయినా, నాకళ్ల బడ్డవి చదివేక, ఈనవల చదివితే నాకు అలా అనిపించలేదు. నాకు తోచిన అభిప్రాయం రాయడమే నాఉద్దేశం. దీనిమీద వ్యాఖ్యలు బాగానే వచ్చేయి.

ఒక కథో ఒక రచయితో కాక, ఒక ఆలోచన ప్రాతిపదికగా రాసిన మొదటి వ్యాసం "నేను రాసిందీ మీరు చూసిందీ ఒకటేనా, ఒకటే కావాలా?" అన్నది. దీనికి నేను చేస్తున్న అనువాదాలగురించి వచ్చిన అభిప్రాయాలు కారణం కావచ్చు. ప్రధానంగా నాకనిపించేది – ఒక కథ చదివినప్పుడు పాఠకులందరూ ఒక్కలాగే స్పందించరు. ఎవరికి నచ్చిన, ఇష్టమైన అంశం వారు తీసుకుని, మొత్తం కథమీద వ్యాఖ్యానిస్తారు. అనువాదం కూడా అంతే. నాకెలా అర్థమయిందో ఆ కోణమే అనువాదంలో కనిపించవచ్చు, మూలరచయిత అభిప్రాయం పట్టుకోడానికి నేనెంత ప్రయత్నించినా సరైనది కాకపోవచ్చు ఒకొకప్పుడు.

నేను బ్లాగు మొదలుపెట్టిన కొత్తలో మంచి వ్యాఖ్యలు వచ్చేయి విషయపరంగా. నేను చాలాకాలంగా కథలు రాస్తున్నానని తెలిసినవారు కొందరైతే, కొత్తగా ఇప్పుడే మొదలు పెట్టేను అనుకున్నవారు కొందరు. నాకు అది నూతనోత్సాహాన్నిచ్చిందనే చెప్పుకోవాలి. అంటే నాకు బ్లాగుముఖం పడిందన్నమాటే.

ఈ స్పందనలతో రాయాలన్న మరింత ఉత్సాహం వచ్చేసింది. ఇంక రాయడానికి విషయాలే తక్కువ. విస్కాన్సిన్ చలికాలం. విస్కాన్సిన్ లో రెండే కాలాలు అని ఒక నానుడి. చలికాలం, రోడ్ రిపేర్లకాలం. ఎలా చూసినా కార్లకి ఆటంకాలేనన్నమాట. అసలు విషయం అది కాదులెండి.

రాయడానికి విషయం వెతుక్కుంటున్నానన్నాను కదా. ఒకరోజు కారు బయటికి తీసి, చేతిలో రిస్ట్ వాచీ చేతికి తగిలించుకోకుండానే కారెక్కబోతుంటే, వాచీ చేయి జారి మంచులో పడింది. జాగ్రత్తగా ఒంగి మంచులోంచి తీయబోతుంటే మరింత కూరుకుపోయింది. ఇఁక చేసేదేమీ లేదని, కారెక్కి వెళ్లిపోయేను. అది నా మొదటి ఊసుపోక, పాతవాచీ. దానికి చాలామంది స్పందించేరు. దాంతో మరింత ఉత్సాహం. అవి చాలా జోరుగానే సాగేయి. నెల తిరిగేసరికి, ఊసుపోక అంటూ ఊసుపోకకబుర్లే ధారావాహికగా రాస్తూ వచ్చేను.

ఇక్కడ రెండు విషయాలు పైకొచ్చేయి. ఇలా పాఠకులనుండి స్పందనలు ప్రింట్ పత్రికలలో లేవు. బ్లాగుకి అదొక సౌలభ్యం. అది ఒక కారణం కావచ్చు నేను ఆ ప్రింటు పత్రికలరోజుల్లో అట్టే రాయకపోవడానికి అని ఇప్పుడు అనిపిస్తోంది. అవునో కాదో ఖచ్చితంగా చెప్పలేను.

వేములవాడ భీమకవి నాతొలి సాహిత్యవ్యాసం. బహుశా నేను ఈకవిగురించి రాయాలనుకోడానికి కారణం నేను చదివిన కథలనుకుంటాను. వెనకటిటపాలో చెప్పేను కదా మాడిసన్ లో లైబ్రరీలో తెలుగుపుస్తకాలగురించి. ముఖ్యంగా నేను ఎక్కువగా చదివిన భారతి, ఆంధ్రపత్రికలు అక్కడ ఉండడంతో మళ్లీ అవి చదవడం మొదలు పెట్టేను. నమ్మకంగా చెప్పలేను కానీ ఆపత్రిలలో ఎక్కడో వేములవాడ భీమకవి ఉదంతం ఒకటి నామనసులో నిలిచిపోయింది కనిపించి ఉండాలి. వేములవాడ భీమకవి రాజు కళింగగంగుని చూడడానికి వెళ్తే ఆయనకి రాజుగారి సభాప్రవేశం దొరకలేదు. భీమకవికి కోపం వచ్చి, ఆరాజుని శపించేడు. ఆతరవాత ఒకరోజు రాత్రి వీధిలో భీమకవి నడుస్తుంటే ఒకగోతిలోనుండి మానవస్వరం ఒకటి వినిపించింది. ఆయన ఆగి ఎవరది అని అడిగితే “వేములవాడ భీమకవి చేసిన జోగిని” అని అన్నాడుట ఆవ్యక్తి గోతిలోంచి. భీమకవి సంగతి గ్రహించి, మళ్లీ ఆరాజుకి రాజ్యం వచ్చుగాక అని వరం యిచ్చేడు. ఆ “వేములవాడ భీమకవి చేసిన జోగిని” అన్నవాక్యం నామనసులో చాలాకాలంగా మెదుల్తూ ఉండేది. అంచేత, లైబ్రరీలో పుస్తకాలు చూసి, ఆవ్యాసం రాసేను. అలా అన్నమాట నేను సాహిత్యవ్యాసాలు రాయడం మొదలయింది. అమెరికాలో తెలుగుమాట వస్తే, విస్కాన్సిన్ లైబ్రరీగురించి తప్పకుండా చెప్పాలి. నేను రాసిన అనేకవ్యాసాలకి స్ఫూర్తి ఆ లైబ్బరీయే. అక్కడ ఉన్నన్ని తెలుగు పుస్తకాలు మనదేశంలో కొన్ని లైబ్రరీలలో లేవంటే ఆశ్చర్యం కాదు.ది. దేనికైనా వాతావరణం ముఖ్యం. నాకు ఆ లైబ్రరీ, అంతర్జాలంలో బ్లాగు కలిగించేయి ఆ సౌకర్యం.

(అక్టోబరు 22, 2023)

నా అంతర్జాల ప్రస్థానం-3

నా అంతర్జాల ప్రస్థానంలో మూడో మెట్టు పాఠకులు మరియు మిత్రసంచయంతో అనుభవాలు.

తెలుగు తూలిక తెరిచి 16 ఏళ్లు కావస్తోంది. అంతకుముందే జూన్ 1, 2001లో తూలిక.నెట్ తెరిచేను కానీ ఆ అనుభావాలు వేరు. అక్కడ పాఠకులందరూ అపరిచితులే. అందరూ కేవలం నాసైటులో పోస్టులగురించే వ్యాఖ్యానిస్తూ స్పందించేరు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు కూడా ఆస్థాయిలోనే ఉత్తరప్రత్యుత్తరాలు నడిపేరు. ఆ అనుభవాలు మంచి ఉత్సాహాన్ని ఇచ్చేయి.

తెలుగుతూలిక బ్లాగు, కొంతకాలం, 4, 5 ఏళ్లు అనుకోవచ్చు, నాసైటులోలాగే జరిగింది. వ్యాఖ్యలు కేవలం విషయంమీదే ఉండేవి. మంచి చర్చలే జరిగేయి. విజ్ఞులు విలువైన సమాచారం ఇచ్చేరు. ఎన్నో మంచి విషయాలు తెలిసేయి. కొన్ని తప్పులు దిద్దుకోడానికి దోహదం చేసేయి. క్రమంగా నారాతలే మారేయో, పాఠకులే స్వతంత్రించేరో కానీ తెలుగు తూలికలో అసలు విషయం వదిలేసి, అక్షరదోషాలున్నాయి అంటూ ఓ వ్యాఖ్య పెట్టడం, ఆతరవాత, వ్యక్తిగతంగా నా యోగక్షేమాలు పరామర్శించడం మొదలయింది. మీరెవరో తెలుసు, మీరెక్కడున్నారో తెలుసులాటివి. ఇలా చెప్పండి, అలా చేయండి అంటూ సందర్భశుద్ధిలేని సలహాలు కూడా వచ్చేయి.

ఇంచుమించు ఆరోజుల్లోనే Facebookలో చేరేను. అంతకుముందే ఖాతా అయితే తెరిచేను కానీ అటు తిరిగి చూడనైనా చూడలేదు దాదాపు 3 ఏళ్ళపాటు. ఆ తరవాత ఓ శుభముహూర్తంలో అడుగెట్టి, నా అనువాదాలు పోస్టు చేయడం సాగించేను. ప్రధానంగా, నా వెబ్ సైటును ఎక్కువమంది చూస్తారనే అక్కడ చేరింది. ఆతరవాత మిగతా టపాలు చూసి, రాసే చెయ్యి ఊరుకోదు కనక, నేను కూడా ఆదారిలోనే పడి ఇతరవిషయాలు రాయడం మొదలుపెట్టేను ముఖపుస్తకంలో. మిత్రమండలి దినదినప్రవర్ధమానంగా, శుక్లపక్షచంద్రునిమాడ్కి పెరిగిపోయింది. ఎక్కడెక్కడో మూలమూలల ఉన్న పరిచయాలన్నీ, నేను మరిచిపోయినవీ, ఇంకా గూగులులో ప్రముఖంగా పేరు కనిపిస్తోందనీ,

అమెరికాలో ఉన్నాననీ, మాలతి చందూర్ కాబోటు అనుకునీ — ఇలా అనేక కారణాలమూలంగా అన్నమాట మాలతి నామధేయురాలు ముఖపుస్తకంలో ప్రసిద్ధికెక్కింది.

నాకు చాలాకాలం పట్టింది అక్కడ స్నేహాలు కేవలం socializing అని తెలుసుకోడానికి. నాటపాలంటే ఇష్టపడి నాజాబితాలో చేరినవారికంటె, "ఎక్కడో చూసేం, "ఎప్పుడో కలిసేం," "ఎవరో చెప్పేరు," "నీప్రొఫైలుముఖం బాగుంది" అంటూ చేరినవారే ఎక్కువ. పిచికోలుకబుర్లకీ, బాగున్నారా, తిన్నారా, (ఇంకా) ఉన్నారా లాటి కబుర్లకి ఉన్న విలువ సాహిత్యానికి సంబంధించిన టపాలకంటె చాలా తక్కువ అనిపించింది. (తా.క. ఇంతకాలం అయేక నాకు సువిదితమైన మరోసంగతి, నాపేరు అంతమందినోళ్ల పడడానికి కారణం నాసాహిత్యం కాదనీ, నాడివోర్సే అని. ఆడవాళ్లే కాదు మగవాళ్లు కూడా ఉన్నారు. సాధారణపాఠకులే కాక ప్రముఖరచయితలు కూడా ఇలాటివే పట్టించుకుని నన్ను గౌరవించడమో నిరసించడమో చేయడమే చిత్రం. నాకు వెగటు కలిగించింది కూడా అదే.)

అలాగని, ముఖపుస్తకంద్వారా నాసాహిత్యాన్ని గుర్తించినవారు లేరు అనడం లేదు. నిజానికి చాలా విలువైన విషయాలు తెలుసుకున్నాను ఆ వేదికద్వారా. అసలు "గుర్తింపు" అంటే ఏమిటో అక్కడే తెలిసింది. నాకు తెలియనివారు నాసాహిత్యాన్ని గుర్తించేరని తెలియడం చాలా తృప్తినిచ్చేది. నాకు వారు తెలీదు కానీ వారికి నారచనలద్వారా నేను తెలుసు అని అర్థమయిందక్కడే. ముఖపుస్తకంలో చేరేకే, అబ్బరాజు మైథిలిగారు "సాహిత్యం" పేజీలో నన్ను చేర్చుకున్నారని తెలిసింది. అలాగే, కె. వెంకటరమణగారు నాసాహిత్యవిశేషాలు తెవికీలో పెట్టడం జరిగింది. నాకు వివరాలు స్పష్టంగా తెలీవు కానీ కథానిలయంలో నాకథలు చేరడం రమణమూర్తిగారి కృషిమూలంగానే అనుకుంటున్నాను. అలాగే సిరికోన సమూహంలో చేరేక ఏల్చూరి మురళీధరరావుగారిద్వారా నాపేరు మరో ఇద్దరికి తెలిసిందని తెలిసింది. మురళీధరరావుగారు అంతకుమున్నే తెలుగు తూలికలో నారచనలు చదివి, వాటిమీద వస్తుపరంగా ఎంతో విలువైన సమాచారం ఇచ్చేరు. అదొక మంచి అనుభవం నాకు.

ముఖపుస్తకంలోనే నాఅజ్ఞానం, తొందరపాటు కూడా బాగానే తెలిసేయి. తన్మూలంగా కొందరిని నామిత్రమండలిలోంచి తొలగించేను. తరవాత ఒకరిద్దరివిషయంలో విచారించి క్షమాపణలు చెప్పుకున్నాను కూడా.

ప్రధానంగా ముఖపుస్తకంలో చాలామంది మిత్రులు గమనించనివిషయం నేను ముఖపుస్తకంలో చేరడానికి కారణం. నేనున్నచోట తెలుగు వినిపించకపోవడంచేత, భాషాపరమైన ఆర్తితో ఆ పేజీ తెరిచేనన్నసంగతి చాలామంది పట్టించుకోలేదు నేను ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా చెప్పినా. సగానికి సగంమందికి అసలు ఆ దృష్టిలేదు. నాకోరిక కొంతవరకే సాగింది. కానీ నారచనలని వస్తుపరంగా ఆదరించినవారిని దృష్టిలో పెట్టుకుని వారికోసం ఉత్సాహంగా ఏదో ఒకటి రాస్తూ వచ్చేను. అలా ముఖపుస్తకంలో పడి నాతెలుగుబ్లాగులోనూ ఇంగ్లీషు సైటులోనూ రాతలు తగ్గిపోయేయి అన్న చింత కూడా ఉండేది. క్రమంగా ముఖపుస్తకంలో రాయడం కూడా కష్టమే అయింది. పదేళ్లు ప్రతిరోజూ ఏదో ఒకటి రాయాలంటే అంత తేలిక కాదు కదా. ఏమీ రాయకపోతే, ఎందుకు రాయలేదని అడుగుతారు. వారు అభిమానంతోనే అడిగినా నాకు అది ఒత్తిడిలా అనిపించేది.

పైగా, వారు నా టపాలు చూస్తున్నారు కదా, మరి నేను వారిటపాలు చూడకపోవడం నేరమేమోనని చూడబోతే, ఆ పోస్టులన్నీ నాకు అయోమయమే. వస్తుపరంగానూ, భాషాపరంగానూ కూడా. ఏదైనా అర్థం అయిందనుకుని ఒక వ్యాఖ్య రాస్తే, నాకు తెలీని నేపథ్యం చాలా ఉందని అప్పుడు తెలుస్తుంది. లేదా, నాకు ఆసక్తి లేని విషయాలు. నేను ముఖపుస్తకంనుండి తప్పుకోడానికి ఇవి కొన్ని కారణాలు అనుకోవచ్చు.

మొదట్లో నాకు ఏమాత్రం పరిచయం లేనివారు నారచనలు ఆదరించేరని చెప్పేను కదా. రెండోస్థాయిలో అంతర్జాలంలో నేను రాస్తున్నటపాలద్వారా కొంత పరిచయమై, కొందరు నారచనలను ప్రస్తావించడం కూడా జరిగింది. ఇక్కడ “కొంత” అన్నపదానికి కొంత వివరణ అవుసరం. నాకు స్వయంగా ఎవరితోనూ మైత్రి పెంచుకునే అలవాటులేదు. పెంచుకోలేను. అది నా బలహీనత అనుకోండి. అవివేకం అనుకోండి. చేతకానితనం అనుకోండి. పొగరు మాత్రం కాదు. మీకు అలవాటయిన భాషలో చెప్పాలంటే lack of social/networking skills. అంచేత, ఎవరైనా నాకు ఒకడుగు దగ్గరకి వస్తున్నట్టనిపిస్తే, నేను ఉలిక్కిపడి రెండడుగులు వెనక్కి వేస్తాను.

చాలామంది నన్ను ప్రత్యేకంగా చూస్తున్నట్టు అనిపిస్తుంది కానీ దానికి కారణం నా వ్యక్తిగతజీవితం అనుకుంటే బాధగా ఉంది కానీ అది స్పష్టంగానే కనిపించింది. ఏమాత్రం పరిచయం లేనివారు, నాకథలు చదవకుండా, “మీరంటే గౌరవం,” అంటే అది ఎలా వచ్చింది అన్నప్రశ్న వస్తుంది కదా. కొందరు వ్యక్తిత్వం కారణంగా చెప్తారు కానీ నాకు నమ్మకం లేదు. నన్ను తెలీనివారికి నావ్యక్తిత్వం ఏం తెలుస్తుంది కనక. నిజానికి ఇప్పుడు, ఇంతకాలం అయేక నాకు అర్థమయిన నికృష్ట

నిజం అంతర్జాలం ప్రవేశించేక కొట్టొచ్చినట్టు కనిపించిన సత్యం - నాపేరు అంతర్జాలంలో సుప్రసిద్ధమైనది నాసాహిత్యంమూలంగా కాక నేను తమరిగురువుగారిని విడిచిపోవడం మూలంగా అని చెప్పేను కదా. నారచనలగురించి నాలుగు ముక్కలు చెప్పలేనివారందరికీ నేను తెలియడం నాపూర్వజన్మసుకృతం అనే అనుకోవాలి. ఆధునిక తెలుగురచయితలలో చాలామందికి సాహిత్యంకంటె కట్టుకథలూ, అపనిందలూ, వ్యర్థప్రలాపాలంటే ఎక్కువ మక్కువ అని తెలుసుకున్నాను అనుభవపూర్వకంగా.

ముఖపుస్తకం అంటే కొంచెం తక్కువస్థాయి అన్న అభిప్రాయం చాలామందికి ఉంది. ఒట్ఠి కాలక్షేపం కబుర్లు అంటారు. కాలం వ్యర్థం అని కూడా అంటారు. నిజానికి బయటి ప్రపంచంలో ఉన్నంత వైవిధ్యం ముఖపుస్తకంలో కూడా ఉంది. సంస్కృతిని నిర్వచించే ఏపదం తీసుకుని అయినా చూడండి. – తిండి, బట్టా, ఉద్యోగం, పండుగలు, పూజలు, వ్రతాలు, గుళ్లు, గోపురాలు, యాత్రలు, విదేశీయాత్రలు, ఇంజినీరింగ్, మెడిసిన్, సినిమాలు, సంగీతం, సాహిత్యం, కుటుంబవిషయాలు, మందులూ మాకులూ, ఉచితసలహాలు … ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. ముఖపుస్తకంలో లేని అంశం లేదు.

కానీ బయటిలోకంలోలాగే ముఖపుస్తకంలో కూడ మంచి సాహిత్య విషయాలను చర్చించే పేజీలు కూడా ఉన్నాయి. **సాహిత్యం, ఛందస్సు**లాటి పేజీలు. వాటిలో వస్తువుకే ప్రాధాన్యం. అక్కడ వైయక్తిక పోగడ్తలేమీ లేవు నేను చూసినంతవరకూ. సిరికోన సాహితి గుంపులో ప్రౌఢ, గంభీర సంస్కృత విశేషాలు చూసి ఆశ్చర్యపోయేను. కానీ అక్కడ సాహిత్యచర్చలతోపాటు పొగడ్తలు, కూడా సుమారుగా అదే స్థాయిలో ఉన్నాయి.

ఛందస్సు నేర్చుకుందాం అని ఛందస్సు గుంపులో చేరేను. అసలు ఛందస్సు అంటే ఏమిటో అర్థమయింది. కానీ నాకు ఆనగణాలు, మాత్రలూ చూసుకుంటూ రాసే ఓపిక లేదని అనతికాలంలోనే గ్రహించేను. మనసులోకి వచ్చింది వచ్చినట్టు రాసుకుపోవడమే నాకు అలవాటు. అంచేత అక్కడినించి తప్పుకున్నాను.

గత పదేళ్ళలో జాలపత్రికలు మూడో నాలుగో చూసేను. మొత్తంమీద వివిధవేదికలూ, జాలపత్రికలూ చూసేక నాకు స్పష్టమయింది ఒక్కటే – సాహిత్యం అని పేరు పెట్టుకున్నా, మరో పేరు పెట్టుకున్నా, ప్రతిచోటా socialing సంప్రదాయమే ఎక్కువ. ఇలా చెప్తున్నందుకు చాలామందికి

కోపం రావచ్చు కానీ, నాకు తోచినమాట – ఇది జాలలోకంలో నాప్రస్థానం అన్నాను కనక – నాఅభిప్రాయం మరియు అనుభవం చెప్తాను. ప్రతిచోటా – వేదిక అనండి, పత్రిక అనండి, గుంపు అనండి, ఏదైనా పదిమంది చేరిన చోటు అయిన అంతర్జాలంలో – కొందరు ఉంటారు ఆస్థానవిద్వాంసులలా. పెద్దగుంపు అయితే పదిమందీ, చిన్నగుంపయితే ఐదారుగురు అనుకోవచ్చు. ఆ వేదికమీద ప్రతిరోజు, అక్కడ కాలనియమాన్నిబట్టి, ఒక టపా రాస్తారు. దానిమీద కొందరు వ్యాఖ్యలు రాస్తారు. ఈవ్యాఖ్యలు రాసేవారు కూడా ఆస్థానవిద్వాంసులలాగే సుస్థిరంగా ఉంటారు. వీరి టపాలకీ వ్యాఖ్యలకీ వ్యాఖ్యలూ, ప్రతిస్పందనలూ రాసేవారు మరో నలుగురు ఉంటారు.

మిగతా సభ్యులూ, పాఠకులూ పైవారికిందే లెఖ్ఖ. అపార్థం చేసుకోకండి. కొన్ని చోట్ల పైవారిని ఆదరించినట్టే అతిథిమర్యాదలు చేస్తారు. అంటే వాళ్లు టపాలు రాస్తే మరొకరో ఇద్దరో ఇమోజీలతో సరిపుచ్చుతారు. కొన్ని టపాలకి అది కూడా ఉండదు. ఒకటి రెండు వ్యాఖ్యలుంటే గొప్పే. వస్తూ పోతూంటేనే చుట్టరికాలు అని సామెత ఉంది చూడండి. అలాటిదే ఈ గుంపులలో మిగతావారి స్థానం కూడా. ఇంకా కఠినంగా చెప్పాలంటే ఈనాడు సమాజంలో ప్రతి ఒక్కరి స్థానం వ్యాపారసరళిలోనే సాగుతోంది. అంతర్జాలంలోనూ అంతే. ముద్దుగా networking అని పిలుచుకుంటారు. నేను ఈనాటిసమాజంలో networkingకి దూరంగా ఉన్నాను. అంతర్జాలంలోనూ అంతే.

నేను చూసినంతలో ఈ గుంపుతత్వం లేని ఒక వనరు యూట్యూబు. అక్కడ నాకు కావలిసినవి చూస్తాను. వ్యాఖ్యలు పెట్టడం చాలా తక్కువ. ఇప్పుడు అసలు వ్యాఖ్యవసతి తీసేసేరు వాళ్లు. అంచేత ఇంక ఆ పని కూడా లేదు. (తా.క. ఇప్పుడు కొందరు ఉంచుతున్నారు. కొందరు తీసేస్తున్నారు. అంటే పోస్టు పెట్టేవారి ఇష్టం. - 11.01.2025)

యూట్యూబులో కుప్పా విశ్వనాథశర్మగారు వ్యాసులవారి భాగవతం వివరించడం నాకు నచ్చింది. నిజానికి అది వినడానికి కారణం సంస్కృతభాష అర్థం చేసుకోడంకోసమే. ఆయన ప్రతిపదార్థం ఇస్తున్నారు. అంచేత. అలాగే పతంజలి యోగసూత్రాలకు వారివ్యాఖ్యానం కూడా. రోజుకొక శ్లోకం చెప్తున్నారు అంటే వివరణ కొంచెం ఎక్కువగానే ఉంటుంది. కొన్నిటిలో లోకసామాన్యమైన కథలు కూడా. నేను ఇంతకుముందు కొన్ని విశ్లేషణలు చదివేను కనక కొంత పునశ్చరణ కూడా అవుతోంది నాకు.

నేను ప్రధానంగా మనిషితత్వం తెలుసుకోడానికి కథలు రాసేను. సంస్కృతంలో వాక్యనిర్మాణం తెలుసుకోడానికి ఈ భాగవతం విన్నాను కొంతకాలం. పునశ్చరణ చాలా ఉంది భాగవతంలో అని తెలిసింది. కథలు ఎలా పొడిగించాలో వ్యాసమహర్షికి తెలిసినంతగా మనకి తెలీదు అనిపించింది.

నాజీవితంలో చాలామందే వచ్చేరు, వెళ్లిపోయేరు. చాలామందిని నేనే దూరం చేసుకున్నాను. ఇది నావికారం అనుకోవచ్చు కానీ పట్టి చూస్తే తెలిసేదేమిటంటే ఎవరైనా కొత్తలో కనిపించగానే ఏదో ఒకఅంశం నచ్చి వారితో స్నేహం చేస్తాం. కొంతకాలం అయేసరికి, వారినిగురించి మనకీ, మనగురించి వారికి కొత్త విషయాలు తెలుస్తాయి. కొన్ని నచ్చుతాయి. కొన్నిటితో సర్దుకుపోతాం. ఒకొకప్పుడు ఒక నచ్చనివిషయం పొడుచుకొచ్చి ఆ స్నేహబంధాన్ని తెంచివేస్తుంది. వాస్తవంలో సమాజంలో జరిగేది అదే. కనీసం నావిషయంలో అదే జరిగింది. అంతర్జాలంలో ప్రవేశించేక కూడా అచ్చంగా అలాగే జరిగింది.

ఆఖరికి గ్రహించిందినదేటి అంటే, సృష్టికి ప్రతిసృష్టి అంతర్జాలం. మనిషిలో ఎన్ని వికారాలున్నాయో అన్ని వికారాలు అంతర్జాలంలోనూ ఉన్నాయి. చిన్నప్పుడు కథలు రాయడం, ఇప్పుడు అంతర్జాలంలో కథలు వినడం చూస్తే, ఒక చుట్టు చుట్టి మళ్లీ మొదటికి వచ్చినట్టుంది చుట్టి చుట్టి పక్షులు గూడు చేరినట్టు. ఇంక పూర్తిగా ప్రశాంతత సాదించినట్టు అనిపిస్తోంది.

ఇంతటితో సమాప్తం.

(నవంబర్ 6, 2023)

(**తా.క.** ఇప్పుడు అంటే రెండేళ్లతరవాత మళ్లీ చూస్తుంటే అనిపించింది, అప్పటికీ ఇప్పటికీ నేను మారలేదు. ఆధునికసాహిత్యపు తీరుతెన్నులు మారేయి. అలాగే యూట్యూబు కూడా మరింతగా వ్యాప్తి చెందింది. ఇప్పుడు యూట్యూబులో కూడా ముఖపుస్తకంలోలాగే లేని సమాచారం లేదు. నిజానికి నాతత్వానికి పడనిది ఇది. ఉక్కిరిబిక్కిరి చేసేస్తూ అపారంగా సమాచారం నేను తట్టుకోలేను. - నవంబరు 2, 2025.)

మనవాళ్ల అనువాదాలసరదా

ఇప్పుడు ఆదానప్రదానాలు అనబడు networking శకంలో ఉన్నాం. కొండొకచో "మీరు నాలాభం చూడండి. నేను నాలాభం చూసుకుంటాను" అన్నసూత్రం నమ్మినవారు కూడా కనిపిస్తున్నారు. నాపూర్వరాజన్మకృతకర్మఫలం కాబోలు.

నేను తూలిక.నెట్ ధ్యేయానికి అనుగుణమైనకథలు ఎంచుకుని అనువాదాలు చేస్తున్నాను. ఆధ్యేయానికి అట్టే సంబంధంలేని కథలు కూడా చేసేను. నాతప్పే. ఆకారణాలన్నీ ఇక్కడ అక్కర్లేదు కానీ ఇకమీదట ఇంకొంచెం జాగ్రత్తగా ఉంటానని మాత్రం చెప్పగలను. ఈవిషయం వీలయినచోటల్లా చెప్తూ వస్తున్నాను కూడా. నిజానికి కొత్త కాదు. ప్రతి పత్రికలోనూ వ్యవస్థాపకులు ఆపత్రిక ఎందుకు పెట్టేరో, వారి ధ్యేయం ఏమిటో చెప్తారు. ఉదాహరణకి విశాలాంధ్ర ధ్యేయం చూడండి. అందులో దైవభక్తికథలు ఉండవు. అలాగే భాషవిషయంలోనూ. సాహిత్య ఎకాడమీ ధ్యేయం మనదేశంలోనే ఒక రాష్ట్రంలో ఆచారవ్యవహారాలగురించి మిగతా రాష్ట్రాలలో పాఠకులకి తెలియడంకోసం అని తామే చెప్పుకున్నారు. అంచేత అక్కడ ఇండియనింగ్లీషు సమ్మతము. నాధ్యేయం విదేశీపాఠకులు కనక ఇండియనింగ్లీషు తగదు. ఇది ఎవరైనా గమనించేరా? గమనించినట్టు కనిపించదు ముఖ్యంగా వారు పంపినకథలూ, నేను అనువాదం చేయలేదని కోపగించుకున్న రచయితలఆరాటం చూస్తే.

"మాలతి అలా అంటుంది కానీ నేను వేరు కదా" అనుకుంటారేమో ప్రతి ఒక్క రచయిత. పుస్తకం ప్రచురించుకోగానే, లేదా తమకథకి బహుమతి రాగానే నాకు పంపేస్తారు. లేదా మెయిలిచ్చేస్తారు. ఎంతమంది ఆకథనో పుస్తకాన్నో మెచ్చుకున్నారో కూడా చెప్తారు. వారి అభిప్రాయం తేటతెల్లమే. ఏదో ఒకరకంగా నేను ఆపుస్తకంగురించో కథగురించో నాబ్లాగులోనో సైటులోనో ఓటపా రాయాలి. లేదా అనువాదం చెయ్యాలి. ఒక మహారచయిత్రి నాకు ఫోను చేసి తన నవలే అనువాదం చేసి, ప్రచురించే ఏర్పాటు కూడా చేయమని అడిగింది అంటే మీరు ఆలోచించవచ్చు. నాసేవలన్నీ ఉచితం అని కూడా చాలామంది గ్రహించేరనే అనిపిస్తుంది ఇండియాలోనే ఉన్న, ఎవార్డులు పొందిన అనువాదకులు ఇండియాలో ఉండగా నన్నెందుకు అడగడం అనుకుంటే. ఎలాగంటే, వీరు మరేవిధంగానూ ఎక్కడా నాప్రసక్తి చేయరు. తమకథలు నేను అనువదించినప్పుడు కూడా తమకథ ఇంగ్లీషులోకి అనువాదం

అయిందని చెప్పుకుంటారు కానీ ఎవరు చేసేరో, ఎందుకు చేసేరో, అది ప్రచురించిన సైటు (నాదే, తూలిక.నెట్) ఏ ధ్యేయంతో కొనసాగుతోందో – వంటివి ప్రస్తావించరు. ఒక్కమాటలో నాసైటుకి ఏవిలువా లేదు. ఇక్కడ network పనిచేయలేదన్నమాటే కదా. (హాహా)

ఆమధ్య బేతవోలు రామబ్రహ్మంగారు నేను తల్లావఝ్ఝుల పతంజలిశాస్త్రికథలు ఎందుకు అనువాదం చేయలేదని దెప్పినట్టు అనిపించింది. పతంజలిశాస్త్రికథలు అన్నపుస్తకానికి ముందుమాటలో రామబ్రహ్మంగారి వాక్యం , “తెలుగుకథలు సంపుటాలకు సంపుటాలుగా ఆంగ్లీకరించిన నిడదవోలు మాలతిగారి దృష్టి వీరికథలమీద ఇంతరవరకూ పడినట్టు లేదు,” అని. నేను పుస్తకం చూడలేదు. కానీ రామబ్రహ్మంగారి ముందుమాటలో ఈపేజీ నాకు కాపీ చేసి పంపించేరు ఒకరు. “ఇప్పుడైనా చేస్తారేమోన”ని అంటూ. ప్రత్యేకించి నాపేరు అలా అక్షరగతం చేయాలని ఆ ముందుమాటరచయితకి ఎందుకు తోచింది? నాఅనువాదంమీద ఏమాత్రమో గౌరవం ఉండి అనుకోవచ్చునా? మరి నేను ఇంతరవకూ చేసిన అనువాదాలగురించి ఎక్కడైనా విశ్లేషణాత్మకంగా ప్రస్తావించేరా? అసలు నా సైటు తూలిక.నెట్ చూసేరా?

నిజానికి నాకు పతంజలి శాస్త్రిని బాగానే తెలుసు. ఆయనకథలు నేను అనువాదం చేయను అంటూ ఎక్కడా ఎప్పుడూ అనలేదు. ఇంతకంటె ఎక్కువ ఇక్కడ ప్రస్తావించను కానీ బేతవోలు రామబ్రహ్మంగారు ప్రదర్శించిన attitudeగురించే ఇక్కడ నాప్రస్తావన. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ముగ్గురూ - బేతవోలు రామబ్రహ్మం, పతంజలిశాస్త్రి, కాపీ పంపినపాఠకుడు - కూడా నాసైటు చూడలేదు. ఆసైటు ధ్యేయం ఏమిటో తెలుసుకునే ప్రయత్నమూ చేయలేదు. నేను పతంజలిశాస్త్రి కథ అనువాదం చేయలేదన్న బాధ ఒక్కటే వారికి. ఫలానాకథ అని కూడా లేదు, అంతకంటె అపహాస్యం ఎక్కడుంటుంది?

నేను అనువాదాలు ఎందుకు చేయలేదని నన్ను రొక్కించి అడిగేవారిలో ఇంతవరకూ చేసిన అనువాదాలను సవిస్తరంగా ప్రస్తావించినవారు ఒక్కరైనా లేరు. పైగా వాళ్లు నాకు చెప్పే కారణాలు కూడా గౌరవప్రదమైనవి కావు.

కవనశర్మ నాతోనే అన్నాడు, “స్వయంగా రాయలేనివారే అనువాదాలు చేస్తార”ని. మీరా సుబ్రహ్మణ్యం, ”అనువాదాలు చేసుకోడానికి టైమెక్కడుంది, కొత్తకథలు రాసుకోడానికి చాలడంలేదు టైం” అంది. ఇప్పుడు తనే చేసుకుని ఏదో ఇ-స్త్రీ పత్రికలో ప్రచురించుకుంటున్నారు. ఇప్పుడు టైం

ఎలా వచ్చిందో మరి. ఇలాటివి చూస్తున్నప్పుడు నాకనిపిస్తుంది అనువాదం కావాలన్న కాంక్షే కానీ ఎందుకు అనువాదాలు చేస్తారో ఆలోచించరు. ఉదాహరణకి, సాహిత్య ఎకాడమీ ధ్యేయం ఒక రాష్ట్రంతాలూకు ఆచారవ్యవహారాలు మిగతా రాష్ట్రాలకు తెలియడంకోసం అని. అంచేత అక్కడ ఇండియనింగ్లీషు సముచితం. నేను విదేశీపాఠకులకోసం అనువాదిస్తున్నాను కనక వారికి ఆసక్తిగల ఇతివృత్తం, అర్థమయేభాష కావాలి. ఇది ఎవరూ అర్థం చేసుకోరు చెప్పినా కూడా.

మహారచయితలూ రచయిత్రులూ పుస్తకాలూ, కథలూ నాకు పంపేయడమే కానీ, తూలిక సైటు ధ్యేయం ఏమిటో, ఏకథలు అంగీకరిస్తానో పరిశీలించి చూడరు. అసలు వారికి ఆదృష్టే లేదు. ఈసైటుగురించి

(నవంబరు 23, 2005)

సాంకేతికంగురించి రెండుమాటలు

నాసాహిత్యం, సమాజంగురించి చెప్పేక, నా సాంకేతికపరిజ్ఞానం లేక ఆకతాయి చేతలగురించి కూడా రెండు మాటలు చెప్పకపోతే, నాకథ పూర్తి కాదు. ఇంతకుముందు నాలుగో ఐదో టపాలు రాసేను ఈవిషయంగురించి. ఎన్నెమ్మకతలు అన్న సంపుటాలలో ఉంటాయి. (అనే అనుకుంటున్నాను.) అంచేత ఇటీవలి అనుభవాలు రెండు మూడు చెప్పి ఈ అధ్యాయం ముగించేస్తాను.

వారు ఉచితంగా ఇచ్చే కస్టమరు సర్వీసు ఎంత ఘోరం అంటే దానిమీద ఓ పెద్ద పుస్తకం రాసేయొచ్చు. హా. పేరులూ సా. పేరులు అని పుస్తకానికి పేరు కూడా పెట్టేసేను. కథ రాయడమే తరువాయి.

ప్రస్తుతానికి, అసలుకథ సూక్ష్మంగా ఇదీ. మామూలుగా నేనెప్పుడూ రిజిస్టరు చేసుకోమంటేనూ ఉచితంగా దింపుకోండి అంటేనూ వినిపించుకోను. ఎందుకంటే ఆ ఉచిత సౌకర్యాలన్నీ అలా మాట ఇవ్వడంవరకే. ఆ తరవాత దాన్ని వాడుకోబోతే ఖరీదు ఇచ్చుకోమంటాడు. దింపుకోడం ఎందుకూ వాడుకోడానికి కాకపోతే.

ఈమధ్య ప్రతి సైటూ మేం నీ password గుప్తంగా ఉంచుతాం అంటూ హామీలమీద హామీలు ఇచ్చేస్తున్నారు. అంటారు కానీ అది జరగని పనే. ఈమధ్య ఫేస్బుక్కులో చూస్తున్నాను. ఏ లంకుమీద నొచ్చినా తిప్పలే. ఏదో వైరస్ తగులుకుని మరింక నన్ను ముందుకు పోనివ్వదు. దాన్ని వదిలించుకోడానికి నానా అవస్థలూను. అంచేత read more అన్నలింకు నొక్కడం మానేశాను. నేను నిజంగా చదవాలి అనుకునేవారు నేరుగా పూర్తిగా ఇక్కడే ఎందుకివ్వకూడదూ అనుకుంటాను.

అలాగే మరేదో సా.పేరు లాప్టాపుని పరిశుద్ధపరచడానికి కొని, ఉపయోగించబోతేను. ఏవో చిక్కులు తొలగించేనని చెప్పి ఊరుకోలేదు. ఇంకా ఉన్నాయని వాటిని తొలగించడానికి మరో గుప్పెడు డాలర్లు ఇచ్చుకోమంటారు.

అసలింతకీ ఇదంతా ఎందుకు మొదలుపెట్టేనంటే ఇప్పుడు కొత్తగా వచ్చిన మరో చిక్కుతో. మనం ఎంత జాగ్రత్తగా ఎంతమందిని అడిగి నిర్ణయించుకునే కొత్త కష్టాలతో.

నాలాప్టాపు కొని నాలుగేళ్లయింది. బాటరీ మార్చవలసిన అవుసరం వచ్చింది. వెంటనే మీకు అనిపించేదేమిటి. బాటరేయే కదా అని కదా. నేనూ అలాగే అనుకున్నాను. అనుకుని, లాప్టాపుని అటూ ఇటూ తిప్పి చూసేను. మామూలుగా ఇలాటి సందర్భాలలో కనిపించిన స్క్రూలన్నీ ఊడదీసి చూస్తాను. ఎక్కడో అక్కడ ఏదో ఒకటి కనిపించకపోతుందా అని. ఇప్పుడు కూడా ఎలాటి బేటరీనో అని చూడడంకోసం.

నావల్ల కాదని అనతికాలంలోనే తెలిసిపోయింది. సరే అనే సాంకేతిక నిపుణలైన రిపేరరులని పిలిచేను. వాళ్ల స్టోరులకి తీసుకురమ్మన్నారు. ఒకరితరవాత ఒకరు. ప్రతిఒక్కరూ చెప్పినమాట ఒక్కటే. “బాటరీ రిప్లేసు చేస్తాను. ఈలాప్టాపులో కాదు.”

ఆఖరికి నేను కొన్న షాపుకే తీసుకెళ్లేను. అక్కడ కూడా మాట చెప్పి, మరొక సలహా ఇచ్చేడు ఆ నిపుణ రిపేరరు. అదేమిటంటే వారు నాలాప్టాపు తీసుకుని వాళ్ల మెయిన్ ఆఫీసుకి పంపుతారు. అలా పంపడానికి ఛార్జి 80 డా. ఆ మెయినాఫీసులో కూడా రిపేరు చెయ్యరు. కానీ అలా చేసినట్టు నటించడానికి నువ్వు 700 డా. ఇచ్చుకోవాలి.

నాకు మాట తోచలేదు. ఈ లాప్టాపు, MS Surface 3 లో ఎవరూ, దాన్ని పుట్టించిన బ్రహ్మ కూడా మరో బేటరీ పెట్టలేడు. ఇందులో బేటరీ తెరవెనక ఉందిట. ఆ తెరని విడదీయబోతే, విరిగిపోతుందిట. అంత ఖరారుగా తెర విరిగిపోతుందని వారు గ్రహించలేదన్నమాట. మరి అది డిఫెక్ట్ కాదా? Defectకి వారిచ్చుకున్న నిర్వచనం ప్రకారం అది defect కాదు. అంచేత దానిఖరీదు వారు ఇచ్చుకోరు. కానీ మనం ప్రయత్నించి చూడమంటే చూస్తారు కానీ దానికి 780 డా ఖర్చు మనకి. ఆ తరవాత ఆ ముక్కాచెక్కలయిన లాపుటాపుని ఏం చెయ్యగలం. నేను ఆ కొత్తబేటరీ ఆశ వదిలేసుకుని, ప్రస్తుతం power cordతో వాడుకుంటున్నాను దీన్ని.

ఇదంతా చెప్తున్నది మీరు ఈ Surface కొనబోతే చూసుకోండి అని చెప్పడానికి. కంప్యూటరు అనగానే ఎలాటి బాధలు రాగలవో తెలుసుకోడానికి.

ఇలాగే ముందొకసారి నాప్రింటరు చెడిపోయిందని రిపేరుదుకాణానికి తీసుకెళ్తే, ఆషాపువాడు అది బాగవుతుందో లేదో చెప్పడానికి 30 డాలర్లన్నాడు. సరేనన్నాను మర్నాడు వెళ్తే, అది బాగవదు, నువ్వు నాదగ్గర కొత్త ప్రింటరు కొంటే, 30 డాలర్లు తగ్గింపుధర అన్నాడు. నేను ఆలోచిస్తానని చెప్పి ఇంటికి వచ్చేసాను. తరవాత చూస్తే, వాడు ఇస్తానన్న 30 డాలర్లు ప్రింటరు ఖరీదుకి కలిపేడని అర్థమయింది. తగ్గింపు ఏమీ లేదు.

ఇది నాలాటి ఇతర నసాంకేతికులకు పాఠము కాగలదు. ఉచిత సాఫ్టువేరులన్నీ నిజముగా ఉచితము కాకపోవచ్చు. సా.వేరులన్నీ సత్యవంతము కాకపోవచ్చు. అసలు సా.వేరులకీ, హా.వేరులకీ కూడా మనలాటి నసాంకేతికులంటే గిట్టదని రహస్యంగా నాకొక అనుమానం.

చివరిమాటగా, ప్రస్తుతం సా.వేరులలో వస్తున్నమార్పులతో, ఈ సంకలనం కూర్పుకే నానా అవస్థలు అయింది. ఇప్పుడు కొత్తగా వస్తున్న మార్పులతో నాసరదా పూర్తిగా అంతమయినట్టే. ఈమార్పులనీ విజయవంతంగా సాధించినవారికి నాఅభినందనలు.

(నవంబర్ 25, 2025)

చెదురుమదురు ఆలోచనలు

చిలుకజోస్యం

శకునాలు నమ్ముతాను

నాఇష్టాలకి అనువుగా ఉన్నప్పుడు

దైవాధీనం

అని అందుబాటులో ఉన్నవి వదిలేసుకుంటాను

కావలసినవి దొరకలేదని కొరత పడతాను.

వ్యాయామం

కావాలి దీర్ఘాయుష్షుకోసం కాకపోయినా

ఊపిరున్నంతకాలం మరొకరికి బరువు కాకూడదని.

ఆహారనియమం

నీకు ఇష్టమయినట్టు నడుచుకోమని ఈనాటి లోకగీత

తినడమూ అంతే, బతికినంతకాలం బతకబోసేన్న ధీమా.

వ్యాకరణం

కీలమీద వేలు పడకముస్నే కంప్యూటరు కొట్టేస్తుంది పదం

నేను నేర్చిన పదాలూ, గుణింతాలూ పనికిరాకుండా పోయేయి

తప్పులు

తప్పులున్నాయన్న హెచ్చరికలు మితి మీరేక

దిద్ది దిద్ది వేలు అరిగిపోయింది, పాఠకులసంఖ్య పెరగలేదు.

ఆబాధ లేని ఇతరమాధ్యమాలలో స్థిరపడ్డాను. ప్రాణం తెరిపిన పడింది.

ప్రత్యేకాభిమానం

కూరలదుకాణంనించి కూపన్లొస్తాయి

అదే వస్తువు ధర 5 శాతం హెచ్చింపు, కూపను 2 శాతం తగ్గింపు.

ఆదాయం 2, వ్యయం 5

సంగీతజ్ఞానము వినా కచేరీ ...

శాస్త్రజ్ఞానం లేదు కనక సాహిత్యమే నాకు సంగీతం వినడం అంటే.

ఉచ్చారణ బాగుండాలి, భాష తెలుగై ఉండాలి. ప్రక్కవాద్యాలు పరిమితస్థాయిలో ఉండాలి

ఇవన్నీ చూసుకుంటూ, ఇది కాదు, ఇది కాదు అనుకుంటూ

యూట్యూబులో సాగిస్తాను ఇష్ట గానకచేరీవేట.

ప్రతికచేరీ ప్రకటనలతో మొదలు.

ప్రకటనలు చూస్తూ పొద్దు పుచ్చడమైతుందాఖరికి.

నానిర్ణయం నిమిత్తమాత్రం

నాకిష్టమైన క్రీడాకారులు ఆడుతున్నారని మురిసిపోతాను

ఆట మంచి పట్టులో సాగుతూంటుంది.

చటుక్కున తెరమీద నాలుగు ఫీల్డులు కనిపిస్తాయి.

ఏ ఒక్కఆటా సరిగా చూడడానికి లేదు.

అలాటప్పుడే అనిపిస్తుంది మరి ఐఫోనులో చూసేవారికి ఎంత కష్టమో కదా అని.

(జూన్ 19, 2024)

తదనంతరం 2వ భాగం

తెలుగుసాహిత్యంతో సేరుగా సంబంధం లేని అంశాలు రెండోభాగంగా తీసుకున్నాను. అంతేకాదు, నాజీవితం రెండు భాగాలు అనుకుంటే సాహిత్యం ఒకటి, సరయు ఒకటి.

అంతేకాక, తెలుగుతూలిక అనుసరిస్తున్నవారిలో చాలామంది సరయుని అభిమానిస్తున్నారు. అది మరో కారణం.

సరయు బ్లూ (సరయు రావు)

సుమారు పాతికేళ్లయిందనుకుంటాను. నేను చిన్న కాలేజీలో ఓ చిన్న ఉద్యోగం చేస్తున్నాను. నేను పని చేస్తున్నవిభాగం వాళ్లు ఓ సమావేశం ఏర్పాటు చేసేరు. ఆ సమావేశంలో నాపక్కన కూర్చున్నాయన హఠాత్తుగా నావేపు తిరిగి, "సరయు మీఅమ్మాయి కదా?" అని అడిగేడు. నేను ఆశ్చర్యపోయేను. యూనివర్సిటీలో అయితే చాలామందికి నన్నూ మాఅమ్మాయినీ తెలుసు కానీ ఈ కాలేజీలో ఎవరికీ తెలీదనే అనుకున్నాను.

అవునని చెప్పి, "మీకెలా తెలుసు?" అని అడిగేను.

"తన చిన్నప్పుడు, బహుశా 4 ఏళ్లుండొచ్చు. ఒక South Asian Conferenceలో స్టేజిమీద గెంతులేస్తూ తిరిగింది," అన్నాడాయన. ఆ సమావేశం చాలా పెద్దది. అనేకదేశాలనుండి సౌతేషియన్ పండితులు అనేకులు వస్తారు ఆసభలో. అంచేత ఓ చిన్నపిల్ల అలా స్టేజిమీద గింగరాలు తిరగడం మామూలుగా జరిగేపని కాదు. నిజానికి తప్పేమో కూడా. నాకు సరిగా గుర్తు లేదు కానీ ఆయనకి అంతకాలం గుర్తుండడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

అంతకాలం అంటే అప్పటికే సరయు అయోవాలో బియే, San Fransiscoలో master's in Fine Arts పూర్తి చేసి హాలివుడ్ లో నటిగా స్థిరపడింది. అంచేత ఆయన ఆమాట అడిగినప్పుడు ఏ టీవీ షోలోనో చూసేరు కాబోలు అనుకున్నాను. లేదని ఆతరవాతి ప్రశ్నతో తెలిసింది.

"ఇప్పుడేం చేస్తోంది" అని అడిగేరు.

ఏం చెప్పను? "అదే. స్టేజిమీదా తెరమీదా గింగరాలు తిరగడం," అన్నాను.

నిజానికి పిల్లలు స్టేజి ఎక్కడం సర్వసాధారణం. ఒప్పునా ఒప్పదా అని ఆవయసులో ఉండదు. పెద్దలు చెప్పడంచేతోనో, వాళ్లే గ్రహించుకునో అలా పదిముందు హడావుడి చేయడం తగ్గిస్తారు. సరయు మాత్రం అలా తగ్గించలేదు.

తనకి 5,6 ఏళ్లవయసప్పుడు ఇరుగుపొరుగుపిల్లలు, కొంచెం పెద్దవాళ్లే, 10, 12 ఏళ్లవాళ్లు మాయింటికి వచ్చేవారు తనతో ఆడుకోడానికి. తనేమో ఊరికే తనిష్టం వచ్చినట్టు ఇల్లంతా గదిలోంచి గదిలోకి తిరుగుతుంటే తనవెనకే వాళ్లూ తిరిగేవాళ్లు. నాకే ఆశ్చర్యంగా ఉండేది. నాతత్వానికి పూర్తిగా వ్యతిరేకం. నాకు జనం అంటే భయం. తనకి జనమే ప్రాణం. నటులకి జనాన్ని ఆకట్టుకునే విద్య మంచి గుణమే.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఈరోజుల్లో తల్లిదండ్రులలాగ తనని కూర్చోబెట్టి, తనచదువుగురించి చర్చించే తెలివితేటలు నాకు లేకపోయేయి. తన నిర్ణయాలన్నీ తనే చేసుకుంది. నేనెప్పుడూ ఇలా చెయ్యి అని కానీ, చెయ్యకూడదనీ చెప్పలేదు. నిజానికి నేను అమాయకంగా తను చేస్తున్నవన్నీ ప్రేక్షకురాలిలా చూసేనే కానీ మార్గదర్శకం కాలేకపోయేను.

తను సినిమాల్లో చేరేక నేను అడిగి తెలుసుకున్నాను, నటన వృత్తిగా స్వీకరించడం ఎలా జరిగిందని.

15ఏళ్లప్పుడు హైస్కూల్లో పిపిన్ నాటకంలో నటించేక, ఇదే నావృత్తి అని నిర్ణయించేసుకుందిట. నేనెంత అంటీ ముట్టనట్టు ఉంటానో నాటపాల్లో చెప్తుంటాను. చూసేరా, మాయింట్లో కూడా నేను అంతే. ఒకవిధంగా మాఅమ్మా నాన్నగారూ కూడా చదువు ముఖ్యం అన్నారు కానీ ఇది చదువు అని చెప్పలేదు. అమెరికా వచ్చేక, నాకు ఈ సమాజం తీరుతెన్నులు అర్థం కాక మరింత దూరం అయిపోయేను.

ఇంతకీ ఇదంతా చెప్తున్నది సరయు ఎంత చక్కగా తనజీవితాన్ని తనే తీర్చి దిద్దుకుందో చెప్పడానికే. ఇది నేపథ్యం.

పోతే, హాలివుడ్ లో నెగ్గుకురావడం మరింత సంక్లిషతతో కూడినది. మన సినిమారంగంలో కూడా సావిత్రి, పద్మనాభంవంటివారు పడిన అవస్థలు చాలామందికి తెలిసినవే. అంతకి వందరెట్లు కష్టం హాలివుడ్ లో.

హాలీవుడ్ లో విజయం సాధించడం ఎంత శ్రమో హాలివుడ్ సినిమారంగం అనుసరించేవారికి అవగతమే. మరీ అట్టే కాదు కానీ, సరయు అప్పుడప్పుడు ఇంటర్వ్యూలలో చర్చిస్తుంది. కేవలం నటనాసామర్థ్యం ఒక్కటే చాలదు. ఆధునికప్రపంచంలో అన్ని రంగాలలోలాగే రంగుతోలుమూలంగా అవకాశాలు అంత సులభంగా దొరకవు. Diversityకి విలువ యిస్తున్నాం అంటూ రంగుతోలున్న నటులని బుక్ చేస్తారు కానీ వారి ప్రతిభని గుర్తించేవిధంగా ఉండవు పాత్రలు. బహుశా ఒక కారణం ప్రేక్షకులు అనుకుంటాను. చూసేవారు తెల్లవారే ఎక్కవ కావడం చేత, తెల్లవారు కాని నటులకి ఆదరణ తక్కువే.

అలా రంగుతోలువారికి అవకాశాలు ఇవ్వాలని కొంతకాలంగా జరుగుతున్న ఆందోళనమూలంగా ఇటీవలే పరిస్థితులు మెరుగు పడుతున్నాయి. ఆవరసలోనే I feel Bad అన్న సీరీసులో సరయుని ప్రధానపాత్రగా తీసుకోడం జరిగింది. నిజానికి ఆ సీరీస్ కి ఆధారమైన నవలలో ప్రధానపాత్ర తెల్లఅమ్మాయే. సరయుని ఆడిషను చేసేక, ఆపాత్రని ఇండియనుగా మార్చి తనని బుక్

చేసుకున్నారు. హాలీవుడ్ సినిమాలలో భారతీయనటి ప్రధానపాత్రగా తీసుకోవడం ఇదే మొదలు. ఇంతకుముందు Mindy Kaling సీరీస్ వచ్చింది. కానీ ఆ సీరీస్ ప్రొడ్యూసర్ ఆ అమ్మాయే. అందుకు, I Feel Bad తొలిసారి అన్నాను. మళ్లీ ఇటీవల విడుదల అయిన Expats లో కూడా ముగ్గురిలో ఒక ప్రధానపాత్రగా తనని తీసుకోడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఈ సీరీస్ విషయంలో కూడా I Feel Bad లో లాగే, నవలలో ప్రధానపాత్ర ఇండియను కాకపోయినా, సరయు ఆడిషను చూసి, ఆ పాత్రని పంజాబీఅమ్మాయిగా మార్చేరు.

ఈ సాయంత్రం (మార్చి 11, సోమవారం) CAPEUSA అనే సంస్థ తెల్లజాతికి చెందని, మరియు ప్రతిభావంతులైన నటీమణులని సత్కరిస్తోంది. వారిలో సరయు బ్లూ కూడా ఉండడం ముదావహం. Emmy ప్రస్తావనలు జరుగుతున్నట్టు కింవదంతి. ఈ శుభసందర్భంలో మాఅమ్మాయిని గురించి నాలుగుమాటలు మీకు చెప్పాలనిపించి రాస్తున్నాను.

ఈ సీరీస్ సందర్భంలో చాలా ఇంటర్వ్యూలే ఇచ్చింది. వాటిలో ఒకటి –

https://deadline.com/2024/01/expats-sarayu-blue-fighting-equity-interview-1235805527/

Expats TV miniseries ఎమెజాన్ ప్రైమ్ siteలో చూడవచ్చు. ఈనాటి సత్కార సభవివరాలకి లింకుhttps://www.capeusa.org/radiance

చి.సౌ. సరయుకి నా మనఃపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు.

(మార్చి 11, 2024)

Sarayu Blue's speech in Sirikona award ceremony

I'm so very honored to see my mother's brilliant work, and lifelong career recognized. Thank you to the Sirikona Group, and to all who comprise it, for this important and invaluable distinction. Many of you know her as a highly revered scholar, writer, and a woman passionate about carrying on the legacy of Telugu women writers. I know her for another role I revere equally highly, my mother. So, while I'm not qualified to speak to you as a fellow scholar, I will speak to you about her impact on me as my mother.

My mother's journey was not an easy one. You may or may not know, she moved from India to Wisconsin at 36, having never seen snow! America from India is culture shock enough, let alone trudging through mountains of snow in a sari and boots. Regardless, snow or not, nothing ever stopped her. The word that comes to mind when I think of my mother is "resilient." With every plot twist, turn, and curveball life threw at her, my mother found her way, and somehow, she always did so creatively as well. In fact, I don't remember my mother ever experiencing "writer's block." I'm sure she did, and just didn't talk about it. She's never been one to spend much time wallowing.

Through the years, I've seen that no matter where she is, or who she's with, people flock to my mother. Malathi Nidadavolu is revered, by not only those, like this wonderful group who recognize her talents, but also, by all she meets. When my mother speaks, people listen. And who wouldn't? She's thoughtful, full of wisdom, she's charismatic, and most of all, she's genuine. She's very honest with her boundaries- make no mistake- but she'll never turn a blind eye to anyone in need.

Perhaps the quality I admire the most about my mom though, is her integrity. My mother will never lie, she'll never cheat, she is steadfast in her honesty, and her work

is always impeccable. She is diligent in making sure her translations honor the writer, the story, the language. And while her translations are perfectly meticulous, her stories are heartfelt and poetic.

I've always known my mom to be a magnificent storyteller. And as I've gotten older, I've seen firsthand, why- she's relentlessly curious. On any walk, she'll stop to appreciate a tree, to photograph a flower, she sees a shape in the clouds and it becomes a whole new world, a story. She's also relentlessly curious about people, and why they behave the way they do. She cares passionately about humanity, and there is little that infuriates her like injustice. So much of who I am, is because of her. I hear her voice in mine when I advocate for someone's rights. I feel her heart in mine when I get lost looking out a window, staring at the trees and daydreaming. I know the reason I became an actor was because of her. Ultimately, acting is just my version of storytelling, telling the story of whatever character I'm playing. I'm overjoyed to see the legacy and work of my mother recognized, and while from the outside it might seem as though I have not followed in mother's footsteps, to quote a line from E.E. Cummings' poem, i carry your heart with me(I carry it in), "whatever is done by only me, is your doing."

— Sarayu Blue



Sarayu and Malathi at awards ceremony

(September 14, 2022)

EXPATS, MINISERIES. 2024. REVIEW

By Nidadavolu Malathi

Expats is close to my heart, naturally. However, I found there is more to be said about this series. In several ways, it is not the usual, run-of-the mill show. It has been done with artistic flair. It addresses human emotions we feel deep down in our hearts. Some of us only know them as passing phases; there are others who live through with intense emotional consequences, and at the end, come to terms with the turmoils in their lives.

The Expats series is noted as a critically acclaimed series, specifically for its quality acting and directing by Emmy award winning director Lulu Wang.

Simply put, it is a powerful illustration of poignant, life-changing perceptions of grief, motherhood, and life's other challenges. It provokes viewers into thinking on some hard-pressed issues in life.

Basically, the series addresses highly charged emotions of three expats in Hong Kong. To understand the two main characters, Margaret and Hilary, we need to sift through all the 6 episodes, and figure out where their behaviors were coming from, and why they were acting the way they did.

First, let's see Margaret. In the first episode, she makes a passing reference to a tragedy ("… defined by a tragedy."). In ep 2, we learn the tragedy was losing her child in a mall. Other factors that contribute to the gravity of her grief were: 1. She had the child, Gus, late in her life; 2. She did not want that pregnancy at first, but she became very fond of him after he was born (ep 4. Her chat with Hilary), and, 3. She

left Gus in Mercy's care, which led to his disappearance.

All these harrowing experiences lead Margaret to a terrifying thought that she failed Gus as a mother. The tragedy was overwhelming to her and soon finding the kid becomes her sole purpose in life to the exclusion of all others and their needs or feelings. Nicole Kidman as a distraught mother haunted by her desire to find Gus is august, and befitting her reputation. There is no other way to recreate Margaret.

Hilary is beset by self-doubt, universal I might add, motherhood as a defining coefficient. At first, she and her husband, David, had agreed not to have kids, but David changed his mind (ep 4. Her chat with Olivia.). As Hilary feels pressure from friends (Margaret, Olivia), her mother, and other socialites, she slips into an introspective reverie as to why, or if at all, a woman is defined by her status as a mother. While bearing a child for David is a critical issue in their crumbling life, the role of Gus's disappearance is not to be ignored. Margaret suspected David of stealing Gus, and Hilary was not quick enough to defend him. That was an added sour point for David.

Saryau Blue as Hilary has given a stellar performance. She wanted to save her marriage, despite David's infidelity, but not at the expense of losing her own self-respect. Various conflicting emotions in her, her confrontation with David, her arguments with her indigenous mother and father, and the denoument in ep. 6 are depicted superbly.

I have read a few comments referring to the Emmy level quality of her performance, and I agree with them.

Mercy's character sets apart from the other two in the sense she belongs to current generation. Hilary and Margaret appear to be in their 40s or late 40s, Mercy has a college degree and a job, (we learn from her chat with her friend, Charly, in ep. 6.) and adventurous. She too has a problem, though. She grew up, feeling she was

cursed. That belief plays out the way she handles her encounter with David, and later, her pregnancy.

When Mercy asks Margaret if she would take her child, bewildered Margaret asks, “Don’t you want your baby?” There again the topic of motherhood arises. Apparently, Gus was on their minds, each for her own reason.

In the final episode, Hilary comes to terms with her situation and moves on. Mercy also finds a way out for her unexpected pregnancy, and moves on. Margaret continues her search for Gus; actually, that becomes her only purpose in life.

While most of the series is focused on the haves, one episode, ep 5 is exclusively devoted to illustrate the lives of the have nots, namely, the helpers, who are also expats from Philippines. I was very much drawn to this episode. I have always wanted to know the lives of these “helpers” from their perspective. They are also people, real people with their own mode of thinking and living. I may be side-stepping, but I have to say this. Most of the Telugu writers depict the working class people from their perspective of their own standards.

. In Expats, director Lulu Wang meticulously took steps to present them with great authenticity. She said her family was her inspiration. In that, I would say she has succeeded in presenting them as thinking, enjoying people in flesh and blood.

I was blown away by the artistry of this series. Episode after episode, it doles out very poignant points in small dosages. That is just the way I like it.

Before I end my review, here is a warning. There are 3 scenes with sexual content close to x-rated, rather than 18+ as producers claimed. My heartfelt compliments to all the actors, director and writers.

(February 29, 2024)

My Notes to my Daughter

(part-fiction)

A few random thoughts of mine, following a little conversation I had with my daughter. Since I had not thought about any such thing, previously, I should say it was extemporaneous. Just a few thoughts about things which were on my mind. Written in September-October, 2025.

Full text is too long to add here. It is available on archive.org. Here is the link for the monograph. Click here

- Nidadavolu Malathi

(11.13.2025)


నాసాహిత్యసేవ వివరాలు

నిడదవోలు మాలతి తెవికీలో ఇక్కడ

Nidadavolu Malathi on wikipedia in English here

నిడదవోలు మాలతి రచనలు ఆర్కైవ్.ఆర్గ్ లో ఇక్కడ

ఆర్కైవ్.ఆర్గ్ లో నాపేజీ



శుభమస్తు.